ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ
epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
రాజమహేంద్రవరం
: fb.com/vaartha Digital
Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
28-3-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 55 పేజీలు: 12 వెల: 6.50

**భారత్‌లో పర్యటనకు పుతిన్ అంగీకారం**
5లో
**2వేల వీసా అపాయింట్‌మెంట్లు రద్దు చేసిన అమెరికా**

# రెండేళ్లలో పోలవరం పూర్తి

## 2027 డిసెంబర్ నాటికి కల సాకారం

### 11 యేళ్ల తర్వాత నిర్వాసితులను ఆదుకున్న ఘనత కూటమిదే

### ప్రాజెక్టునుంచి నీరు వదిలేలోపే పునరావాసం పూర్తి

### నిర్మాణ పనులు ఏరియల్ సర్వేద్వారా పరిశీలించిన సిఎం చంద్రబాబు



గురువారం పోలవరం ప్రాజెక్టును సందర్శించి నిర్వాసితుల సమస్యలు తెలుసుకుంటున్న సిఎం చంద్రబాబు

**ఏలూరు/పోలవరం,మార్చి,27, ప్రభాతవార్త :** పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణాన్ని 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారు. ఇప్పటికి 829 కోట్ల రూపాయలు నేరుగా నిర్వాసితుల ఖాతాల్లోకి వేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనని ఆయన అన్నారు. పోలవరానికి నీరు వదిలే ముందే నిర్వాసితులందరికీ పునరావాసం పూర్తి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. పోలవరం ప్రాజెక్టు ఎపికి జీవనాడి. ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితులకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన అన్నారు.పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను సిఎం చంద్రబాబు గురువారం ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించారు.అనంతరం నిర్వాసితులతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. 2014లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాకముందు నిర్వాసితులకు చాలా తక్కువ పరిహారం ఇచ్చారని, 2014లో ప్రభుత్వం వచ్చాక రూ. 4,311 కోట్ల పరిహారం చెల్లించినట్లు ఆయన వివరించారు. ప్రాజెక్ట్ నిర్మాణం చురుగ్గా సాగుతున్న తరుణంలో 2019లో కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత ఒక్కసారిగా పనులు నిలిచిపోయాయని ఆయన విచారం వ్యక్తం చేశారు. వైఎస్సార్సీ ప్రభుత్వం ఆవిదేళ్లలో ఒక్కసారి >>2


గురువారం స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ కళాశాలలో నిర్వహించిన సదస్సులో ప్రసంగిస్తున్న మంత్రి నారాయణ

## 2047కు రాష్ట్రంలో మురికివాడలుండవు..

### మౌలికవసతుల కల్పనలో మరింత అభివృద్ధి - మంత్రి నారాయణ

**విజయవాడ,మార్చి27,ప్రభాతవార్తప్రతినిధి:** మన రాష్ట్రాన్ని 2047 నాటికి మురికివాడ (స్లమ్ ఏరియాలు)ల రహితంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతుందని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ మరియు పట్టణాభివృద్ధి మంత్రి నారాయణ అన్నారు. స్వర్ణాంధ్ర 2047పై >>2

## ఉగాది రోజున 'పి4' ప్రారంభానికి ఏర్పాట్లు

### ప్రతి జిల్లాకు ఓ నోడల్ అధికారి: సిఎస్ విజయానంద్



**విజయవాడ,మార్చి27,ప్రభాతవార్తప్రతినిధి:** పి4 విధానాన్ని ఈనెల30వతేది ఆదివారం మధ్యాహ్నం రాష్ట్ర సచివాలయం వెనుక ముఖ్యమంత్రి నారా చంద్రబాబు రాష్ట్ర స్థాయిలో లాంఛనంగా ప్రారంభించనున్నారని అందుకు తగిన పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ పేర్కొన్నారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుండి ఆయన జిల్లా కలక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో వీడియో సమావేశం ద్వారా చేయాల్సిన ఏర్పాట్లపై సమీక్షించారు. పి4 (ప్రభుత్వ, ప్రవేట్,ప్రజల, భాగస్వామ్యం)తో సమాజంలోని పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ఈకార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతోందని తెలిపారు. ముఖ్యంగా సమాజంలో ఉన్నత స్థితిలో ఉన్న 10 శాతం మంది అట్టడుగున ఉన్న 20 శాతం మంది పేదలను దత్తత తీసుకుని వారికి అండగా నిలిచి పేదరికం నుండి పైకి తీసుకురావాలనే ఆశయంతో పి4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. ఇప్పటికే ఈ పి4 విధానంపై ప్రభుత్వం ప్రజల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించడం జరుగుతోందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న పి4 ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఉగాది పర్వదినం నాడు అమరావతి వేదికగా నిలవనుందన్నారు. 30వ తేదీ సాయంత్రం 5గం.ల నుండి రాత్రి 7గం.ల వరకూ ఈకార్యక్రమం జరగనుందన్నారు. ఈ కార్యక్రమానికి వచ్చే వారందరినీ ఆదివారం మధ్యాహ్నం 3గం.ల లోపు వేదిక వద్దకు తీసుకురావాల్సి ఉందని ఆదిశగా అందరు జిల్లా కలక్టర్లు తగిన తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఇప్పటికే ఇందుకు సంబంధించి అమరావతి ప్రధాన వేదిక వద్ద ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమం కోసం రాష్ట్రవ్యాప్తంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల నుండి స్వయం సహాయక >>2

# త్వరలో పట్టాలపైకి 'సూర్యలంక'

### రూ. 97.52 కోట్ల నిధుల విడుదలకు కేంద్రం ఆమోదం

### బీచ్‌లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి

### పర్యాటకులకు పూర్తి సౌకర్యాలతో నిర్మాణాలు: మంత్రి దుర్గేష్



**విజయవాడ,మార్చి27,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని బాపట్ల జిల్లాలో ఉన్న సూర్యలంక బీచ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ స్వదేశీదర్శన్‌స్కీమ్ 2.0 క్రింద రూ.97.52 కోట్ల నిధుల విడుదలకు ఆమోదం లభించిందని మంత్రి కందుల దుర్గేష్ గురువారం ఒకప్రకటనలో పేర్కొన్నారు. త్వరలోనే అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో సూర్యలంక బీచ్ రూపురేఖలు మారుస్తామని మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు. త్వరలోనే సూర్యలంక ప్రాజెక్టు పట్టాలెక్కనుందని, సరికొత్త హంగులతో పర్యాటకులకు దర్శనమివ్వబోతుందని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. ప్రధానంగా సూర్యలంక బీచ్‌లో మౌలిక వసతుల కల్పన, బీచ్‌ను పరిశుభ్రంగా ఉంచే అంశంపై దృష్టిసారించి అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించే విధంగా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. నిధుల వినియోగం విషయానికి వస్తే రూ.15.43 కోట్లతో సూర్యలంక బీచ్‌లో పర్యాటకులకు ఆహ్లాదకరమైన అనుభూతి కల్పన, రూ.4.37 కోట్లతో షాపింగ్ స్ట్రీట్ అభివృద్ధి,రూ. 7.76 కోట్లతో స్థిరమైన పర్యాటకాభివృద్ధి, పర్యాటకుల వాహనాలకు పార్కింగ్ సౌకర్యం, రూ.11.69 కోట్లతో కెనాల్ ఎక్స్‌పీరియన్స్ డెవలప్‌మెంట్, రూ.19.36 కోట్లతో సూర్యలంక ఎక్స్‌పీరియన్స్ జోన్, రూ.18 కోట్లతో ఇతర మౌలిక వసతులు కల్పించనున్నామన్నారు. అనంతరం బ్లూఫ్లాగ్ సర్టిఫికేషన్ కోసం కృషి చేస్తామన్నారు. ఇప్పటికే సూర్యలంక బీచ్ అభివృద్ధి కోసం, పర్యాటకుల స్వర్గధామంగా తీర్చిదిద్దడానికి అవసరమైన ప్రణాళికలతో కూడిన ప్రతిపాదనలు కేంద్రానికి పంపించామన్నారు. ఇటీవల న్యూఢిల్లీ వెళ్లినప్పుడు కేంద్ర పర్యాటక మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను కలిసి సూర్యలంక బీచ్ కు నిధులు ఇవ్వమని కోరానని అందుకు ఆయన సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఈ క్రమంలోనే ఇచ్చిన మాట ప్రకారం త్వరితగతిన నిధులు విడుదలకు ఆమోదం తెలిపినందుకు కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు మంత్రి దుర్గేష్ ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా నూతనటూరిజం పాలసీ, పర్యాటకరంగానికి పరిశ్రమ హోదాకల్పన తదితర వినూత్న నిర్ణయాలతో రాష్ట్ర పర్యాటకాభివృద్ధిని ప్రోత్సహిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లకు మంత్రి కందుల దుర్గేష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనునిత్యం క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తూ, అధికారులకు విలువైనసలహాలు, సూచనలు ఇస్తూ రాష్ట్ర పర్యాటక ప్రగతికి కృషిచేస్తున్న టూరిజంసెక్రటరీ అజయ్ జైన్,ఎండీ ఆమ్రపాలి కాట, పర్యాటకశాఖ అధికారులను మంత్రి దుర్గేష్ అభినందించారు. రాబోయే రోజుల్లో రాష్ట్రానికి మరిన్ని భారీ పర్యాటక ప్రాజెక్టులు వస్తాయని మంత్రి దుర్గేష్ అన్నారు.సమిష్టి కృషితో రాష్ట్రాన్ని పర్యాటకాంధ్రప్రదేశ్ గా తయారుచేసుకుందామని అధికారులకు పిలుపునిచ్చారు. పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తో చొరవతో కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా రాష్ట్ర పర్యాటక రంగానికి రూ.269.86 కోట్లు నిధులు విడుదలయ్యాయి. అందులో భాగంగా ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ శాస్కి స్కీమ్ క్రింద అఖండ గోదావరి, గండికోట ప్రాజెక్టులకు రూ.172.34 కోట్లు మంజూరు కాగా సంబంధిత పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తయ్యింది. తాజాగా బాపట్ల జిల్లాలోని సూర్యలంక బీచ్ కు రూ.97.52 కోట్ల విడుదలకు ఆమోదం లభించింది.పర్యాటక రంగానికి నిధుల వెల్లువతో రాష్ట్ర పర్యాటకానికి మంచి రోజులు వచ్చాయని పలువురు కొనియాడుతున్నారు.


గురువారం విజయవాడలో జరిగిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న సిఎం చంద్రబాబు

## ప్రతి మైనారిటీ కుటుంబాన్ని ఉన్నత స్థితికి తెస్తా

### ప్రభుత్వ ఇఫ్తార్ విందులో సిఎం చంద్రబాబు

**విజయవాడ,మార్చి27,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని ప్రతి ముస్లిమ్ కుటుంబాన్ని ఆర్థికంగా పైకి తీసుకుని వస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. వక్ఫ్‌బోర్డు ఆస్తులను కాపాడతామన్నారు. ముస్లిములందరికి పూర్తి గౌరవం, భద్రత ఇస్తామన్నారు. మత సామరస్యాన్ని కాపాడాతమన్నారు.తెలుగుదేశం పార్టీ మొదటి నుంచి మైనార్టీలకు అండగా ఉందని స్పష్టం చేశారు. వారి సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నామని ఆయన తెలిపారు. గురువారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మైనార్టీ సంక్షేమశాఖ విజయవాడలోని ఓ సమావేశ ప్రాంగణంలో ముస్లిం సోదరులకు ప్రభుత్వం ఇఫ్తార్ విందు ఇచ్చింది. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా >>2

## చేనేత మరమగ్గాలకు ఉచిత విద్యుత్

### రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు

**విజయవాడ.మార్చి27,ప్రభాతవార్తప్రతినిధి:** నేత కార్మికులకు, చేనేత మరమగ్గాలకు ఉచిత విద్యుత్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. కార్మికులకు నెలకు 200 యూనిట్లు, మగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ కల్పిస్తూ పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి ఎన్ యువరాజ్ జిఒ 44ను బుధవారం విడుదల చేశారు. ఈ నిర్ణయం వల్ల 93 వేల మంది కార్మికులకు, 10,534 పవర్ లూమ్స్ కంపెనీలకు లబ్ధి చేకూరుతుం దని ప్రభుత్వం అంచనా వేస్తుంది. చేనేత కార్మికుల మర మగ్గాలకు ఉచిత విద్యుత్తును ఇవ్వాలని ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావే శాల్లో కీలక బిల్లుగా ప్రవేశపెట్టి ఆమోదించారు. ఈ మేరకు ఇప్పుడు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.వీటిని వెంటనే అమలు చేస్తోంది.

# ఇక విదేశాలకు 'వెంకన్న'!



### అన్ని దేశాల్లోనూ తిరుమల తరహాలో ఆలయాల నిర్మాణానికి ప్రణాళికలు

### దేశంలోని రాష్ట్రాల రాజధానులకు విస్తరణ



**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** కోట్లాదిమంది భక్తుల ఇష్టదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వైభవాన్ని, సేవలను ఖండాంతరాలకు వ్యాప్తి చేయడానికి అవసరమైన దేవాలయాల నిర్మాణం చేపట్టాలని తిరుమల తిరుపతి దేవస్థానం నిర్ణయించింది. ఇందుకు ప్రణాళికలు కూడా సిద్ధం చేస్తోంది. నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న తిరుమల ఏడుకొండల వేంకటేశ్వరుడు అందరి దేవుడని, మహిమాన్వితగల స్వామిగా వైఖానస ఆగమోక్తంగా పూజలందుకుంటున్నాడు. హిందువులు ఉన్న ప్రతి చోటా ఆలయాలు ఉండాలనే ధృడ సంకల్పం ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యక్తంచేయడంతో టిటిడి పాలకమండలి, అధికారులు కార్యాచరణ అమలుచేసే దిశగా అడుగులేస్తున్నారు. దేశంలోనేగాక విదేశాల్లోనూ అత్యధికంగా హిందువులు ఉన్న ప్రతి చోటా శ్రీనివాసుడి ఆలయాలు నిర్మాణం చేసి,హిందూ సనాతన ధర్మవ్యాప్తికి మరింతగా కృషి చేయాలనే భావన వ్యక్తమవుతోంది. ఇప్పటికే దేశంలోని అనేక రాష్ట్రాల రాజధానుల్లోనూ వెంకన్న ఆలయాల నిర్మాణం చేయాలని టిటిడి కృత నిశ్చయంతో ఉంది. ఈ మేరకు అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఆయా రాజధానుల్లో ఆలయాల నిర్మాణం కోసం భూమి కేటాయించాలని కోరుతూ లేఖలు కూడా రాశారు. మరికొన్ని రాష్ట్రాలకు లేఖలు రూపంలో విజ్ఞప్తి చేస్తోంది. శేషాచలం కొండల్లోని సప్తగిరులపై సాక్షాత్తు శ్రీమహావిష్ణువే కలియుగంలో శ్రీవేంకటేశ్వరునిగా సాలగ్రామ శిల ద్వారా స్వయంభువుగా ...అర్చనా మూర్తిగా ఆవిర్భవించారనేది పురాణాలద్వారా తెలుస్తున్న విషయం. తిరుమల ఆలయంలో జరిగే తరహాలోనే అన్ని చోట్లా ఆలయాలు నిర్మించి నిత్యం శ్రీవారి కైంకర్యాలు, సేవలు, పూజలు జరిపించి అక్కడి భక్తులకు స్వామివారి దర్శనం కల్పించాలనే అభిప్రాయంతో ముందుకు కదులుతున్నారు. ఇప్పటికే తెలుగురాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణాతోపాటు తమిళనాడు, కర్నాటక, ఒరిస్సా,మహారాష్ట్ర, జమ్మూకాశ్మీర్, ఉత్తరాఖండ్, హర్యానా, కన్యాకుమారి, రామేశ్వరం వంటి నగరా >>2

## యువత ఉపాధికోసం ప్రతినెల జాబ్ మేళా

### రాయలసీమ హార్టీకల్చరల్ హబ్‌గా తీర్చిదిద్దుతాం: సిఎం చంద్రబాబు

**విజయవాడ,మార్చి27,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో పూర్తిస్థాయిలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని సిఎం చంద్రబాబు వెల్లడించారు, రెండు రోజుల కలెక్టర్ల సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నామన్నారు. రెండు రోజులు పాటు జరిగిన జిల్లా కలెక్టర్ల సమావేశంపై గురువారం సిఎంఒ విడుదల చేసిన సమాచార పత్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పలు అంశాలను వివరించారు. ఇప్పటికి మూడు కలెక్టర్ల సమావేశం నిర్వహించామన్నారు. వచ్చే కలెక్టర్ల సదస్సులోగా 175 నియోజకవర్గాల్లోనూ జాబ్ మేళాలు నిర్వహించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ప్రతి 3,6 నెలలకొకసారైనా జరగాలన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి 9 నెలలైనా ఇంకా నైపుణ్య గణన పూర్తికాకపోవడంపై సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక సూచనలు చేశారు. ప్రతి కలెక్టర్ ఇతరులతో పోటీ పడి పనిచేయాలని, సృజనాత్మకంగా ఆలోచించి పాలన సాగించాలని సీఎం దిశానిర్దేశం చేశారు. జోన్4లోని ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల కలెక్టర్లు సమర్పించిన నివేదికపై సీఎం చంద్రబాబు సమీక్షించామన్నారు. వృద్ధి రేటు సాధించడంతోపాటు తలసరి ఆదాయం పెంచుకునేందుకు ఏం చేయాలనే విషయాలను కలెక్టర్లు సూచించాలని సీఎం చెప్పారు. ముఖ్యంగా పాడి పరిశ్రమతోపాటు ఉద్యానవన పంటల సాగుపై రైతులను ప్రోత్సహించాలన్నారు.

రాయలసీమను హార్టీకల్చరల్ హబ్‌గా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. పాడి ద్వారా రైతులకు ఉపాధి కల్పించాలని, ప్రతి పాడి రైతుకు కనీసం రెండు పశువులు ఉండేలా చర్యలు తీసుకోవాలని సిఎం ఆదేశించారు. పాడి పశువుల మేతకు జాతీయ ఉపాధి హామీ పథకం నిధులను వాడుకోవాలని సూచించారు. కరువు వచ్చినా పాడి రైతుల ఉపాధికి ఢోకా ఉండదని, పాడి వృద్ధి చెందితే కూలీలకు ఉపాధి కూడా లభిస్తుందని సీఎం వివరించారు.తిరుపతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌తిరుపతిలో ఏర్పాటు చేయనున్న రతన్ టాటా ఇన్నో వేషన్ హబ్ కు త్వరితగతిన భూమి, భవనాలను సేకరించాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ఈ కేంద్రాల ద్వారా వృత్తి నిపుణులను తయారు చేయాలని సీఎం సూచించారు. రాష్ట్రంలోని ఉన్న ప్రధాన విద్యాలయాలు, వర్సిటీలను నోడల్ కేంద్రాలుగా వినియోగించుకోవాలని సూచించారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్స్ ద్వారా జాతీయ, అంతరా ్జతీయ స్థాయిలో అవసరమైన వృత్తి నిపుణులను తయారు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ కల్పించుకుని జపాన్, జర్మనీ దేశాల్లో హోమ్ కేర్ నర్సులకు శిక్షణ ఇస్తున్నామని సిఎం చంద్రబాబుకు వివరించారు. రాష్ట్రంలో యువతకు ఉపాధి కల్పనకు ప్రతి నెలా క్రమం తప్పకుండా జాబ్ మేళాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు.

## భారీగా పెరగనున్న కేంద్ర జీతాలు, పెన్షన్లు

### త్వరలో 8వ వేతన కమిషన్ సిఫారసులు అమలు

**న్యూఢిల్లీ, మార్చి 27:** ఎనిమిదవ వేతన సవరణసంఘం సిఫారసులు అమలుచేస్తే ప్రస్తుతంమ ధ్యస్థాయి ఉద్యోగులు పొందుతున్న నెలసరి వేతనం లక్షరూపాయలనుంచి 1.15 లక్షల రూపాయలవరకూ పొందుతారని ట్యాక్స్ నిపుణులు పేర్కొంటున్నారు. కేవలం ఉద్యోగుల జీతభత్యాలకే కేంద్ర బడ్జెట్‌లో 1.75 లక్షలకోట్లు కేటాయించిందని దీనివల్ల ఉద్యోగుల జీతభత్యాలు మరింతగా పెరుగుతాయని అంచనా. రెండు లక్షల కోట్లు కేటాయింపులు జరిపితే జీతాలు 1,16,700చొప్పున పెరుగుతాయి. అదే బడ్జెట్‌లో జీతభత్యాలకు 2.25 లక్షలకోట్లు కేటాయింపులు జరిపితే మిడ్‌లెవల్ జీతాలు 1,18,800కు చేరతాయని ట్యాక్స్ నిపుణులు పేర్కొంటున్నారు. ఎనిమిదవ వేతన కమిషన్ 2025 ఏప్రిల్‌నాటికి ఏర్పాటుచేస్తే 2026 లేదా 2027లో వేతనసంఘం సిఫారసులు వస్తాయి. పదేళ్లకోసారి జీతభత్యాల సవరణలకోసం వేతన సంఘాలను నియమిస్తున్నారు ఏడో వేతన సంఘం 2016లో సిఫారసులు అమలుచేసారు. దీనివల్ల ప్రభుత్వంపై 1.02 లక్షలకోట్లుభారం పడింది. సవరించిన జీతాలు, పింఛన్లను 2016 జులైనుంచి అమలులోకి వచానచయి. ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్‌ను 2.57రెట్లుగా అంచనావేసారు. దీనితో మూలవేతనం ఏడువేలనుంచి 18వేలకు పెరిగింది.

అదే ఎనిమిదో వేతనసంఘం సిఫారసులు అమలుకువస్తే మూడు లేదా అంతకుమించి ఉంటుంది. దీనివల్ల ఉద్యోగులకు మరింతగా జీతాలు పెరుగుతాయి. ఉద్యోగసంఘాలు ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్‌ను 2.57 లేదా అంతకుమించి గాని లేదా ఏడో వేతన సంఘానికి అనుగుణంగా మాత్రమే ఉంటుందని అంచనావేస్తున్నాయి. ఆర్థికశాఖ మాజీకార్యదర్శి సుభాష్‌చంద్ర గార్గ్ మాట్లాడుతూ ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్ 1.92గా నిర్ధారించడం అవాస్తవికంగా ఉందని అన్నారు. అలాగే పింఛన్ కూడా ప్రస్తుతం ఉన్న కనీస పింఛన్ రూ.9వేల నుంచి కొత్త వేతన సంఘం సిఫారసులు అమలుకు తెస్తే రూ.25,740లుగా ఉంటుందని ఉద్యోగసంఘాలు పేర్కొంటున్నాయి. ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్‌కూడా 2.86గా ఉంటుందని చెపుతున్నాయి.





గురువారం పోలవరం ప్రాజెక్టు వద్ద నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సిఎం చంద్రబాబు

# రెండేళ్లలో పోలవరం పూర్తి

>> కూడా నిర్వాసితుల గురించి ఆలోచించడం కానీ, పట్టించుకోవడం కానీ చేయలేదని ఆరోపించారు. కనీసం నిర్వాసితుల సమస్యల పట్ల ఆలోచించిన దాఖలాలు కూడా లేవని ఆయన అన్నారు. పోలవరం పూర్తవ్వాలంటే తెలంగాణలోని 7 ముంపు మండలాలు ఎపిలో విలీనం చేయాలని అప్పట్లో ప్రధాని మోడీని ఒప్పించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. వీలైనంత వరకు నిర్వాసితులకు న్యాయం చేసి ఆదుకోవాలని ముందుకెళ్లామని. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిర్వాసితుల అకౌంట్లో రూ.829 కోట్లు జమ చేసినట్లు ఆయన వివరించారు. 2014-19 మధ్య అప్పటి ప్రభుత్వం ఇచ్చే పరిహారం సరిపోదని జగన్ రూ.10 లక్షలు పరిహారం ఇస్తానని అబద్ధపు హామీలు ఇచ్చారని ఆయన ఆరోపించారు. ఐదేళ్ల వైఎస్సార్సీ ప్రభుత్వంలో ఒక్కపైసా బాధితులకు కూడా ఇచ్చింది లేదని. కనీసం వరదలు వచ్చినప్పుడు కూడా మిమ్మల్ని పట్టించుకోలేదని ఆయన విచారం వ్యక్తం చేశారు. మళ్లీ రానున్న రోజుల్లో మీ దగ్గరకు వచ్చి అది చేస్తాం... ఇది చేస్తాం అని చెప్పి మాయమాటలు చెబుతాడని, ప్రజలు అప్రమత్తతో ఉండాలని ఆయన సూచించారు. గత పాలకులు పోలవరం ప్రాజెక్టుకు ఏ గతి పట్టించారో కళ్లారా చూశారని, 2019లో తెలుగు దేశం ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చి ఉండుంటే 2020కి ప్రాజెక్టు పూర్తయ్యేదని ఆయన అన్నారు. ఆలస్యం చేయడం వల్ల ఖర్చు భారీగా పెరిగిపోయిందని, రూ.400 కోట్లతో డయాఫ్రం వాల్ కడితే వైఎస్సార్సీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల కొట్టుకుపోయిందని అన్నారు. ఇప్పుడు మళ్లీ రూ.990 కోట్లతో కొత్త డయాఫ్రం వాల్ నిర్మిస్తున్నామని. ప్రజాధనాన్ని విచ్చలవిడిగా వృథా చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల సొమ్మును ప్రజల కోసమే ఖర్చు చేయాలి తప్ప దుర్వినియోగం చేయకూడదని ఆయన అన్నారు. గత పాలకులు పోలవరం నిధులు మళ్లించారని, తాను సోమవారాన్ని పోలవరంగా మార్చుకుని పనిచేశానని అన్నారు. అప్పట్లో 33 సార్లు ప్రాజెక్టును సందర్శించి ఎప్పటికప్పుడు పనులు పర్యవేక్షించినట్లు చెప్పారు. దళారులు, మోసగాళ్లకు అవకాశం లేకుండా 2027 నాటికి పునరావాసాలు పూర్తి చేస్తామని అన్నారు. కొందరి పేర్లు తొలగించారని బాధితులు చెబుతున్నారని. విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పరిహారం చెల్లిస్తామని, ఏ ఒక్కరికీ అన్యాయం జరగనివ్వమని ఆయన స్పష్టం చేశారు. పోలవరానికి కేంద్రం ఇచ్చిన నిధులను గత పాలకులు ఇతర అవసరాలకు మళ్లించారని, ప్రాజెక్టు సకాలంలో పూర్తయి ఉంటే ఈ ప్రాంత రైతులు ఈ పాటికే స్థిరపడేవారని, పోలవరం హైడల్ ప్రాజెక్టు పూర్తయి ఉంటే రూ. 2,500 కోట్ల ఆదాయం వచ్చేదని, దాన్ని కూడా ఆలస్యం చేయడంతో అదనపు భారం పడి ఖర్చు కూడా పెరిగిందని ఆయన విచారం వ్యక్తం చేశారు. భూనిర్వాసితులు బ్రహ్మాండంగా ప్రాజెక్టు నిర్మాణానికి సహకరించారని ఆయన అభినందించారు. మీరు ధైర్యంగా ఉండాలని, ఇది ప్రజల ప్రభుత్వమని, మనందరి ప్రభుత్వమని. మంచిని మంచిగా చెప్తే మరింత మంచి జరుగుతుందని, మంచి చేసిన వారికి సహకరించకపోతే తప్పే అవుతుందని అన్నారు. ఇళ్లు నిర్మించుకునే గిరిజనులకు రూ.75 వేలు అదనంగా మన కూటమి ప్రభుత్వం అందిస్తోందని అని సీఎం చంద్రబాబు అన్నారు. పోలవరం ప్రాజెక్ట్ పనులను పరిశీలించేందుకు గురువారం పోలవరం చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు రాష్ట్రమంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఘన స్వాగతం పలికారు.

గురువారం మధ్యాహ్నం 12.10 ని॥లకు హెలికాప్టర్ ద్వారా పోలవరం చేరుకున్న ముఖ్యమంత్రి ముందుగా ఏరియల్ సర్వే ద్వారా ప్రాజెక్ట్ పనులను పరిశీలించారు. ముఖ్యమంత్రికి రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి నాదెండ్ల మనోహార్, రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి డా॥ నిమ్మల రామానాయుడు, రాష్ట్ర మంత్రులు కొలుసు పార్థసారధి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, శాసనసభ్యులు చిర్రి బాలరాజు, బడేటి రాధాకృష్ణయ్య (చంటి), మద్దిపాటి వెంకటరాజు, పత్సమట్ల ధర్మరాజు, డా॥ కామినేని శ్రీనివాస్, పితాని సత్యనారాయణ, చింతమనేని ప్రభాకర్, సొంగా రోషన్ కుమార్, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, ఏలూరు రేంజి ఐజి జి.వి.జి. అశోక్ కుమార్, జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్, జిల్లా జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి, ఏపి కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్, ఎపి ఎఎస్ సిపిసి చైర్మన్ పీతల సుజాత, ప్రభృతులు ముఖ్యమంత్రికి పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికారు.

# మురికివాడలుండవు..

>> నేషనల్ కాన్ఫరెన్స్‌లో భాగంగా ఒక రోజు వర్క్ షాపును స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ కళాశాలలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ విజన్ 2047లో పది సూత్రాల అమలుతో మన రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో మొదటి స్థానంలో నిలపాలన్నదే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ధ్యేయమని తెలిపారు. 2047 నాటికి దేశం వందేళ్ల స్వాతంత్ర్య వేడుకలు జరుపుకుంటుందని, ఆ సమయానికి మన రాష్ట్రాన్ని సమగ్రమైన, సమతుల్యమైన అభివృద్ధికి నమూనాగా రూపొందిస్తామన్నారు. వికసిత్ భారత్ ఆశయాలను దృష్టిలో ఉంచుకుని సిఎం చంద్రబాబు విజన్ 2047ను రూపొందించారని పేర్కొన్నారు. విజన్ 2047లో కీలక అంశంగా అమరావతి కూడా ఉందన్నారు. అమరావతిని కేవలం మౌలిక వసతుల ప్రాజెక్ట్ మాత్రమే కాకుండా నాణ్యమైన జీవన ప్రమాణాలు కలిగి ఉండేలా డిజైన్ చేశామని చెప్పారు. పట్టణాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో అర్బన్ డెవలప్మెంట్‌కు నిధులు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అందించే నిధులతో రాష్ట్రంలో పట్టణాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఆర్థిక వనరుల వినియోగం ద్వారా పట్టణాల అభివృద్ధికి ప్లానర్లు, ఆర్కిటెక్ట్‌లు తమ వంతు సహకారం అందించాలని కోరారు. 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ మాట్లాడుతూ వ్యూహాత్మక పెట్టుబడులు, సహకారం ద్వారా స్థిరమైన పట్టణ అభివృద్ధి, మౌలిక సదుపాయాల వృద్ధి, ఆర్థిక స్థితిస్థాపకతపై ప్రాధాన్యత ఉంటుందన్నారు. భారత దేశంలోనే ఏపీని ఒక ప్రముఖ రాష్ట్రంగా తీర్చిదిద్దటానికి ఒక రోడ్ మ్యాప్‌ను రూపొందిస్తున్నామన్నారు. ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. సురేష్ కుమార్ మాట్లాడుతూ ప్రతి పనికి ఒక ప్రణాళిక అవసరమని, ఒక్క రోజులో అద్భుతాలు జరగవని, మన రాష్ట్రాన్ని దేశంలోనే ప్రత్యేక గుర్తింపు రాష్ట్రంగా తీర్చిదిద్దటానికి పక్కా ప్రణాళిక అవసరమని, ఆ దిశగా ముందుకు సాగుతున్నామన్నారు, నిత్య కృషి ఉత్తమ ఫలితాలను ఇస్తుందని తెలిపారు. మన దేశంలో ప్లానింగ్ సిటీలు లేవన్నారు. ఇప్పటికీ వరదల సమయంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొంటున్నామని, కాని అమరావతిని ఒక ప్లానింగ్ సిటీగా రూపొందిస్తున్నామన్నారు. క్లీన్, గ్రీన్ సిటీగా అమరావతి నిలవనుందన్నారు. అనంతరం నిపుణులు నీతి అయోగ్, ఆర్థిక సలహా, ప్రజా విధానం, పట్టణ పాలన మరియు పట్టణ ప్రణాళిక తదితర అంశాలపై తమ విలువైన సూచనలు, సలహాలను అందించారు. కార్యక్రమంలో టీసీపీవో చీఫ్ ప్లానర్ ఎన్. ధీరేన్, డాక్టర్ అమోఘ కుమార్ గుప్తా, డాక్టర్ రమేష్ శ్రీకొండ తదితరులు పాల్గొన్నారు.

## పుష్కరాలకన్న ముందే పోలవరం జాతికి అంకితం

**ఏలూరు/పోలవరం, ప్రభాతవార్త :** పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తిచేయడం నిర్వాశితులకు నీడకల్పించడం, 2027 డిసెంబర్ నాటికి పూర్తిచేయాలని సంకల్పించినా 2027 పుష్కరాల కన్నా ముందే ప్రాజెక్టును జాతికి అంకితం చేయడానికి కాంట్రాక్టర్లు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. గురువారం ప్రాజెక్టు వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. నిర్ధేశిత సమయానికి పని పూర్తిచేయని కాంట్రాక్టర్లలను బ్లాక్ లిస్ట్‌లో పెట్టగలమన్నారు. కాంట్రాక్టర్ల అలసత్వం వహించొద్దని హెచ్చరించారు. డయాఫ్రం వాల్ నిర్మాణాన్ని 2025 డిసెంబర్ నాటికి పూర్తిచేయాలన్నారు. ఇసిఆర్ఎఫ్ గ్యాప్ -2 పనులను 2027 డిసెంబర్ నాటికి పూర్తిచేయాలని అనుకున్న ఈ పనులను ఏప్రియల్ నాటికి పూర్తయ్యేలా కృషిచేయాలన్నారు. పర్యాటకులను ఆకర్షించే విధంగా ఐకానిక్ బ్రిడ్జ్ నిర్మించాలన్నారు. ఒక్కసారి ఓట్లు వేసినందుకు రాష్ట్రానికి ముఖ్యమైన జీవనాడి దెబ్బతినే పరిస్థితి ఏర్పడిందన్నారు. వైఎస్సార్సీ హయాంలో జరిగిన తప్పులను చరిత్ర ఎప్పటికి క్షమించదన్నారు. గత పాలకులు అహంభావం, తెలియనితనం, రాజకీయ వివక్షత వల్ల జాతికి నష్టం చేకూరిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్రమంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

# ఇక విదేశాలకు 'వెంకన్న'!

>> ల్లోనూ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాలు ఉన్నాయి. రాష్ట్రంలో ఇటీవల కాలంలో అమరావతి, విశాఖపట్నంలో శ్రీవారి ఆలయాలు నిర్మించిన టిటిడి అక్కడ తిరుమల ఆలయంలో జరిగేలాగే పూజలు, సేవలు నిర్వహిస్తున్నారు. దాదాపు 14రాష్ట్రాల్లో ఇప్పటికే వెంకన్న ఆలయాలు నిర్మించిన టిటిడి దైనందిన పూజా కార్యక్రమాలు చేపడుతోంది. అక్కడి స్థానిక ప్రజలకు, హిందు భక్తులకు స్వామివారి సేవలను చేరువచేసింది.

**ఇక విదేశాల్లో 'వెంకన్న' ఆలయాలు:**

సనాతనహిందూధర్మం ఆచరింపబడుతున్న భారతదేశంలో హిందువులు పవిత్రంగా, విశ్వాసంతో నమ్మికోలిచే శ్రీవేంకటేశ్వరస్వామిపట్ల భక్తిభావంతో ఉంటున్నారు. హిందు కుటుంబాల్లో ఏ చిన్న కష్టం వచ్చినా, ఆపద కలిగినా వెంటనే తిరుమల వేంకటేశ్వరస్వామిని మొక్కుకుని ముడుపు కట్టి మొక్కులు తీర్చుకోవడం జరుగుతుంది. ఇందుకోసం దేశంలోని అన్ని రాష్ట్రాల నుండి ప్రతిరోజూ లక్షమంది వరకు భక్తులు తిరుమలకు వస్తున్నారు. ఇప్పుడు విదేశాల నుండి తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య పెరిగింది. దేశంలోని తెలుగురాష్ట్రాల్లో విశాఖపట్నం, అమరావతి, హైదరాబాద్, కరీంనగర్, సిద్ధిపేట, తమిళనాడులోని చెన్నై, కన్యాకుమారి, రామేశ్వరం, వేలూరు ఉలుందూరుపేట, కర్నాటక బెంగుళూరు, రాయపూర్, మహారాష్ట్ర నవీముంబై, ఒరిస్సా భువనేశ్వర్, దేశరాజధాని నగరం ఢిల్లీ, హర్యానా కురుక్షేత్ర, జమ్మూకాశ్మీర్ జమ్మూలో, ఉత్తరాఖండ్ రుకిషకేశ్‌లో, గుజరాత్ అహమ్మదాబాద్‌నగరాల్లో ఇలా అనేక చోట్ల వేంకటేశ్వరస్వామి ఆలయాలు ఉన్నాయి. ఈ ఆలయాల్లో తిరుమల తరహాలోనే వైఖానస ఆగమోక్తంగా నిత్యపూజలు, సేవలు చేస్తూ ఆయా ప్రాంత భక్తులకు స్వామివారి దర్శన భాగ్యం కల్పిస్తున్నారు. ఇంకా దేశంలోని అనేక రాష్ట్రాల్లోనూ శ్రీవారి ఆలయాలు నిర్మించాలనే ఆశయంతో ఆయారాష్ట్రాలకు టిటిడి లేఖలు కూడా రాసింది. ఇంకా అనేక గ్రామాల్లో, మారుమూల ప్రాంతాల్లో, ఎస్సీ, ఎస్టీ, మత్స్యకార ప్రాంతాల్లోనూ ఆలయాలు నిర్మించడానికి, అసంపూర్తిగా ఉన్న ఆలయాలను పూర్తిచేయడానికి సంకల్పించింది. కాగా ప్రస్తుతానికి అమెరికా దేశంలో ప్రవాసభారతీయులు అత్యధికంగా స్థిరపడ్డారు. అమెరికా, అనుబంధ రాష్ట్రాల్లోనూ మన భారతీయులు నివాసముంటున్నారు. అక్కడ యుఎస్ఎలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం ఉంది. నిత్యం తిరుమల ఆలయం తరహాలోనే పూజలు, సేవలు చేస్తున్నారు. ఇక రానున్న రోజుల్లో విదేశాల్లోని ప్రతి దేశంలోనూ, రాష్ట్రాల్లోనూ హిందువులు ఉన్న ప్రతిచోటా తిరుమల ఆలయాలు నిర్మించాలనే సంకల్పం రాష్ట్రముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచనలతో టిటిడి ప్రతిపాదనలతో సిద్ధమవుతోంది.

**అన్నిరాష్ట్రాల రాజధానుల్లో శ్రీవారి ఆలయాలు: టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు**

హిందూ ధర్మపరిరక్షణ వ్యాప్తికి, సనాతన ధర్మం పరిరక్షణలో బాగంగా దేశంలోని అన్ని రాష్ట్రాల రాజధానుల్లో శ్రీవారి ఆలయాలు నిర్మించేందుకు ధృడసంకల్పంతో ఉన్నామని, కార్యాచరణ అమలుచేస్తున్నామని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు హిందువులు ఎక్కువగా ఉన్న ప్రతిచోటా ఆలయాలు నిర్మిస్తామన్నారు. ఆలయాల నిర్మాణం కోసం భూమి కేటాయించాలని లేఖలు కూడా రాశామన్నారు. వేగంగా అన్ని రాజధానుల్లో ఆలయాల నిర్మాణాన్ని మొదలుపెడతామన్నారు. అదేగాక చిన్నచిన్నపట్టణాలు, గ్రామాల్లో ఆర్థికస్థోమత లేక నిర్మాణంలో ఆగిపోయిన దేవాలయాలను, శిథిలావస్థకు చేరిన ఆలయాలను పునురుద్ధరిస్తామని నాయుడు తెలిపారు.

# 'పి4' ప్రారంభానికి ఏర్పాట్లు

>> సంఘాలు, విద్యార్థులు, రైతులు, ఉపాధి కూలీలను ఆహ్వానించి ప్రత్యేక బస్సులు ద్వారా వారిని అమరావతి పి4 ప్రారంభోత్సవ వేదిక వద్దకు తీసుకురావాల్సి ఉంటుందని సిఎస్ చెప్పారు. సుమారు 11వేల 500 మందిని వారిలో సుమారు 3వేల మంది మహిళలు ఉండేలా ఈకార్యక్రమానికి తీసుకు రావాల్సి ఉందని తెలారు. అమరావతి సమీప జిల్లాలైన ఏలూరు, కృష్ణా, ఎన్టిఆర్, గుంటూరు జిల్లాల నుండి సుమారు 7వేల మందిని, పల్నాడు, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుండి కనీసం 500 మంది వంతున ఈకార్యక్రమానికి తీసుకు రావాలన్నారు. అదే మిగతా జిల్లాల నుండి 300 మంది వంతున, దూర ప్రాంత జిల్లాలైన మన్యం, అల్లూరి సీతారామరాజు, చిత్తూరు, అన్నమయ్య, కర్నూల్, అనంతపురం, శ్రీ సత్యసాయ జిల్లాల నుండి 50 మంది వంతున తీసుకురావాలని చెప్పారు. ఇందుకు అవసరమైన ఆర్టీసు బస్సులను ఆయా జిల్లాల నుండి అందుబాటులో ఉంచడం జరుగుతుందని పేర్కొన్నారు. బస్సులు ద్వారా కార్యక్రమానికి తీసుకువచ్చే వారిని సురక్షితంగా తరలించి సురక్షితంగా వారి గమ్య స్థానాలకు తిరిగి చేర్చేందుకు వీలుగా ట్రాఫిక్, భద్రత తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లు, ఎస్పిలు తగిన ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ప్రజలను తరలించే ప్రక్రియను రాష్ట్ర స్థాయి నుండి ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు రాష్ట్ర స్థాయిలో స్టాంప్స్ అండి రిజిస్ట్రేషన్ శాఖ ఐజి హరినారాయణను మరో ముగ్గురు ఉన్నతాధికారులను నియమించడం జరిగిందని ప్రతి జిల్లాకు ఒక నోడలు అధికారిని, ప్రతి బస్సుకు ఒక లైజన్ అధికారిని నియమించాలని సిఎస్ కలక్టర్లకు చెప్పారు. గతంలో బహిరంగ సభలకు తరలించినట్లు రొటీన్ విధానంలో కాకుండా ఒక ప్రత్యేక ఉద్దేశ్యంతో నిర్వహిస్తున్న ఈకార్యక్రమానికి ఆయా వర్గాల ప్రజలను తీసుకురావాలని అంతేగాక ఉగాది పర్వదినాన్ని కోల్పోతున్నామనే భావన వారిలో కలగకుండా ఉండే రీతిలో తగిన వసతులు కల్పించి తీసుకురావాలని స్పష్టం చేశారు. అమరావతికి సమీప జిల్లాల నుండి తరలించే వారిని అదే రోజు ఉదయం బయలు దేరే విధంగా చూసుకుని వారికి అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజన ఏర్పాట్లు, దూర ప్రాంత జిల్లాలకు చెందిన వారు ఒక రోజు ముందే బయలుదేరాల్సి ఉన్నందున రెండు రోజులకు తగిన వసతి ఏర్పాట్లు చేయాలని సిఎస్ విజయానంద్ స్పష్టం చేశారు.



# సొంతగడ్డపై ఖంగుతిన్న ఆరెంజ్ ఆర్మీ

## ఐదు వికెట్ల తేడాతో సన్‌రైజర్స్‌పై లక్నో సూపర్‌జెయింట్స్ విక్టరీ

**హైదరాబాద్, మార్చి 27:** ఐపిఎల్ 2025 సీజన్‌లో ఏడో మ్యాచ్‌గాజరిగిన సన్‌రైజర్స్ హైదరాబాద్, లక్నోసూపర్‌జైయింట్స్ మధ్యజరిగిన మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగింది. చివరివరకూ ఉత్కంఠగా సాగిన ఈమ్యాచ్‌లో చివరకు ఎల్ఎస్జీ జట్టు ఐదు వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌చేసిన సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 9 వికెట్లనష్టానికి 190 పరుగులుచేసింది. ఈ లక్ష్యాన్ని లక్నో జట్టు 16.1 ఓవర్లలోనే ఛేదించింది. నికోలస్ పూరన్ 26 బంతుల్లో ఆరుఫోర్లు, ఆరుసిక్స్‌లుచేసి 70 పరుగులతో విధ్వంసం సృష్టించాడు. ఈమ్యాచ్‌లో మిచేల్‌మార్ష్, నికొలస్ పూరన్‌ల భాగస్వామ్యంలోనే 116 పరుగులు వచ్చాయి. ఐపిఎల్‌లో ఎల్ఎస్జీ రెండో రికార్డును సాధించింది. అంతకుముందు సాధించిన కెఎల్‌రాహుల్ దీపక్‌హూడాల 95 పరుగుల రికార్డును ఎల్ఎస్జీయే అధిగమించింది. టాపార్డర్ వైఫల్యంతో భారీ స్కోరు సాధించలేకపోయిన పాట్‌కమిన్స్ ఆరెంజ్ ఆర్మీ లక్నో బ్యాటర్లను కట్టడిచేయడంలో కూడా విఫలం అయింది.

190 పరుగుల ఛేదనలో నికొలస్ పూరన్ 70, ఓపెనర్ మిచెల్‌మార్ష్‌లు 52 పరుగులతో విధ్వంస అర్థసెంచరీలతో ఆడారు. బౌండరీలతో ఉప్పల్‌స్టేడియాన్నిహోరెత్తించిన ఇద్దరూ లక్నోను గెలుపుదిశగా నడిపారు. అబ్దుల్‌సమద్ 22 పరుగులుచేసినా నాటౌట్‌గా నిలిచాడు. డేవిడ్‌మిల్లర్ 13 నాటౌట్‌లు దూకుడుగా ఆడి లాంఛనం ముగించారు. ఐదు వికెట్ల తేడాతో జయభేరి మోగించిన లక్నో 18వ సీజన్‌లో అదిరే బోణీ కొట్టింది. కాగా హైదరాబాద్ జట్టులో విధ్వంసంచేసే బ్యాటర్లు చేతులెత్తేసారు. ట్రావిస్ హెడ్ 47, అనికిత్‌వర్మ 36లపోరాటంతో 190 పరుగులుచేసింది. ఛేదనలో తన తొలి ఓవర్‌లోనే మహ్మద్‌షమీ డేంజరస్ బౌలింగ్‌తో ఎయిడెన్ మార్క్‌రమ్‌ను ఒకే ఒక్క పరుగుతో వెనక్కిపంపించాడు. మిడాఫ్‌దిశగా మార్క్‌రమ్ ఆడిన బంతిని అక్కడే కాచుకుని ఉన్న కమిన్స్ ఒడిసిపట్టుకున్నాడు. దాంతో నాలుగు పరుగుల వద్ద లక్నో మొదటి వికెట్‌పడినా మార్ష్, పూరన్‌లు నిలబెట్టారు.

# కొత్త బడ్జెట్ పన్ను శ్లాబ్‌లు ఏప్రిల్ 1 నుంచి అమలు

**న్యూఢిల్లీ, మార్చి 27:** బడ్జెట్‌లో పొందుపరిచిన కొత్త అంశాలన్నీ కూడా మరో రెండుమూడు రోజుల్లో అమలుకు రానున్నాయి. ఏప్రిల్ ఒకటవ తేదీనుంచి క్రెడిట్‌కార్డు రివార్డులు, యుపిఐ సేవలు, ఆదాయపు పన్ను శ్లాబుల్లో మార్పులు అమలులోకి వస్తాయి. ఐటికి సంబంధించినంతవరకూ ఇటీవల బడ్జెట్‌లో 12 లక్షల రూపాయల వరకూ ఎలాంటి పన్నులేదని తేల్చారు. ప్రామాణిక తగ్గింపు కింద రూ.75 వేలు కలుపుకుంటే రూ.12.75 లక్షలవరకూ ఎలాంటిపన్ను చెల్లించనవసరంలేదని వేతన జీవులకు ఊరట ఇచ్చారు.

రూ.25 వేలుగా ఉన్న రిబేట్‌ను ఇపుడు రూ.60 వేలకు పెంచారు. బ్యాంకు డిపాజిట్లపై సీనియర్ సిటిజన్లకు వార్షిక వడ్డీ 50 వేలు దాటితే టిడిఎస్ వసూలుచేస్తారు. ఇపుడు ఆమొత్తం వడ్డీ పరిమితి రూ.లక్షకు పెంచారు. అలాగే 60 ఏళ్లలోపు వారికి రూ.40 వేలనుంచి ఉన్న పరిమితి 50 వేలకు పెంచారు. ఇక సరళీకృత విదేశీ చెల్లింపులు కింద ఒక ఆర్థికసంవత్సరంలో ఏడు లక్షలు దాటితే టిడిఎస్‌కింద వసూలు చేస్తున్నారు.

ఈ పరిమితిని ఇపుడు రూ.10 లక్షలకు పెంచారు. బ్యాంకులనుంచి విద్యారుణం తీసుకుని ఆ మొత్తం విద్యార్థి ఫీజుకోసం విదేశాలకు పంపిస్తే ఇకపై ఎలాంటి టిసిఎస్ ఉండదు. క్రెడిట్‌కార్డులపై రివార్డుల్లో ఎస్బీఐ కోతపెట్టింది. స్విగ్గీ, ఎయిరిండియా టికెట్ బుకింగ్‌లపై లభించే రివార్డులను కుదించింది. ఎస్బీఐ సింప్లీక్లిక్ క్రెడిట్‌కార్డు, ఎయిరిండియా ఎస్‌బిఐ ప్లాటినమ్ కార్డు, ఎయిరిండియాఎస్బీఐ సిగ్నేచర్‌కార్డు హోల్డర్లకు ఏప్రిల్‌నుంచి వచ్చే రివార్డుల్లో కోతపడుతుంది. యాక్సిస్‌బ్యాంకు విస్తారా క్రెడిట్‌కార్డులు ఏప్రిల్ 18 నుంచి సవరిస్తామని ప్రకటించింది. ఆ తర్వాతఎ వరైనా కార్డును రెన్యువల్‌చేస్తారో వారికి ఎలాంటి వార్షిక ఛార్జీలు ఉండవు.

ఐడిఎఫ్‌సి ఫస్ట్‌బ్యాంక్ కూడా మార్చి 31 తర్వాత రెన్యువల్ అయ్యే విస్తారా కార్డులకు వార్షిక రుసుం తొలగిస్తుంది. అలాగే వాడుకలలోలేని, ఇతరులకు కేటాయించిన మొబైల్‌నంబర్లకు ఏప్రిల్ ఒకటినుంచి యుపిఐ సేవలు నిలిచి పోతాయి.

బ్యాంకులు, పేమెంట్ సేవల కంపెనీలకు ఎన్పీసీఐ ఆదేశాలు జారీచేసింది. యుపిఐలో లోడ్‌చేసిన మొత్తాలను మళ్లీ బ్యాంక్ ఖాతాలకు పంపించే సదుపాయి కూడా ఏప్రిల్‌నుంచి అందుబాటులోకి వస్తుంది. యుపిఐ లైట్ సేవలు వినియోగించుకోవాలంటే ఇకపై యాప్ పిన్; పాస్‌కోడ్, బయోమెట్రిక్ వంటివి ఉపయోగించాలి. యులిప్స్‌లో పెట్టుబడులు పెడుతుంటే ప్రీమియం మొత్తం రూ.2.5 లక్షలు దాటితే ఉపసంహారణ సమయంలో క్యాపిటల్ గెయిన్ ట్యాక్స్ చెల్లించాలి. 2025 బడ్జెట్‌లోనే ఈ మార్పులు వచ్చాయి.

అలాగే పిల్లల భవిషనయత్తుకోసం దీర్ఘకాలిక పెట్టుబడి పెట్టాలనుకునేవారికోసం ఎన్పీఎస్ వాత్సల్య కింద కొత్త ఆర్థికసంవత్సరంనుంచి పన్ను మినహాయింపు ఉంటుంద.ఇ సెక్షన్ 80సిసిడి(1బి) కిందప న్నుప్రయోజనాలను కల్పించారు. అయితే ఇది పాత పన్ను చెల్లింపు దారులకు మాత్రమే వర్తిస్తుంది.

## వారం - వర్జ్యం

తేది : 28-03-2025, శుక్రవారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
ఫాల్గుణమాసం, ఉత్తరాయణం,
శిశిర ఋతువు, కృష్ణపక్షం,
చతుర్దశి రా. 7.56
పూర్వాభాద్ర రా. 10.09
వర్జ్యం ఉ. 6.19-7.45
దు. ఉ. 8.41-9.30,
2) మ. 12.45-1.34
రాహుకాలం - ఉ. 10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** సన్నిహితులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. ఆర్థిక పరిస్థితి కొంతవరకు అనుకూలం.

**వృషభం:** వృత్తి, వ్యాపారాలలో విస్తరిస్తారు. నూతన ఉద్యోగావకాశాలు పొందుతారు. వాహనసౌఖ్యం.

**మిథునం:** రుణవత్తిడులు తొలగుతాయి. దీర్ఘకాలిక సమస్యలు తీరి ఊరట చెందుతారు.

**కర్కాటకం :** అనుకోని అతిథుల నుండి శుభవార్తలు అందుకుంటారు. ఆకస్మిక ధనలాభాలు పొందుతారు.

**సింహం:** దీర్ఘకాలిక సమస్యలు ఎదురైన నిదానంగా పరిష్కరించుకుంటారు. ఖర్చులు పెరుగుతాయి.

**కన్య :** దూరప్రాంతాల నుండి విలువైన సమాచారం అందుకుంటారు. ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి.

**తుల :** బంధువులను కలిసి కష్ట సుఖాలను పంచుకుంటారు. సంతానం నూతన విద్యావకాశాలు పొందుతారు.

**వృశ్చికం:** ఆకస్మిక ప్రయాణాలు లాభిస్తాయి. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

**ధనుస్సు:** కుటుంబ సమస్యలు తీరి ఊరట చెందుతారు. కొత్త పరిచయాలు పెరగుతాయి. క్రయవిక్రయాలు.

**మకరం:** చేపట్టిన కార్యక్రమాలలో విజయం సాధిస్తారు. రుణబాధల నుండి విముక్తి పొందుతారు.

**కుంభం:** ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. నూతన వస్తు వస్త్రాలు కొనుగోలు చేస్తారు.

**మీనం :** వృత్తి, వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. ఆర్థిక పరిస్థితి అనుకూలంగా వుంటుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# వల్లభనేని బెయిలు పిటిషన్ డిస్మిస్

**విజయవాడ, మార్చి 27, ప్రభాతవార్త ప్రతినిధి:** వైకాంగ్రెస్‌పార్టీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి సెషన్స్ కోర్టు బిగ్ షాక్ ఇచ్చింది. వంశీ బెయిల్ పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో బెయిల్ కోరుతూ విజయవాడ 12 అదరపు డిస్ట్రిక్ట్ సెషన్స్ కోర్టులో వంశీ పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై విచారణను నిర్వహించింది. వాదోపవాదాలను పరిశీలించిన న్యాయస్థానం ఇటీవల ఈ అంశంపై తీర్పు రిజర్వు చేసింది. గురువారం తీర్పును ప్రకటిస్తూ బెయిల్ పిటిషనన డిస్మిస్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీచేసింది ధర్మాసనం. గన్నవరంలో టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో వల్లభనేని వంశీ ఏ71గా ఉన్నారు. ఇక సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులోనూ వంశీ ముద్దాయిగా ఉన్నారు. ఈ కేసుల్లో వంశీ రిమాండ్ ఖైదీగాఉన్నారు. బెయిల్ కోరుతూ కోర్టులను ఆశ్రయిస్తున్నప్పటికీ.. చుక్కెదురవుతుంది.

# ఎపి-గేట్స్ ఫౌండేషన్ మధ్య ఒప్పందం

## అమలుకు టాస్క్ ఫోర్స్

**విజయవాడ మార్చి 27 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపి-బిల్‌గేట్స్ ఫౌండేషన్ మధ్య ఒప్పందం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసింది. సుపరిపాలన, సాగులో ఏఐ సాంకేతికత, వైద్యారోగ్యం, జీవన ప్రమాణాల పెంపుపై ఏపీ ప్రభుత్వం గేట్స్ ఫౌండేషన్‌తో ఇటీవల ఒప్పందం చేసుకున్న సంగతి తెలిసిందే దీని అమలుపై మొత్తం 26 మంది అధికారులతో తాజాగా టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసింది మానవ వనరుల అభివృద్ధి సాధారణ పరిపాలన శాఖతో పాటు గ్రామవార్డు సచివాలయశాఖ కార్యదర్శులు ఇందులో సభ్యులుగా ఉంటారు. ఎంవోయూ కుదుర్చుకున్న అంశాల అమలును పర్యవేక్షించాల్సిందిగా టాస్క్ ఫోర్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది.

# మైనారిటీ కుటుంబాన్ని ఉన్నత స్థితికి తెస్తా

>> పాల్గొన్నారు. ఈ సందర్భంగా పేదలతో తానుండాలనేదే తన జీవితాశమయని ఆయన పేర్కొన్నారు. నూటికి నూరు శాతం పేదల్నిపైకి తీసుకొచ్చేందుకే పీ4ను మార్చి 30వ తేదీ నుంచి చేపడుతున్నామని ఆయన వివరించారు. సమైఖ్య ఆంధ్రలోనైనా.. నవ్యాంధ్రలోనైనా ముస్లింలకు న్యాయం చేసింది తెలుగుదేశం పార్టీ మాత్రమేనని గుర్తు చేశారు. ఉర్దూని రెండో భాషగా గుర్తించటంతో పాటు వక్ఫ్ బోర్డు ఆస్తుల్ని కాపాడుతూ వచ్చామని సీఎం చంద్రబాబు నాయుడు వివరించారు. అలాగే హైదరాబాద్, కర్నూల్‌లో ఉర్దూ విశ్వవిద్యాలయాలు తీసుకొచ్చామన్నారు. ఇక హైదరాబాద్, కర్నూల్, విజయవాడల్లో హజ్ హౌస్ నిర్మాణాలు చేపట్టామని తెలిపారు. రంజాన్ పండగ సందర్భంగా తోఫా ఇవ్వటంతో పాటు ఇమామ్‌లు, మోజమ్‌లను ఆదుకుంది తెలుగుదేశం పార్టీనేనని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో గతంలో కంటే ఈ సారి రూ. 1,300 కోట్లు అదనంగా మైనార్టీలకు కేటాయించామన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ప్రతీ పేదవాడినిపైకి తీసుకొచ్చే కార్యక్రమమే పీ4 అని ఆయన అభివర్ణించారు.

రంజాన్ మాసంలో ఈ రోజు మీ అందరికి కలవడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఈ సందర్భంగా అందరికి సిఎం చంద్రబాబు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. క్రమ శిక్షణ, దాతృత్వంతోపాటు ధార్మికచింతన కూడికే రంజాన్ మాసమని ఆయన పేర్కొన్నారు. ఉదయం నుంచి ఖురాన్ చదవడం.. ఇతరలుకు సహాయం చేయడం వంటి మంచి పనులు చేస్తున్నారంటూ ముస్లిం సోదరులపై ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రశంసల జల్లు కురిపించారు. ఈ ఇఫ్తార్ విందులో మైనార్టీ శాఖ మంత్రి ఎన్.ఎండి ఫరూక్ పాల్గొన్నారు. అంతకుముందు ముస్లిం సోదరులతో కలిసి సీఎం చంద్రబాబు నమాజ్ చేశారు. ఇఫ్తార్ విందుకు వచ్చిన ముఖ్యమంత్రికి మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఫరూక్, వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు ఘన స్వాగతం పలికారు. సీఎం చంద్రబాబుకు రంజాన్ సంప్రదాయక కానుకను మంత్రి ఫరూక్ అందించారు.



ఉగాది పురస్కారాల ప్రధానోత్సవానికి సీఎం చంద్రబాబును ఆహ్వానించిన మంత్రి కందుల

## ఉగాది పురస్కారాల ప్రదానోత్సవానికి సిఎం చంద్రబాబును ఆహ్వానించిన మంత్రి కందుల దుర్గేష్

**విజయవాడ,మార్చి 27,ప్రభాతవార్త ప్రతినిధి:** ఉగాది పురస్కారాల ప్రదానం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని కోరుతూ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ , రాష్ట్ర పర్యాటక శాఖ కార్యదర్శి అజయ్ జైన్ ఆహ్వానం అందించారు. ఏపీ సంస్కృతి. సృజనాత్మక శాఖ రాష్ట్ర స్థాయిలో ప్రతి ఏటా ఉగాదికి వివిధ రంగాల్లో ప్రతివంతులకు కళారత్న, పురస్కారాలు అందిస్తుంది. అయితే గత ఆరేళ్ళగా ఈ ఉత్సవాలు జరుగడం లేదు. తిరిగి ఈ ఉగాదికి వీటిని నిర్వహిస్తాన్నారు. ఎన్నడులేని రీతిలో ఉగాది పురస్కారాలు 100 మందికి,76 మందికి కళారత్న అవార్డులను అందిస్తారు. జ్ఞాపికతో పాటు అవార్డు గ్రహీతలకు నగదు పురస్కారం ఆయా అవార్డుల స్థాయిని బట్టి ఇస్తారు. ఈ నెల 30వ తేది ఆదివారం ఉగాది రోజున అవార్డుల ప్రధానం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబును ముఖ్య అతిధిగా కందుల దుర్గేష్ ఆహ్వానించారు.

## కొడాలి నానికి మాజీ సీఎం జగన్ పరామర్శ

**విజయవాడ,మార్చి 27,ప్రభాతవార్త ప్రతినిధి:** హృద్రోగ సమస్యలతో ఇబ్బంది పడుతున్న మాజీ మంత్రి కొడాలి వెంకటేశ్వరరావు(నాని)ని మాజీ సీఎం జగన్ గురువారం ఫోన్లో పరామర్శించారు. కొడాలి నాని అనారోగ్య సమస్యలతో హైదారాబాద్‌లోని ఓ కార్పోరేట్ ఆస్పత్రిలో చేరారు. గ్యాస్ సంబంధమైన సమస్యతో వెళ్ళిన నానికి పరీక్షల అనంతరం నానికి హృద్రోగపరమైన కారణాలున్నట్లు ఆస్పత్రి వైద్యులు గుర్తించారు. సంబంధిత వైద్యచికిత్సను ప్రారంభించడంతో పాటు నాలుగు స్టంట్‌లు వేయాల్సి ఉంటుందని ప్రకటించారు. ఈ నేపథ్యంలో మాజీ సీఎం జగన్ ఆయనకు ఫోన్‌చేసి ధైర్యం చెప్పారు. త్వరంగా కొలుకుని రావాలని ఆకాంక్షించారు.

## రాష్ట్రంలో ఇంజినీరింగ్ క్వాంటం కంప్యూటింగ్!

**విజయవాడ మార్చి 27 ప్రభాతవార్త ప్రతినిధి:** ఉన్నత విద్యారంగంలో ప్రభుత్వం పలు మార్పులు చేస్తోంది. ఈ క్రమంలోనే ఇంజినీరింగ్ విద్యలో నూతన పాఠ్యంశాలను అందుబాటులోకి తీసుకుని రానున్నది. బీటెక్‌లో క్వాంటం కంప్యూటింగ్ సబ్జెక్టును ప్రవేశ పెట్టడంతో పాటు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా సిలబస్ ఉండేలా ఉన్నత విద్యామండలి కసరత్తు చేస్తోంది. ఇంజినీరింగ్ లో మూడు నాలుగో ఏడాది సిలబస్ లో మార్పులు సూచించేందుకు ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి ఐఐటీ తిరుపతి డైరెక్టర్ సత్యనారాయణను ఛైర్మన్‌గా ఎనిమిది మందిని సభ్యులుగా నియమించింది. ప్రత్యేక ఆహ్వానితులుగా ఆరుగురు నిపుణులు ఉండనున్నారు. అఖిల భారత సాంకేతిక విద్యామండలి ఇప్పటికే క్వాంటం కంప్యూటింగ్ కు సంబంధించిన సిలబస్, దానికి ఇవ్వాల్సిన క్రెడిట్లను సూచించింది. ఈ నేపథ్యంలో ఇంజినీరింగ్ , డిగ్రీ కళాశాలలు పరిశ్రమలతో అనుసంధానమై ఇంటర్న్‌షిప్ నిర్వహించేలా కొత్త సిలబస్‌ను తీసుకురానున్నారు. స్వయంప్రతిపత్తి కళాశాలలు నూతన సిలబస్‌లో 20% వరకు మార్పు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని ఉన్నత విద్యామండలి భావిస్తోంది. సిలబస్ మార్పు ప్రకియలో ప్రభుత్వం పారిశ్రామికవేత్తలను భాగస్వాములను చేస్తోంది.

## ప్రవీణ్ పగడాల మృతి పై ఫాస్ట్రాక్ విచారణ జరిపించాలి

### - పిసిసి అధ్యక్షురాలు షర్మిల

**విజయవాడ,మార్చి27,ప్రభాతవార్తప్రతినిధి:** పాస్టర్ ప్రవీణ్ పగడాల గారిది రోడ్డు ప్రమాదం కాదని వైఎస్ షర్మిలా రెడ్డి ఆరోపించారు. సంఘటన స్థలంలో ఇది హత్య అనడానికి చాలా రుజువులు ఉన్నాయన్నారు. ఇది పక్కా ప్రణాళికతో చేసిన హత్యే అన్నారు. ఈ విషయంలో ప్రవీణ్ మరణంపై వారి కుటుంబ సభ్యులతో పాటు అందరికీ అనుమానాలు ఉన్నాయన్నారు. హత్యను ప్రమాదం చూపించే ప్రయత్నాలను ప్రభుత్వం మానుకోవాలన్నారు. ప్రవీణ్ హత్య అత్యంత అమానుషం అన్నారు. ఈ దారుణ ఘటన రెండు తెలుగు రాష్ట్రాల్లోని క్రైస్తవుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసిందన్నారు. విజయవాడ పీసీసీ కార్యాలయం నుంచి విడుదల చేసిన ప్రకటనలో షర్మిల ప్రవీణ్‌ది హత్యేనని, ఈ విషయంలో పక్కదారిని పట్టించే ప్రయత్నాలు మంచివి కావన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవీణ్ పగడాల మృతి పై వెంటనే ఫాస్ట్రాక్ విచారణ జరిపించాలి.

## ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ కెపిసి గాంధీ సలహాదారుగా నియామకం: హోంమంత్రి అనిత



ఫోరెన్సిక్ సైన్స్ రంగానికి చెందిన ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ కేపీసీ గాంధీతో హోంమంత్రి అనిత

విజయవాడ, మార్చి27, ప్రభాతవార్తప్రతినిధి: రాష్ట్రంలో ఏ కేసులోనైనా నేరస్తుడు తప్పించుకోరని ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేసారు. ఈ విషయంలో ఏపీ పోలీసు పూర్తిస్థాయి సాంకేతికతను వినియోగించుకుంటుందన్నారు. ఫోరెన్సిక్ సైన్స్ విషయంలోను నూతన ఆవిష్కరణలను వినియోగిస్తున్నామన్నారు. ఫోరెన్సిక్ సైన్స్ రంగానికి చెందిన ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ కేపీసీ గాంధీ ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల రాష్ట్ర కూటమి ప్రభుత్వం కేబినెట్ హోదాతో ఆయనను సలహాదారుగా నియమించిన నేపథ్యంలో ఫోరెన్సిక్ సామర్థ్యాలను బలోపేతం చేయడం, మౌలిక వసతుల కల్పనపై ఆయనతో మంత్రి అనిత చర్చించారు. ఏపీలో నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ విశ్వవిద్యాలయం ఏర్పాటు దిశగా చేపట్టాల్సిన బాధ్యతలపై మాట్లాడారు. ఈ విషయాన్ని "ఎక్స్" వేదికగా అనిత వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం శివారు కొంతమూరు వద్ద పాస్టర్ ప్రవీణ్ కుమార్ పగడాల మృతిపై వస్తున్న ఆరోపణలపట్ల పోలీసు అధికారులను ఆరా తీసినట్లు హోం మంత్రి అనిత తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహకిశోర్ ఫోన్ చేసి జరిగిన ఘటనపై గల కారణాలపై కచ్చితమైన నివేదికతో పాటు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు వివరించారు. పాస్టర్ ప్రవీణ్ ప్రమాదం జరిగిన సమీపంలోని సీసీ టీవీ ఫుటేజీలు క్షుణ్ణంగా పరిశీలించాలని హోంమంత్రి ఆదేశించామన్నారు. క్రైస్తవసంఘాలు కోరిన మేరకు పోస్టుమార్టం వీడియో రికార్డింగ్‌కు కూడా అంగీకరించినట్లు ఎస్పీ నరసింహకిశోర్ హోంమంత్రికి వివరించారు. ఇక విశాఖపట్నం వన్ టౌన్ పరిధిలో ఎనిమిదేళ్ల చిన్నారిపై అత్యాచార ఘటనపట్ల హోంమంత్రి అనిత ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖ సిటీ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చితో ఫోన్ లో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అమాయక చిన్నారిపై అత్యాచారానికి పాల్పడిన కీచకుడిని వెంటనే పట్టుకుని కఠినంగా శిక్షించాలని హోంమంత్రి ఆదేశించారు. విశాఖ నగరంలోని చంగల్రావ్ పేట ప్రాంతానికి చెందిన వ్యక్తిగా గుర్తించామని పోలీసులు హోంమంత్రికి తెలిపారు. పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు.

## ఇక డిగ్రీలో రెండు మేజర్ సబ్జెక్టుల విధానం

**విజయవాడ మార్చి 27 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో డిగ్రీ పాఠ్యప్రణాళికను మార్చబోతున్నారు. ఇకపై వచ్చే విద్యా సంవత్సరం నుంచి రెండు మేజర్ సబ్జెక్టుల విధానాన్ని తీసుకురానున్నారు. రాష్ట్రంలో డిగ్రీ కరిక్యులమ్ మార్పు చేసేందుకు ఉన్నత విద్యామండలి కమిటీ ఏర్పాటు చేసింది. కృష్ణా విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపకులపతి వి.వెంకయ్య ఛైర్మన్‌గా 12 మందిసభ్యులతో ఈ కమిటీని ఏర్పాటు చేసింది . ఉన్నత విద్యామండలి అకడమిక్ అధికారి శ్రీరంగం ఈ కమిటీకి సభ్య కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ప్రత్యేక ఆహ్వానితులుగా ట్రిపుల్ ఐటీ బెంగుళూరు మాజీ డైరెక్టర్ ఎస్ సదాగోపన్, అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ నార్త్ కరోలినా విల్మింగ్టన్ చాన్సలర్ అశ్వనీ కె.వోలేటిని నియమించారు. ఈ కమిటీ మూడు వారాల్లో డిగ్రీలో రెండు మేజర్ సబ్జెక్టుల విధానంపైఈ నివేదిక సమర్పించాల్సి ఉంటుందని ఉన్నత విద్యామండలి ఇన్‌చార్జి కార్యదర్శి కృష్ణమూర్తి తెలిపారు. గత ప్రభుత్వంలో 2023-24 సంవత్సరం నుంచి సింగిల్ మేజర్ సబ్జెక్టు విధానాన్ని తీసుకొచ్చారు. అంతకుముందు మల్టీడిసిప్లీనరీ విధానంలో మూడు సబ్జెక్టుల విధానం ఉండేది. దాన్ని తొలగించి సింగిల్ మేజర్, మరో మైనర్ సబ్జెక్టుల విధానాన్ని తీసుకొచ్చారు. సింగిల్ మేజర్ కారణంగా చాలా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అన్ని సబ్జెక్టులను అందుబాటులో ఉంచలేని పరిస్థితి ఏర్పడింది. మేజర్ , మైనర్ సబ్జెక్టులను విద్యార్థులకు అందుబాటులో ఉంచితే అధ్యాపకుల సమస్య ఏర్పడుతుందని , కొన్ని సబ్జెక్టులను కొన్ని కళాశాలలకే పరిమితం చేశారు. దీంతో అనేక ఇబ్బందులు వచ్చాయి. ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు బీఎస్సీ కంప్యూటర్, బీకాం కంప్యూటర్ లాంటి కోర్సులనే అత్యధికంగా ప్రవేశపెట్టాయి. విద్యార్థుల డిమాండ్‌కు అనుగుణంగా కోర్సులను మార్పు చేసుకున్నాయి. సింగిల్ మేజర్‌పై ఎప్పటి నుంచో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొత్తగా రెండు మేజర్ సబ్జెక్టుల విధానంతోపాటు ప్రాధాన్యత కలిగిన సబ్జెక్టులను మైనర్లుగా అమలు చేయాలని భావిస్తున్నారు. విశ్వవిద్యాలయాల నిధుల సంఘం ప్రకారం మూడేళ్ల డిగ్రీకి 120 కెడిట్లు ఉండాలి. నాలుగేళ్ల డిగ్రీకి 160 క్రెడిట్లు ఉండాలి. రాష్ట్రంలో 2020-21 నుంచి నాలుగేళ్ల డిగ్రీని అమలు చేస్తున్నా ఎక్కువ మంది విద్యార్థులు మూడేళ్ల డిగ్రీనే చదువుతున్నారు. యూజీసీ ప్రకారం మేజర్ సబ్జెక్టుకు 50% క్రెడిట్లు ఇవ్వాల్సి ఉంటుంది. రెండో మేజర్‌కు 40% క్రెడిట్లు ఇవ్వాల్సి ఉంటుంది. దీంతోపాటు కృత్రిమ మేధ, క్వాంటం కంప్యూటింగ్, డాటా అనలిటిక్స్ లాంటి వాటిల్లో మైనర్ డిగ్రీని ప్రవేశ పెట్టడంపైనా కసరత్తు చేస్తున్నారు. ఇలా మూడు సబ్జెక్టుల విధానం వస్తే ఇది మల్టీడిసిప్లీనరీ అవుతుందని విద్యానిపుణులు సూచిస్తున్నారు.

## ఉమ్మడి కడప జిల్లా జడ్పీ చైర్మన్‌గా ముత్యాల రామగోవింద రెడ్డి

**కడప కార్పొరేషన్, మార్చి 27 ప్రభాతవార్త:** ఉమ్మడి కడప జిల్లా జడ్పీ చైర్మన్ గా వైయస్సార్సీపీ బ్రహ్మంగారిమఠం జడ్పిటిసి సభ్యులు రామ గోవిందరెడ్డి ఎన్నికయ్యారు. గురువారం కడప ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ ఎన్నిక ప్రత్యేక సమావేశం కడప జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి నేతృత్వంలో నిర్వహించారు. పోరుమామిళ్ల జడ్పిటిసి సభ్యులు ముత్యాల ప్రసాద్ చెన్నయ్య, వేముల జడ్పీటీసీ కోకటం వెంకట బయపురెడ్డిలు బి. మఠం జెడ్పీటీసీ సభ్యులు ముత్యాల రామగోవింద రెడ్డి పేరును ఉమ్మడి కడప జిల్లా జడ్పీ చైర్మన్ గా ప్రతిపాదించడంతో పాటు ఆయన అభ్యర్థిత్వాన్ని బలపరిచారు. ఏ ఒక్క అభ్యర్థి పేరును కూడా ప్రాదేశిక సభ్యులు ప్రతిపాదించకపోవడం, వైఎస్ఆర్సిపికి చెందిన ప్రాదేశిక సభ్యుల కోరం కూడా సరిపడా ఉండడంతో.. బి.మఠం మండలానికి చెందిన ముత్యాల రామ గోవిందా రెడ్డిని ఉమ్మడి కడప జిల్లా పరిషత్ చైర్మన్ గా జిల్లా ఎన్నికల అధికారి ప్రకటించడం జరిగింది. అనంతరం జిల్లా పరిషత్ చైర్మన్ గా ముత్యాల రామ గోవింద రెడ్డితో.. జిల్లా కలెక్టర్ ప్రమాణ స్వీకారం చేయించడం జరిగింది. అమలులో వున్న శాసనం, రాజ్యాంగం పట్ల శ్రద్ధతో స్వీకరించ బోవు బాధ్యతలను సత్యనిష్ఠతో భగవంతుని సాక్షి గా నిర్వహిస్తానని జడ్పీ చైర్మన్ గా ఎన్నికైన ముత్యాల రామ గోవిందరెడ్డితో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ప్రమాణ స్వీకారం చేయించారు. అంతకుముందు ఉదయం 10 గంటలకు బ్రహ్మంగారిమఠం జడ్పిటిసి సభ్యుడు ముత్యాల రామ గోవిందరెడ్డి జడ్పీ సీఈఓ ఓబులమ్మకు నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఆయన వెంట కడప ఎంపీ అవినాష్ రెడ్డి, వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి, బద్వేల్ ఎమ్మెల్యే డా. దాసరి సుధా, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, ఎమ్మెల్సీలు ఆర్.వి రమేష్ యాదవ్, యంవి. రామచంద్రారెడ్డి, డీసీ గోవింద రెడ్డి, ఇతర నేతలు పాల్గొన్నారు. జిల్లాలో మొత్తం 50 మంది జెడ్పీటీసీ సభ్యులుండగా ఇందులో పులివెందుల జెడ్పీటీసీ, ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానాలు ఖాళీ ఏర్పడగా.. ప్రస్తుతం జిల్లా పరిషత్లో 48 మంది జెడ్పీటీసీ సభ్యులున్నారు. వారిలో గోపవరం మండల జెడ్పీటీసీ జయరామిరెడ్డి మాత్రమే తెలుగుదేశం పార్టీ నుంచి ఎన్నికయ్యారు. మిగతా అందరూ వైఎస్సార్సీపీ నుంచి ఎన్నికైన జెడ్పీటీసీ సభ్యులే వుండడంతో జడ్పిటిసి అధ్యక్ష ఎన్నిక లాంఛన ప్రాయంగా ముగిసింది.




## మాజీ మంత్రి విడదల రజిని ముందస్తు బెయిల్ పిటిషన్ వాయిదా

**విజయవాడ,మార్చి 27,ప్రభాతవార్త ప్రతినిధి:** వైకాంగ్రెస్ పార్టీ నాయకురాలు, మాజీ మంత్రి విడదల రజినిపై శ్రీ లక్ష్మీబాలాజీ స్టోన్‌క్రషర్ యజమాన్యం నుండి అక్రమంగా వసూలు చేశారనే ఎసిబి నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ పిటిషన్ పై విచారణను హైకోర్టు వాయిదా వేసింది. ఈ పిటిషన్ పై విచారణను వచ్చే బుధవారం వాయిదా వేస్తున్నట్లు కోర్టు పేర్కొంది. జగన్ హయాంలో పల్నాడు జిల్లా యడ్లపాడులోని శ్రీ లక్ష్మీబాలాజీ స్టోన్‌క్రషర్ యజమాన్యాన్ని విజిలెన్స్ తనిఖీల ముసుగులో బెదిరించి.. రూ.2.20 కోట్లు అక్రమంగా వసూలు చేశారనే అభియోగంపై వైకాపా నాయకురాలు, మాజీ మంత్రి విడదల రజిని, అప్పటి గుంటూరు ఆర్‌వీఈవో, ఐపీఎస్ అధికారి పల్లె జాషువాతో పాటు మరికొందరిపై ఏసీబీ కేసు నమోదు చేశారు. విడదల రజని ముందస్తు బెయిల్‌ను కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు.

## ఉగాదికి ముస్తాబైన శ్రీకాళహస్తి



**శ్రీకాళహస్తి,మార్చి 27 ప్రభాతవార్త** దక్షిణ కైలాసం తెలుగుసంవత్సరాదికి ముస్తాబౌతుంది. ఆలయంలోనూ, నాలుగుమాడావీధుల్లోనూ దేవస్థానం ముస్తాబులు ప్రారంభించారు. దేవస్థానం నాలుగు మాడావీధుల్లో తెలుగు సంవత్సరాది సంబరాలకు సిద్ధం చేస్తున్నారు. నాలుగు మాడావీదుల్లో మామిడి తోరణాలు, అరటి చెట్లతో నిత్య కళ్యాణం పచ్చతోరణం అన్నట్లు తీర్చిదిద్దుతున్నారు. ఇక ఆలయంలో ప్రత్యేకలైటింగ్‌ను ఏర్పాటు చేయగా బిక్షాల గాలిగోపురానికి విద్యుత్ దీపాల అలంకరణతో కన్నులు మిరుమిట్లు గోల్పునట్లు ముస్తాబు చేశారు. గతంలో ఆలయం ఆంగ్ల సంవత్సరాదికి భారీ ఎత్తున ముస్తాబు చేసే వారు. అయితే దేవాదాయశాఖ గత కొన్ని సంవత్సరాలుగా మన పండగలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించటంతో తెలుగు సంవత్సరాది ఉగాదికి ప్రత్యేక చోటు చేసుకుంది. దాంతో నాలుగు గోపురాల వద్ద ఇట్టే ఆకట్టుకునేటట్లు పూల ముస్తాబులు చేస్తున్నారు. దక్షిణ గోపురం నుంచి కంచుగడప వరకు పూల ముస్తాబులు అలాగే విజయస్థంభం, ధ్వజస్థంభంలను చక్కగా బెంగుళూరు పూలతో అలంకరించుటకు నిర్ణయించారు. శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని ఉగాది సంబరాలకు ముస్తాబులు చేస్తున్నారు. ఈ మేరకు ఆదివారం తెలుగుసంవత్సరాది దర్శనాలకు సిద్ధం చేస్తున్నారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దుతున్నారు. ఆలయంలో వేకువ జాము నుంచి దర్శనాలకు అనుమతిస్తున్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని నాలుగు మాడావీధుల నుంచే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి విశేష సంఖ్యలో భక్తులు హాజరౌతారనే అంచనాలతో ఏర్పాట్లు చేపట్టారు. ఏర్పాట్లను ఇఒ డికె బాపిరెడ్డి ఆదేశాలతో వారి సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. ఇక పలు సంస్థలు సామాజిక సేవా కార్యక్రమాలకు సిద్ధమౌతున్నారు. ఉగాది సందర్బంగా స్వామి అమ్మ వార్లకు స్వామి సన్నిధి ముందు ఉత్సవ మూర్తులకు అభిషేకం నిర్వహించబడు తుందని ఇఒ తెలిపారు. సాయంత్రం నాలుగుగంటలకు పంచాంగ పఠనం, శ్రవణం నిర్వహించబడుతుందన్నారు. సాయంత్రం 7గంటలకు కోట మండపం వద్ద కవి సమ్మేళనం, కవి సత్కారం ఏర్పాటు చేసినట్లు వివరించారు. రాత్రి 8గంటలకు రాత్రి స్వామి అమ్మవార్ల ఉత్సవాలకు సింహాసనం వాహనం మరియు చప్పర వాహనాలపై గ్రామోత్సవం నిర్వహించబడుతుందన్నారు.

## ఎఐతో మరింత సమర్ధవంతంగా సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్

### - పద్మావతి వర్సిటీలో ఎఐ స్కిల్స్‌సదస్సులో వక్తలు



**తిరుపతి, మార్చి27ప్రభాతవార్తప్రతినిధి:** ఎఐ ఆధారిత టూల్స్‌తో సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌ను మరింత సమర్ధవంతంగా, సులభంగా చేయగలమనే అంశాలపై విద్యార్థినులకు శిక్షణ నిర్వహించారు. డిఎస్‌టి క్యూరీ ఏఐ కేంద్రం ఆధ్వర్యంలో ,ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ విభాగం, మైక్రోసాఫ్ట్,కోయినిగ్ సోల్యూషన్స్ తో తిరుపతి పద్మావతి మహిళ విశ్వవిద్యాలయంలో మూడురోజుల జరిగిన సదస్సు గురువారం ముగిసింది. ఈ సందర్భంగా ఆచార్య పి.వెంకట కృష్ణ, అక్విందర్‌కౌర్ ,శాలిని రఘువంశీ వక్తలుగా పాల్గొని విద్యార్థినులకు ఏఐ సాంకేతికత, పరిజ్ఞానం, ప్రాక్టికల్ అను భవం అందించి వారి నైపుణ్యాలను పెంపొందిచే వేదికగా మారింది.

# తిరుమల సమాచారం

## శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



**తిరుమల,మార్చి 27ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలో గురువారం ఉదయం శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. ఆలయంలో 30వ తేదీ ఉగాది ఆస్థానం సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఉదయం 7గంటల నుండి 9గంటల వరకు ఆలయంలో గోవిందరాజస్వామి సన్నిధి, ఆల యాల పై గోడలు,కప్పు, పూజా సామాగ్రి తదితర వస్తువులను సుగందపరిమళ ద్రవ్యాలతో శుద్దిచేశారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరిపసుపు, పచ్చాకు, గడ్డకర్పూరం,గంధంపొడి, కుంకుమ, కిచిలిగడ్డ తదితర సుగంద ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర పరిమళ జలాన్ని ఆలయమంతటా సంప్రోక్షణ చేశారు. ఈ మహాయజ్ఞం కార్యక్రమం తరువాత భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు. ఈ కార్యకమంలో ఆలయ డిప్యూటీ ఇఒ శాంతి, ఎఇఒ మునికృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ చిరంజీవి, ఆలయ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ,అర్చకులు పాల్గొన్నారు.

## టిటిడి ట్రస్టులకు రూ.2.45కోట్లు విరాళాలు



**తిరుమల,మార్చి 27ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలతిరుపతిదేవస్థానం ఆధ్వర్యంలోని వివిధ ట్రస్టులు,పథకాలకు గురువారం 2.45కోట్ల రూపాయలు విరాళాలందించారు. చెన్నైకి చెందిన జినేశ్వర్ ఇన్‌ఫ్రా వెంచర్స్ సంస్థ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు కోటిరూపాయలు విరాళంగా అందించగా, శ్రీలంకకు చెందిన ఓ దాత మరో కోటిరూపాయలు అన్నప్రసాదం ట్రస్ట్‌కే డిడి ఇచ్చారు. నోయిడాకు చెందిన పసిఫిక్ బిపిఒ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ శ్రీవేంకటేశ్వరప్రాణదాన ట్రస్టుకు చెందిన 45లక్షలు రూపాయలు విరాళంగా అందించింది. ఈ విరాళాలను గురవారం ఉదయం శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి డిడిలను అందజేశారు.

## ధ్వజారోహణంతో కోదండరాముని బ్రహ్మోత్సవాలు ఆరంభం



**తిరుపతి,మార్చి27ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి కోదండ రామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ఉదయం ధ్వజారోహణంతో అంగరంగవైభవంగా మొదలయ్యాయి. ఉదయం 9.15గంటల నుండి 9.30 గంటల మధ్య మేషలగ్నంలో ధ్వజారోహణఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇందులో గరుత్మంతుని చిత్రంతో కూడిన ధ్వజపటానికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదమంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు భక్తుల గోవింద నామస్మరణ, రామనామ మధ్య ధ్వజపట్టాన్ని అధిష్టింపజేశారు. సకలదేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించడంతోబాటు సమాజ శ్రేయస్సుకు, వంశాభివృద్ధికి ధ్వజారోహణం దోహదపడుతుందని అర్చకులు తెలిపారు. ఉదయం ఆస్థానం, సీతాలక్ష్మణసమేత కోదండరామస్వామికి స్నపన తిరుమంజనం నిర్వహించారు. రాత్రి పెద్దశేషవాహనంపై కోదండరాముడు భక్తులకు కటాక్షించాడు. ఈ కార్యక్రమాల్లో పెద్దజీయరుస్వామి, చిన్నజీయరుస్వామి, ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలదీక్షితులు, ఆగమసలహాదారుడు సీతారామాచార్యులు, డిప్యూటీ ఇఒలు గోవిందరాజులు, నాగరత్న, ఎఇఒ రవి, సూపరింటెండెంట్ మునిశంకరన్, ఆలయ ఇన్‌స్పెక్టర్ సురేష్, ఆలయ అధికారులు,భక్తులుపాల్గొన్నారు.

## మంత్రి లోకేశ్ చొరవతో ఒకరికి అవయవ దానం, మరొకరికి ప్రాణదానం



**విజయవాడ,మార్చి 27,ప్రభాతవార్త ప్రతినిధి:** గుంటూరు రమేష్ హాస్పిటల్స్ లో తీవ్ర అనారోగ్యంతో చేరిన చెరుకూరి సుష్మ అనే మహిళకి బ్రెయిన్ డెడ్ అయ్యింది. జీవచ్ఛవంలా మారిన తమ ఇంటి వెలుగు సుష్మ మరణం సజీవం చేయడానికి కుటుంబ సభ్యులు నిర్ణయించుకున్నారు. ఆమె అవయవదానానికి అంగీకరించారు. వెంటనే రమేష్ హాస్పిటల్స్ గుంటూరు వైద్యులు ఆగమేఘాలపై అవయవాలు తరలించి మరికొందరికి ప్రాణదానం చేసే అవకాశం కల్పించాలని మంత్రి నారా లోకేష్ కు ఒక్క మెసేజ్ పంపారు వెంటనే ఆసుపత్రి వైద్యులు అవయవాలు తరలించి మరికొందరికి ప్రాణదానం చేసే అవకాశం కల్పించాలని మంత్రి నారా లోకేశ్ ను కోరారు. తక్షణమే స్పందించిన మంత్రి సొంత ఖర్చుతో గుండె తరలింపునకు అవసరమైన ప్రత్యేక విమానం ఏర్పాటు చేశారు. తిరుపతిలోని ఆస్పత్రికి గుండె చేరే వరకు గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేసేలా సంబంధిత యంత్రాంగంతో మాట్లాడారు. రాత్రి 7 గంటలకు గ్రీన్ ఛానెల్ ద్వారా గుంటూరు రమేష్ ఆస్పత్రి సిబ్బంది గుండెను తరలించనున్నారు. మంత్రి నారా లోకేశ్ కు ఆయా కుటుంబ సభ్యులు, రమేష్ హాస్పటల్ వైద్యులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సకాలంలో స్పందించడంతో వైద్యులు ఒకరి అవయవ దానం, మరొకరికి ప్రాణదానం చేయనున్నారు. సొంత ఖర్చులతో గుండె తరలింపునకు ప్రత్యేక విమానం ఏర్పాటు చేయడమే కాకుండా, గ్రీన్ ఛానల్‌కు మార్గం సుగమం చేసిన మంత్రి నారా లోకేష్‌కు ఆయా కుటుంబ సభ్యులు తెలిపారు.

## భూ కేటాయింపుల సమీక్షా కమిటీ పునర్నిర్మాణం

### రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి. సిసోడియా



**విజయవాడ,మార్చి27,ప్రభాతవార్తప్రతినిధి:** జిల్లా స్థాయి భూ కేటాయింపు సమీక్షా కమిటీను పునర్ నిర్మాణం చేస్తూ రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పీ. సిసోడియా ఉత్తర్వులు జారీచేశారు. గతంలో జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులు (జి.ఓ. నంబర్లు 1 నుండి 7) రద్దు చేసారు. సి సి ఎల్ ఏ చేసిన ప్రతిపాదనను సమగ్రంగా పరిశీలించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. పునర్‌రచించిన కమిటీకి జిల్లా ఇన్‌చార్జి మంత్రి అధ్యక్షత వహించనుండగా, సంబంధిత జిల్లా మంత్రి, జాయింట్ కలెక్టర్ (సభ్య కార్యదర్శి), నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఎమ్మెల్యే, ఆర్‌డిఓ/సబ్ కలెక్టర్ సభ్యులుగా నియమితులయ్యారు. అదనంగా, అవసరమైన సందర్భాల్లో ప్రత్యేక ఆహ్వానితులను కూడా కమిటీకి పిలిచే అవకాశం ఉంది. కమిటీ ప్రధానంగా ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములు మరియు మిగులు భూపరిమితి భూములను అర్హులైన భూహీన పేదలకు వ్యవసాయ ప్రయోజనాల కోసం కేటాయించేందుకు చర్యలు తీసుకోనుంది. అలాగే, భూ కేటాయింపుల్లో మాజీ సైనికుల కోటాపై ప్రత్యేక పరిశీలన చేయాలని కమిటీకి దిశానిర్దేశం ఇచ్చారు. అన్ని జిల్లా కలెక్టర్లు, సి సి ఎల్ ఏ ఈ ఉత్తర్వులను అమలు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆర్.పీ. సిసోడియా ఆదేశించారు.

వార్త

దూరంగా ఏముందో ఆలోచన చేయనివారికి, సమీపంలోనే ప్రమాదం కాచుకుని ఉంటుంది.

-హెచ్.లాంగ్‌ఫెలో

# చేటు తెస్తున్న అటవీ విధ్వంసం!

మానవ తప్పిదాల వల్లనే విపత్తులు ఒకదాని వెంట ఒకటి తోసుకువస్తున్నాయి. అపార ప్రాణ, ఆస్తి నష్టాలకు కారణమవుతున్నాయి. వాతావరణంలో ఊహించని విధంగా తలెత్తుతున్న మార్పులు, ప్రకృతి వైపరీత్యాలకు దారితీస్తున్నాయి. ఇందుకు ముందుగా నిందించాల్సింది, తప్పుపట్టాల్సింది మానవుడినే. మానవుడి పర్యావరణ విధ్వంస చర్యలే ఈ బీభత్సానికి, విపత్తులకు కారణమవుతున్నాయని ఎన్నో అధ్యయనాలు స్పష్టం చేశాయి. పర్యావరణాన్ని కాపాడుకోలేకపోతే మానవుడి మనుగడే భవిష్యత్తులో ప్రశ్నార్థకంగా మారుతుందని ఎందరో పర్యావరణశాస్త్రవేత్తలు, ప్రేమికులు దశాబ్దాల తరబడి పదేపదే చెబుతున్నా పట్టించుకునే నాథుడే లేకుండాపోయాడు. పర్యావరణాన్ని కాపాడడం అటుంచి తూట్లు పొడవడం దురదృష్టకరం. అభివృద్ధి పేరుతో ప్రభుత్వాలు చేపడుతున్న కొన్ని కార్యక్రమాలు కూడా పర్యావరణానికి చేటుతెలుస్తున్నాయి. ఇష్టానుసారంగా ఇసుక తవ్వకాల నుంచి మొదలు పెడితే కొండలను తొలచి ప్రాజెక్టులు, రహదారుల నిర్మాణం, నగరీకరణ పేరుతో ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిఎకరాల పంటపొలాలు జనావాసాలుగా మార్చడం ఒకటేమిటి ఎన్ని విధాలుగా పర్యావరణానికి నష్టం చేయగలుగుతారో అన్ని మార్గాల్లో నిత్యం అన్వేషణ, విధ్వంసం కొనసాగుతూనే ఉన్నది. ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం మరో ఏడెనిమిదేళ్లలో ఇండియా జనాభా నూటయాభై కోట్లకుపైగా చేరుకుంటుందని అందుకు అనుగుణంగా దేశంలోని సహజవనరులపై ఒత్తిడి పెరుగుతుందని ప్రధానంగా అటవీ సంపద హరించుకుపోతుందని స్పష్టం చేసింది. అడవులను విధ్వంసం నుండి కాపాడేందుకు దేశంలో ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు కానీ అటు కేంద్ర ప్రభుత్వంకానీ చేపడుతున్న చర్యలు సఫలీకృతం కావడం లేదు. వందలాది ఎకరాల అటవీ సంపద రోజూ అదృశ్యమైపోతున్నది. ఈ విషయం ఐక్యరాజ్యసమితి నివేదికల్లో కూడా స్పష్టంచేసింది. విచక్షణారహితంగా అడవులను నరికివేయడంపట్ల న్యాయస్థానాలు కూడా తీవ్ర ఆందోళన వ్యక్తంచేశాయి. తాజాగాపర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని గుర్తుచేస్తూ దేశ అత్యున్నత న్యాయస్థానం కీలకమైన తీర్పు వెలువరించింది. చెట్లను నరికిన వ్యక్తికి చెట్టుకు లక్ష రూపాయల చొప్పున నాలుగు కోట్లయాభై లక్షల రూపాయలు జరిమానా విధించింది. పెద్దసంఖ్యలో చెట్లను నరికివేయడం,మనుషులను చంపడం కంటే దారుణమైందని జస్టిస్ అభయ్ ఎస్ఓకా, జస్టిస్ ఉజ్వల్ భూయాన్‌లతో కూడిన ధర్మాసనంవ్యాఖ్యానించింది. అంతేకాదు పర్యావరణం విషయంలో కనికరం చూపొద్దని కూడా ప్రభుత్వాలను దేశ అత్యున్నత న్యాయస్థానం హెచ్చరించింది. మథుర బృందవనంలోని దాల్మీయా ఫామ్స్‌లో ప్రైవేట్ భూమిలో ఒక వ్యక్తి నాలుగు వందల యాభై చెట్లను చట్టవిరుద్ధంగా నరికివేశారు.వాటిలో ముప్పైరెండు చెట్లు రక్షిత అటవీ భూమిలోని రోడ్డు పక్కనే ఉన్నాయి. దీంతో ప్రభుత్వం కోర్టును ఆశ్రయించడంతో ఈ సంఘటనపై దర్యాప్తు చేసిన సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ (సిఈసి) కొన్ని సిఫారసులు చేసింది. దీన్ని పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం ఆ వ్యక్తికి జరిమానా విధిస్తూ ఒక్కసారిగా అంతపెద్ద మొత్తంలో చెట్లను కూల్చివేయడం వల్ల కోల్పోయిన పచ్చదనాన్ని తిరిగి తీసుకురావడానికి అంతవృక్షజాలాన్ని పెంపొందించడానికి కనీసం వందేళ్లపైగా పడుతుందని వ్యాఖ్యానించింది. జరిమానా తగ్గించాలని నిందితుని అభ్యర్థనను కూడా సుప్రీం తిరస్కరించింది. న్యాయస్థానాల చర్యలతో అక్కడక్కడ ఈ అటవీ నరికివేత కొంతమేరకు తగ్గుతున్నా క్రమేపీ అటు స్మగ్లర్లు, ఇటు మరికొందరు దళారుల గొడ్డలివేటుకు అడవితల్లి గిలగిలలాడుతున్నది. ప్రభుత్వం కూడా బొగ్గు గనులు, థర్మల్ విద్యుత్ కేంద్రాలు,పరిశ్రమలు,నదీలోయలోని ప్రాజెక్టుల కోసం అడవులను నరికివేస్తున్నారు. ఇలాంటి కారణాలెన్నో పర్యావరణానికి విఘాతం కలుగుతున్నాయి. మరోకపక్క కొన్ని ప్లాస్టిక్ వస్తువులను నిషేధించినా అవి కాగితాలకే పరిమితమైపోతున్నాయి. ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి ఎంతటి హాని చేస్తున్నదో ప్రజల్లో అవగాహన కల్పించడంలో అధికారవర్గాలు విఫలమవుతున్నాయని చెప్పొచ్చు. పరిశ్రమలు వదులుతున్న పొగ, ధూళికణాలు తదితరవన్నీ వాయుకాలుష్యాన్ని పెంచుతున్నాయి.ఇలాంటి రకరకాల కారణాలతో భూమి ఉష్ణోగ్రత పెరిగిపోక తప్పదు. ఇదే పరిస్థితి కొనసాగితే ఉష్ణోగ్రత పెరిగి ప్రపంచంలోని తీర ప్రాంతాలు, దీవులతోసహా అనేక దేశాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని ఏనాటి నుంచో పర్యావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తూనే ఉన్నారు. ఇలా ప్రకృతితో మనిషి ఆటలాడుకుంటుంటే అందుకు ప్రకృతి ప్రతిగా తీవ్రంగా స్పందిస్తున్నది. పర్యావరణ సమతుల్యం దెబ్బతిన్న కారణంగా సకాలంలో వర్షాలు కురియకపోవడం, కురిస్తే ఒకే ప్రాంతంలో కుంభవృష్టి కురియడం, అకాల వర్షాలు, రాళ్ల వానలు ఇటీవల కాలంలో పెరిగిపోతున్నాయి. అంతేకాదు వరదలు, తుఫాన్‌లు, భూకంపాలు లాంటి ఉపద్రవాలు చోటు చేసుకుంటున్నాయి. యేటా దాదాపు మూడువందల ఎనభైకిపైగా ప్రపంచవ్యాప్తంగా ఉపద్రవాలు సంభవిస్తుంటే లక్షలాది మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ఆస్తి నష్టాల గురించి చెప్పాల్సిన అవసరం లేదు. తుఫాన్‌లతో వ్యవసాయ రంగం కుదేలవుతున్నది. ఏదిఏమైనా ఉపద్రవాల నియంత్రణకు పర్యావరణాన్ని కాపాడేందుకు త్రికరణ శుద్ధిగా కృషి చేయాలి. ఇందులో ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా మరెన్నో ప్రళయాలు తప్పవు. భారీమూల్యం చెల్లించాల్సి వస్తుంది.

ఘర్షణల వల్ల శక్తి వృధా అవుతుంది. హెచ్చుతగ్గులు వస్తాయి. ఆందోళనలు చెలరేగుతాయి. అశాంతి కలుగుతుంది.



ఐ.జన్సాన్

జీవితంలో ఏదీ వ్యసనంగా పరిణమించకూడదు. అదే జీవితానికి ప్రధాన సూత్రం.



మార్షల్

# విలువలు పెంచే బడులు పెరగాలి

**విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా వారి ఆరోగ్య భద్రతల గురించి తగు జాగ్రత్తలను సూచిస్తూ వారికి కౌన్సిలింగ్ ఇచ్చేందుకు స్టూడెంట్ వెల్‌బీయింగ్ ప్రోగ్రామ్స్‌ను ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో కొత్త అకాడమిక్ క్యాలెండర్‌లో పొందుపరుస్తుంది. విద్య అంటే బోలెడన్ని పుస్తకాలు చదవడం, బట్టీపట్టడం, పరీక్షలు రాయడంకాదు. విద్యఅంటే శీలనిర్మాణం.విద్య అంటేమానవులలో విలువలను పెంపొందించేది. మీరు అలాంటి విలువలను పెంపొందించుకుంటే అదేగొప్ప విద్య అని అంటారు గాంధీజీ. అయినప్పటికీ ప్రస్తుత కాలంలో మన సమాజంలో విలువలు లోపిస్తున్నవి అనేది అక్షరసత్యం. ఆ విలువలు పతనం కాకుండా వాటిని విద్యార్థి దశనుండి నిలబెట్టేందుకు తగు ప్రణాళికలను ఈ క్యాలెండర్‌లో పొందుపరచబడింది.**

దేశ భవిష్యత్తు తరగతి గదిలో రూపొందుతుందనేదిసత్య వాక్కు అనేందుకు ఆశ్చర్యమేమీలేదు. శాస్త్ర సాంకేతికత ఆధారంగా ముందుకెళుతున్న నేటి ప్రపంచంలో విద్యయే ఆ దేశ సౌభాగ్యాన్ని, సంక్షేమాన్ని, భద్రతను నిర్ధారిస్తుంది. అందుకనే ఒక దేశాన్ని నాశనం చేయాలంటే అణుబాంబులు వేసినా మళ్లీ పునర్నిర్మాణం చేసుకోగలం. దానికి ఉదాహరణయే నేటి జపాన్. ఏ దేశంలో అయితే విద్యా వ్యవస్థను నాశనం చేస్తామో ఆ దేశం శతాబ్దాల తరబడి అభివృద్ధి వైపు పయనించదనేది మేధావుల అభిప్రాయం. అందుకనే మన జాతి పునర్నిర్మాణము చెందాలంటే మన పాఠశాలలు, కళాశాలలో నుండి బయటకు వచ్చే విద్యార్థుల గుణాత్మకతపై ఆధారపడి ఉంటుంది. ఈ దశగానే మన ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వం పాఠశాలస్థాయి నుండి గుణాత్మక విద్యను అందించడానికి ప్రస్తుతం విద్యావిధానాలలో అనేకరకాలమార్పులను చేసి పాఠశాల విద్య బలోపేతానికి కృషి చేస్తుంది. ఇందులో భాగంగానే నూతన విద్యా సంవత్సరానికి ఐదు రకాల బడుల విధానాన్ని తీసుకొచ్చే క్రమంలో అనేక రకాల సంస్కరణలకు పునాది వేయడం జరుగుతుంది. ప్రతి సంవత్సరం నిర్వహించే నేషనల్ అచీవ్మెంట్ సర్వే ప్రకారం ప్రస్తుతం రాష్ట్రంలో విద్యా ప్రమాణాలు ఆశించినంతగా లేదని జాతీయ సగటు కంటే మూడవ తరగతి విద్యార్థులు 5శాతం నుంచి 8శాతం వరకు వారి విద్యాలక్ష్యాల పరంగా తక్కువగా ఉన్నదని తెలియజేయటం జరుగుతుంది. పై తరగతులలో ఈ అంతరం మరింత ఎక్కువగా కనబడుతుంది. అసర్ 2024 నివేదిక సైతం రాష్ట్రంలో ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసి నైపుణ్యాలనేది విద్యార్థులలో క్షీణతయే కనబడుతుందని ప్రకటించింది. ఇలాంటి పరిస్థితులకు ధీటుగా పాఠశాలలను సమూలంగా మార్పులు చేసి విద్యా విధానాలలో సంస్కరణలకు శ్రీకారం చుట్టేందుకు సమాయత్తం అవుతుంది ఆంధ్రరాష్ట్ర విద్యాశాఖ. విద్యాలక్ష్యాల సాధనలో ఎదురయ్యే సమస్యలను అధిగమించేందుకు విద్యాశాఖ తీసుకొచ్చే నూతన సంస్కరణలలో భాగంగా 117 జీవోను అనుసరించి ఇప్పటివరకు జరిగిన మార్పులు సరైన ప్రతిఫలాన్ని ఇవ్వలేకపోతున్నదని భావించడం, కొన్ని వర్గాల నుండి వ్యతిరేక భావనలు రావడం వలన, ప్రస్తుతం దీనిని రద్దుచేసి మరింత సంస్కరణలవైపు విద్యాశాఖ అడుగులేయడం జరుగుతుంది. దీనిలో భాగంగానే ఐదు రకాల బడుల విధానాన్ని అందుబాటులోకి తీసుకురావడం కోసంప్రభుత్వం కృషి చేస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతుంది. సాటిలైట్ ఫౌండేషన్, ఫౌండేషన్, బేసి ప్రైమరీ స్కూల్స్, మోడల్ ప్రైమరీ స్కూల్స్, ఉన్నత పాఠశాలలు వీటిలో ఉంటుంది. అందులో భాగంగానే విద్యార్థులకు గుణాత్మక విద్యను పెంపొందింప చేసే ఉద్దేశంతో మోడల్ ప్రైమరీ స్కూల్స్ విద్యా విధానాన్ని విద్యాశాఖ తీసుకురావడం జరిగింది. 45 నుండి 60 మంది విద్యార్థులున్న ప్రతి పాఠశాలను మోడల్ పాఠశాలలుగా గుర్తించటం జరుగుతుంది. అలాంటి పాఠశాలలకు ఐదుగురు ఉపాధ్యాయుల చొప్పున ఆ పాఠశాలలకు కేటాయించి ఒకటి నుండి ఐదవతరగతి వరకు ఒక్కొక్క తరగతికి ఒక్కొక్క ఉపాధ్యాయుడును ఉంచి క్వాలిటీ ఎడ్యుకేషన్ ప్రతి

**వి.వి రమణ నాయక్**

విద్యార్థికి అందించేందుకు ప్రభుత్వం కృషిచేస్తుంది. దీని వలన విద్యార్థులకు గుణాత్మక విద్య అందడమే కాకుండా ప్రస్తుత కాలానుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు కృషి చేయడం జరుగుతుంది. ప్రస్తుతం సుమారు 12వేలకు పైగా ఏకోపాధ్యాయ పాఠశాలలున్నాయి. అక్కడ అభ్యసిస్తున్న విద్యార్థులకు ప్రతిరోజు ఆ ఉపాధ్యాయుడు 18రకాల సబ్జెక్టులను బోధించాల్సిన పరిస్థితి ఎదురవుతున్నది.60 మంది లోపు ఉన్న కొన్ని పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులుఉండి ప్రతిరోజు 9రకాల సబ్జెక్టులను బోధించాల్సిన పరిస్థితి నెలకొన్న తరుణంలో అక్కడ క్వాలిటీ ఎడ్యుకేషన్ విద్యార్థులకు అందడం అనేది ఎండమావుల నుండి నీటిని ఆశించినట్లే అవుతుందనే అభిప్రాయం కలుగుతుంది. విద్యార్థుల వెనుకబాటుతనానికి ఇదొక ప్రధానకారణంగా భావిస్తుంది ప్రభుత్వం. కాబట్టి ఇలాంటి పరిస్థితులను అధిగమించడానికి రాష్ట్ర విద్యాశాఖ మోడల్ స్కూల్ విధానాన్ని పేద విద్యార్థుల కోసం, రాష్ట్ర భవిష్యత్తు కోసం సమాజానికి అందుబాటులోకి తీసుకురావడం జరిగింది. దీనివలన ఒక్క



ఉపాధ్యాయుడే అన్నేసి రకాల సబ్జెక్టులను బోధించాల్సిన అవసరం లేకుండా తను ఏ సబ్జెక్టులో అయితే నిష్ణాతుడై ఉంటే ఆ సబ్జెక్టునే బోధించి విద్యార్థులకు గుణాత్మకమైన విద్యను అందించడానికి ప్రయత్నాలు చేయుటకు, ప్రభుత్వం తగు ప్రణాళికలు రూపొందిస్తుంది అని చెప్పేందుకు ఎటువంటి అతిశయోక్తి లేదు. కొన్ని ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉంటున్న సందర్భాలలో సబ్జెక్టు టీచర్స్‌చే కాకుండా ప్రైమరీ టీచర్స్‌చే బోధన జరుగుతున్న విధానాన్ని గుర్తించిన విద్యాశాఖ, ఇలాంటి లోపాలను సరిదిద్దే ఉద్దేశంతో ఇక మీదట అటువంటి సందర్భాలలో ఆ విద్యార్థులకు ప్రైమరీ టీచర్స్‌చే కాకుండా, సబ్జెక్ట్ టీచర్స్‌చే బోధన అందించటానికి వారిని సమీపంలోని హై స్కూల్స్‌లో చేర్చేందుకు ప్రణాళికలు రూపొందించడం జరుగుతుంది. ఇలా చేయడం వలన ఆ విద్యార్థులకుసబ్జెక్టు టీచర్లచే బోధన అందుతుంది. దీనితో వారికి క్వాలిటీ విద్య అందుతుందనే అభిప్రాయం కలుగుతుంది విద్యావేత్తలకు. ఈ విధానం కూడా పాఠశాల కమిటీ మెంబర్లైన వారి తల్లిదండ్రుల ఇష్టప్రకారంతోనే ఉన్నత పాఠశాలలకు సర్దుబాటు చేయడానికి ప్రణాళికలు రచించారు. విద్యా విధానాలలో తీసుకొస్తున్న మార్పులలో భాగంగా విద్యాశక్తి కార్యక్రమం ఒకటి. దీనివలన విద్యార్థులకు హైబ్రిడ్ లర్నింగ్ నిర్వహిస్తారు. అనగా వెనుకబడిన విద్యార్థులను ముందు ఉంచడానికి వీరికి ఆన్లైన్ ద్వారాకానీ, ఆఫ్లైన్ ద్వారా కానీ తరగతులు చెప్పించటానికి ఐఐటి మద్రాస్‌వారితో విద్యాశాఖ ఒప్పందం కుదుర్చుకుంది.ప్రభుత్వ కాలేజీలో చదువుతున్న ఇంటర్ విద్యార్థులకు సైతం ఎంసెట్, జేఈఈ మెయిన్స్‌లకుకోచింగ్ తరగతులను విద్యాశక్తిపేరుతో నిర్వహించటం జరుగుతుంది. ప్రస్తుతం కొన్నిచోట్ల పైలట్‌ప్రాజెక్టు కింద సుమారు 1800 మందికి ఉన్నత విద్య అవకాశాలకోసం కోచింగ్ ఇప్పించడం జరుగుతుంది. రాబోయే రోజులలో ప్రతి కళాశాలలో ఇది అందుబాటులోకి వస్తుందనే అభిప్రాయంకలుగుతుంది. గ్లోబలైజేషన్‌లో భాగంగా ఇంగ్లీష్ ప్రాముఖ్యతననుసరించి తప్పనిసరిగా విద్యార్థులకు ఇంగ్లీష్ భాష నైపుణ్యం అవసరమని గుర్తించిన విద్యాశాఖ, ఆంగ్లభాష కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందించేందుకు మిషన్ ఇంగ్లీష్ ఫ్లూయెన్సీలాంటి కార్యక్రమాలను నిర్వహించుటకు సమాయత్తమవుతున్నది. ప్రస్తుత కాలంలో ఈ పేద ప్రభుత్వ విద్యార్థులకు కమ్యూనికేషన్స్ స్కిల్స్ అనేది ఎంతో అవసరమైనదని విద్యా విశ్లేషకులు అభిప్రాయపడుతున్న ఈతరుణంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అనేది హర్షించదగ్గ విషయంగా అభివర్ణించవచ్చు. కాలానుగుణంగా వచ్చేనూతన మార్పులను అందిపుచ్చుకునేందుకు విద్యార్థులను సంసిద్ధం చేయడం విద్యాలక్ష్యాలలో ఒకటి. అందుకనే ప్రస్తుత కాలంలో ఏఐ యుగం ప్రవేశించిన పిదప దానిని అనుసరించి విద్యార్థి దశ నుండే డిజిటలీకరణకు అలవాటు చేయుటకు స్మార్ట్‌క్లాస్ రూమ్స్‌ను పెంచేందుకు విద్యాశాఖ కసరత్తుచేస్తుంది. అంతేకాకుండా డిజిటల్ అభ్యాసన సామర్థ్యాలను విద్యార్థులకు పెంపొందించేందుకు తగుప్రణాళికలను విద్యావిధాన మార్పులలో భాగంగా తయారు చేసేందుకు సంసిద్ధంగా ఉన్నది. విద్య అనేది వ్యక్తి ఉపాధికి ఉపయోగపడా లనే ఉద్దేశంతో, విద్యార్థి దశ నుండే వారికి కెరీర్ గైడెన్స్‌ను అందించేందుకు విద్యాశాఖ పలురకాల ఉద్యోగ,ఉపాధి అవకాశాల సమాచార విధానాన్ని విద్యార్థుల ముందుకు తీసుకువస్తుంది. దీనిలో భాగంగా ఇంజనీరింగ్ చదువు, ఏపీపీఎస్సీ పరీక్షలవిధానం, వాటిలో ఉన్న ఉద్యోగరకాలు, యూపీఎస్సీ విధానం, బ్యాంకింగ్ మొదలైన ఉద్యోగాలు సాధించు విధానాలను విద్యార్థులకుతెలిపేందుకు వాటిని కెరీర్‌గైడెన్స్‌లోభాగంగా తరగతుల రూపంలో వివరించి వారిని లక్ష్యసాధనవైపు పంపేందుకు విధివిధానాలను విద్యాశాఖ రూపొందించుతున్నది. అంతేకాకుండా విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా వారి ఆరోగ్య భద్రతల గురించి తగు జాగ్రత్తలను సూచిస్తూవారికి కౌన్సిలింగ్ ఇచ్చేందుకు స్టూడెంట్ వెల్ బీయింగ్ ప్రోగ్రామ్స్‌ను ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో కొత్తఅకాడమిక్ క్యాలెండర్‌లో పొందుపరుస్తుంది. విద్యఅంటే బోలెడన్ని పుస్తకాలు చదవడం, బట్టి పట్టడం,పరీక్షలు రాయడం కాదు. విద్య అంటే శీలనిర్మాణం. విద్య అంటే మానవులలో విలువలను పెంపొందించేది. మీరుఅలాంటి విలువలను పెంపొందించుకుంటే అదేగొప్ప విద్యఅని అంటారు గాంధీజీ.అయినప్పటికీ ప్రస్తుత కాలంలో మన సమాజంలో విలువలు లోపిస్తున్నవి అనేది అక్షరసత్యం. ఆ విలువలు పతనం కాకుండా వాటిని విద్యార్థి దశ నుండి నిలబెట్టేందుకు తగు ప్రణాళికలను ఈ అకాడమిక్ క్యాలెండర్‌లో పొందుపరచబడింది. •

# అంతర్జాతీయ బ్రాండ్‌గా అరకు కాఫీ!

**అప్పన్న గొనప**

అరకు లోయలో పుట్టి, ప్రపంచాన్ని అలరిస్తున్న అరకు కాఫీ ఇప్పుడు అంతర్జాతీయంగా ప్రఖ్యాతి పొందుతోంది. విశేషమైన సువాసన, అనుపమమైన రుచి, ఆరోగ్యానికి మేలు చేసే లక్షణాలతో ఈ కాఫీ ప్రపంచవ్యాప్తంగా కాఫీ ప్రియులను ఆకర్షిస్తోంది. తక్కువ ఆమ్లత, సహజమైన తియ్యతనంతో ప్రత్యేకమైన ఈ కాఫీ దేశీయంగా మాత్రమే కాకుండా, విదేశాల్లోనూ మంచి డిమాండ్‌ను సంపాదించుకుంది. అరకు కాఫీని ప్రత్యేకంగా నిలిపే ప్రధాన అంశం - దాని సేంద్రీయ సాగు. ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన రైతులు రసాయన ఎరువులు లేకుండా సంప్రదాయ, సహజ విధానాలను అనుసరించి ఈ కాఫీని పెంచుతున్నారు. ఈ ప్రకృతి సిద్ధ కాఫీ గింజలు ఆరోగ్యానికి హితంగా ఉండటమే కాకుండా, మృదువైన రుచితో కాఫీ ప్రియులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అరకు లోయ తన అందచందాలతో మాత్రమే కాకుండా, ఇప్పుడు కాఫీ ఉత్పత్తి ద్వారా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందుతోంది. పూర్వం బ్రిటిష్ వారు ఈ ప్రాంతాన్ని కాఫీ సాగుకు ఉపయోగించినా, స్వాతంత్ర్యానంతరం ఈ మల్లిపొదల కొండలు కొంతకాలం మరుగున పడిపోయాయి. అయితే, గిరిజన రైతుల కృషి, ప్రభుత్వ మద్దతు, ప్రైవేట్ రంగ సహకారం ద్వారా ఈ కాఫీ తిరిగి చైతన్యం పొందింది. ఈ ప్రాంతంలో సేంద్రియ విధానాలతో పండించే అరకు ఇప్పుడు భారతీయ వ్యవసాయ రంగంలో ఒక విప్లవంగా మారింది. గిరిజన రైతుల కృషి, ప్రకృతి సిద్ధంగా సాగుచేసే విధానాలు, పరిపక్వతకు ప్రత్యేక శ్రద్ధ ఇవన్నీ కలసి అరకు కాఫీని ప్రపంచంలోనే అత్యుత్తమ కాఫీల్లో ఒకటిగా నిలబెట్టాయి. ఇటీవల అరకు కాఫీ ప్రాముఖ్యతను మరింతగా చాటే విధంగా భారత పార్లమెంట్ ప్రాంగణంలో ప్రత్యేక అరకు కాఫీ స్టాల్ ప్రారంభించబడింది. ఇది దేశవ్యాప్తంగా అరకు కాఫీ గురించి అవగాహన పెంచడమే కాకుండా, గిరిజన రైతులకు కొత్త మార్కెట్ అవకాశాలను అందించేందుకు ఎంతో ఉపయోగపడుతుంది. ఈ నిర్ణయం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ దూరదృష్టికి, ముఖ్యమంత్రి ప్రోత్సాహానికి నిదర్శనం. గిరిజన రైతుల ఆదాయాన్ని పెంచేందుకు, ఈ ప్రత్యేక ఉత్పత్తిని దేశవ్యాప్తంగా విస్తరించేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయం. ప్రస్తుతం అరకు కాఫీకి ప్రపంచవ్యాప్తంగా మంచి గిరాకీ ఉంది. ప్రముఖ హోటళ్లు, స్పెషలిటీ కాఫీ షాపులు ఈ కాఫీని తమ మెనూలో చేర్చుకుంటున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌ను లక్ష్యంగా చేసుకుని "అరకు గ్లోబల్ బ్రాండ్" గా మారేందుకు ప్రభుత్వం, ప్రైవేట్ కంపెనీలు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నాయి. భారత ప్రభుత్వం, ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, అరుకు కాఫీ రైతులకు మరింత ప్రోత్సాహం అందించేందుకు చర్యలు చేపడుతోంది. ముఖ్యమంత్రి నాయకత్వంలో ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, గిరిజన రైతుల అభివృద్ధికి, అరకు కాఫీని ప్రపంచస్థాయిలో నిలబెట్టేందుకు ఎంతో దోహదపడుతున్నాయి. కాఫీ సాగు విస్తరణ, మార్కెటింగ్ సదుపాయాల కల్పన, ఎగుమతులను పెంచే విధంగా కొత్త ఆవిష్కరణలను అమలు చేస్తోంది. 'మేక్ ఇన్ ఇండియా అరకు కాఫీ' అనే కాన్సెప్ట్‌ను ప్రోత్సహిస్తూ, దేశీయంగా,అంతర్జాతీయంగా అరకు కాఫీ ప్రాధాన్యతను మరింత పెంచేందుకు ప్రభుత్వ చొరవ అభినందనీయమైనది. ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఉన్న కాఫీ బ్రాండ్లతో పోటీపడే స్థాయికి అరకు కాఫీ ఎదిగింది. ఇప్పటికే ప్రపంచ ప్రఖ్యాత కాఫీ బ్రాండ్లతో పోటీ పడుతూ, తన ప్రత్యేకతను నిలబెట్టుకోవడం గర్వించదగ్గ విషయం. భారత్ నుంచి వచ్చే అరకు కాఫీ, కేవలం వాణిజ్య ఉత్పత్తిగానే కాకుండా, "సాంస్కృతిక సంపద'గా మారింది. అరకు కాఫీ,భారతదేశ వ్యవసాయ రంగంలోనే కాకుండా, అంతర్జాతీయ మార్కెట్‌లోను ప్రత్యేక స్థానం సంపాదిస్తోంది. ఇది కేవలం ఒక కాఫీ మాత్రమే కాదు, భారతీయ కృషి, సంప్రదాయ వ్యవసాయ నైపుణ్యానికి సజీవ నిదర్శనం. భవిష్యత్తులో మరింత మందికి అరకు కాఫీ అందించేందుకు, ప్రభుత్వ సహకారంతో పాటు ప్రైవేట్ రంగం మరింత ప్రాధాన్యత ఇవ్వాలి. •

# ప్రజావాక్కు



### వికసిత్ భారత్‌కు అవినీతి అడ్డంకి

ఢిల్లీ హైకోర్టు జడ్జి అధికార నివాసంలో నోట్ల కట్టలు కనబడ్డాయని వార్తలొచ్చాయి. అవి సుమారుగా 50 కోట్లు ఉండవచ్చునేమోననే అంటున్నారు.కష్టపడి సంపాదించిన సొమ్మును ఎవరైనా బ్యాంకులోనో,బీరువాలోనో భద్రంగా దాచుకుంటారు గానీ ఇలావిచ్చలవిడిగా గదుల్లో పరచుకోరుకదా.మనకున్న అన్నిరంగాలు అవినీతిమయమైందనే వాస్తవం మరువరానిది. నమ్మకమున్న ఒకే ఒక వ్యవస్థ న్యాయస్థానం. అది కూడా చెడిపోతే ప్రజలకు దిక్కేది? వారిచ్చేతీర్పులు న్యాయసమ్మతమేనా అనే అనుమానాలు పొడచూపడంలో ఆశ్చర్యంలేదు.నేరారోపణ ఎదుర్కొంటున్న ఈ జడ్జిగారి పేరు యశ్వంత్ వర్మగారట. వీరిని అలహాబాద్ హైకోర్టుకు సుప్రీంకోర్టు కొలీజియం బదిలీ చేస్తే అక్కడి న్యాయవాదులు అభ్యంతరం వ్యక్తం చేసారు. ఈ జడ్జిగారిపై మోపబడిన అపవాదు అవినీతి ఆరోపణలు విచారణలో తేలాలి.గతంలో కూడా న్యాయ వ్యవస్థ మీద అవినీతి ఆరోపణలు లేకపోలేదు. ఓ పక్క వికసిత భారత్ దిశగా అడుగులు వేస్తూ 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా ప్రసిద్ధి చెందాలన్న ఆశలు లోతుగా వేళ్లూనుకుపోయిన అవినీతి అడ్డంకిగా మారుతుందేమోననే భయం, అనుమానం కలుగుతోంది.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### అసెంబ్లీ సమావేశాలు పొడిగించాలి

ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీసమావేశాలగడువు ముగుస్తుంది.కావునా ప్రజా సమస్యల అంశాల చర్చకై మరింత సమయం పెంచాలి. ప్రజా ప్రయోజనాలకై అసెంబ్లీలో చర్చజరగాలి. రానున్న వేసవి కాలం కావునా ప్రధానంగా త్రాగునీరు, సాగునీరుపై చర్చించి నీటి సమస్యల పరిష్కారానికి మార్గం చూపాలి. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాలు పొడిగించాలి.

-మిద్దె సురేష్, నాగర్ కర్నూల్ జిల్లా

### అనుమానం నివృత్తి చేయాలి

టిజిపియస్‌సి ఇటీవల ప్రకటించిన గ్రూప్ 1 ఫలితాలలో తెలుగు మీడియం విద్యార్థులకు తక్కువ మార్కులు వచ్చినట్లు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టి జి పి యస్‌సి స్పందించి విద్యార్థుల అనుమానంనివృత్తి అయ్యేలా ఒక స్పష్టమైన ప్రకటన జారీ చేయాలి.

- పుట్లూరి రాంనర్సింహా రెడ్డి, నల్లగొండ జిల్లా

### పెన్షన్ పెంచండి

పంతొమ్మిదివందల యాభైనాలుగు చట్టం పార్లమెంట్ సభ్యులకు జీతాలుపెన్షన్ పెంచుటకు రూపొందించబడినది సీనియర్ సిటిజన్స్‌కు రైల్వేరాయితీలను పునరుద్ధించుటకుఇప్పటికే రైల్వే టికెట్లలలోఎక్కువ రాయితీలు కల్పిస్తున్నామనిపలు సందర్భాల్లో తెలియజేస్తున్నారు. ఉద్యోగుల జీతభత్యాలు పెంచుటకు రకరకాల కమిటీలను వేసి వాటి నివేదికలను పరిశీలించి పెంచుట సాధ్యంకాదని తెలియజేస్తుంటారు.కనీసం కరువు భత్యం కూడా సమయానికి ఇవ్వడం లేదు. దాదాపు 1000 లోపల ఉండే పార్లమెంట్ సభ్యులకు మాత్రం ఐదు సంవత్సరాల కాలపరిమితిలో వారికి అనుకూలంగా నియమ నిబంధనలను చట్టాలనుతూ.చ తప్పకుండా అమలుచేస్తుంటారు. కానీ 1998 బొగ్గు గనుల ప్రావిడెంట్ ఫండ్ చట్టాన్ని అమలు చేయటంలో శ్రద్ధ చూపడం లేదు. ప్రతి మూడేళ్లకు ఒకసారి పెన్షన్ సమీక్ష చేసి పెంచుటకు నిర్ణయం తీసుకున్నా 27 సంవత్సరాలు కావస్తున్నఇంతవరకు ఒక్కసారికూడా పెన్షన్ పెంపుదల చేయలేదు.

-దండంరాజు రాంచందర్ రావు, హైదరాబాద్

### ఆన్‌లైన్ మోసాలతో అప్రమత్తంగా ఉండాలి

మీ మొబైల్‌కి లక్షరూపాయలు లాటరీ తగిలింది. కొంత సొమ్ము ధరావత్తుకట్టండి.లక్ష మీఅకౌంట్‌కుజమచేస్తాం.ఓటిపి చెప్పండి. వెయ్యి కడితే గంటలో రెండువేలు ఇస్తాం. అలా ఐదు,ఆరు సార్లుమనల్ని నమ్మించి లాభాలు వచ్చేలా అకౌంట్‌కి జమ చేసి తర్వాత వారి వలలో మనల్నివేసుకొని లక్షకి లక్షా, కోటికి కోటి అని నమ్మబలుకుతారు. మనం దురాశతో కోట్లు ఇల్లు, వాకిలి అమ్మి వారి ఇనుపసాలే గూటిలో చిక్కుకుపోతాము. తర్వాత వారి నుంచి స్పందన శూన్యం. మిత్రుల సహాయంతో ఆన్‌లైన్ మోసపూరిత భూతాన్ని తరిమికొట్టండి.

-ఐనకోట రవికుమార్, నెల్లూరు

### కోనోకార్పస్ చెట్లను వెంటనే తొలగించండి

కరీంనగర్ కార్పొరేషన్‌లోని ఆయా రోడ్లప్రాంతాల్లో ఉన్న ప్రమాదకరమైన కోనోకార్పస్ చెట్లను వెంటనే తొలగించాలని వాటి స్థానంలో మంచి పూలు,పండ్ల మొక్కలు నాటాలన్నారు. పచ్చదనంకోసం మొక్కలు నాటడం బాగుందని, కానీ కోనోకార్పస్ వల్ల శ్వాససంబంధిత వ్యాధులు వచ్చేప్రమాదం ఉందన్నారు. వీటిని ఆ ప్రాంతం నుండి వెంటనే తొలగించాలని మంగళవారం రోజున తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు వెంటనే చర్యలు తీసుకోగలరు.

-సింగు. లక్ష్మీనారాయణ,చింతకుంట, కొత్తపల్లి, కరీంనగర్

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# పర్యావరణ సమతుల్యత అవసరం

**డాక్టర్. కోలాహలం రామ్ కిశోర్**

పర్యావరణ పరిరక్షణకు, ఆర్థిక వృద్ధి రేటుకు మధ్య సంఘర్షణ మొదలైంది.భారత ప్రభుత్వం అభివృద్ధి ప్రయాణాన్ని ఒక నూతన నమూనాగా రూపొందించింది. పారిశ్రామిక విస్తరణ దేశాన్ని గ్లోబల్ ఎకానమీ వైపు తీసుకెళ్లినప్పటికీ, అది తీవ్రమైన పర్యావరణ నష్టాన్ని కూడా తెచ్చిపెట్టింది. 1970ప్రాంతంలో చిప్కో ఉద్యమం పర్యావరణ పోరాటాలు ప్రకృతి పరిరక్షణ మాత్రమే కాకుండా సామాజిక న్యాయానికీ సంబంధించినవని స్పష్టంగా చూపించింది. ఆదివాసీలు, చిన్న రైతులు విధ్వంసకరమైన అభివృద్ధిని వ్యతిరేకించేవారుగా చరిత్రలో నిలిచారు.ప్రస్తుతం భారతదేశం తీవ్రమైన పర్యావరణ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. గాలి కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరుకుంది. ఢిల్లీ వంటి నగరాల్లో పీఎం 2.5 స్థాయిలు భద్రతా పరిమితులను పదింతలు మించిపోయాయి. 2023 పర్యావరణ పనితీరు సూచిక (ఈ పీఐ) ప్రకారం, భారత్ 180 దేశాల్లో 168వ స్థానంలో ఉంది.కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీ పీసీబీ ) నివేదిక ప్రకారం,దేశంలోని 70శాతం నదులు మానవ వినియోగానికి అనర్హంగా మారాయి. గంగా, యమునా వంటి పవిత్ర నదుల్లో ప్లాస్టిక్, రసాయన కాలుష్యం తీవ్ర స్థాయికి చేరింది. భూగర్భ జలాల దిగజారుతున్న తీరు మరింత ఆందోళన కలిగిస్తోంది. పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లో నీటి మట్టం ప్రతి సంవత్సరం ఒక మీటరుకు పైగా పడిపోతుందని అధ్యయనాలు సూచిస్తున్నాయి. జీవవైవిధ్యం నష్టపోవడం ఈ సమస్యలను మరింత తీవ్రంగా మార్చుతోంది. "లాంటానా" వంటి దుష్ప్రభావిత మొక్కలు భారత అడవులను 40 శాతం ప్రాంతాన్ని ఆక్రమించాయి. అవి స్థానిక వృక్ష జాతులను, జీవుల ఆహార వనరులను ధ్వంసం చేస్తున్నాయి. పులుల జనాభా పెరిగినప్పటికీ, వాటి సహజ నివాసాల్లో 30 శాతం మానవ ముప్పునకు గురవుతున్నాయి. ఈ కారణంగా అడవుల్లో జంతువులు, స్థానికప్రజల మధ్య ఘర్షణలు పెరుగుతున్నాయి. 2030నాటికి 500గిగావాట్ల నూతనీకరణీయ శక్తిని ఉత్పత్తి చేయాలని ప్రభుత్వ లక్ష్యం ఉన్నప్పటికీ, ఇప్పటికీ భారత్ 70 శాతం ఇంధన అవసరాల కోసం బొగ్గుపై ఆధారపడినట్లే ఉంది. పర్యావరణ వినాశన ప్రభావం సమాజంలో అసమానంగా పంచబడింది. ఈ నష్టాన్ని తీవ్రంగా ఎదుర్కొనేది పేద ప్రజలే. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) నివేదిక ప్రకారం, ఢిల్లీలో శ్వాసకోశ వ్యాధులలో



30 శాతం మంది బాధితులు మురికివాడల ప్రజలే. నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం, రసాయన కాలుష్యం వల్ల వ్యవసాయ భూముల ఉత్పత్తి సామర్థ్యం 40 శాతం తగ్గిపోయింది. ఈ కారణంగా చిన్న రైతులు మరింత దారిద్రంలోకి కూరుకుపోతున్నారు. అడవుల హక్కులను పరిరక్షించేందుకు 2006లో తెచ్చిన అడవి హక్కుల చట్టం (ఎఫ్ ఆర్ ఏ.) అమలులో విఫలమైందని ఆక్స్ఫామ్ సంస్థ పేర్కొంటోంది. దేశంలోని ఆదివాసీలలో 50 శాతం మంది ఇప్పటికీ తమ సాంప్రదాయ అడవి హక్కులను కోల్పోతున్నారు.ఈ సవాళ్లను ఎదుర్కొవాలంటే రాజకీయ, పారిశ్రామిక, సామాజిక స్థాయిల్లో దృఢమైన చర్యలు అవసరం. రాజకీయ నిర్లక్ష్యం ఈ సమస్యను మరింత తీవ్రతరం చేస్తోంది. 2020లో ప్రభుత్వం తీసుకువచ్చిన పర్యావరణ ప్రభావ అంచనా (ఈ ఎల్ ఏ) నిబంధనలు పారిశ్రామిక వర్గాలకు అనుకూలంగా మార్చబడ్డాయి. ప్రస్తుత బడ్జెట్‌లో పర్యావరణ పరిరక్షణకు కేవలం 0.1 శాతం మాత్రమే కేటాయించబడింది. బొగ్గు, సిమెంట్ పరిశ్రమల ముఠాలు స్థానిక ప్రజల హక్కులను అణగదొక్కుతున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో బొగ్గు తవ్వక ప్రాజెక్టుల విషయంలో ఇలాంటి సంఘటనలు చోటుచేసుకున్నాయి. మధ్య తరగతి ప్రజల నిర్లక్ష్యం కూడా సమస్యగా మారింది. 2022లో సెంటర్ ఫర్‌సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (సీఎస్ఈ) నిర్వహించిన సర్వే ప్రకారం, భారత యువతలో 60 శాతం మంది పర్యావరణ ప్రజాస్వామ్యాన్ని అర్థం చేసుకోలేకపోతున్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు కొందరు ముందుకు వస్తున్నారు. "ఫ్రైడేస్ ఫర్ ఫ్యూచర్ ఇండియా" వంటి యువజన ఉద్యమాలు, ఐఐటీ/ఐఐఎం విద్యార్థులు పర్యావరణ చర్యలకు పునాదివేస్తున్నారు. సాంకేతిక పురోగతితో కొత్త పరిష్కారాలు లభిస్తున్నాయి. అంతర్జాతీయ పర్యావరణ సంఘం (ఐపీసీసీ) హెచ్చరిక ప్రకారం, 2డిగ్రీల సెల్సియస్ పెరుగుతాయి. దీనివల్ల 4 కోట్ల మంది ప్రజలు వలస వెళ్ళే పరిస్థితి ఏర్పడుతుంది. ప్రపంచ బ్యాంక్ నివేదిక ప్రకారం, పర్యావరణ పరిరక్షణ కోసం కనీసం స్థూల దేశీయోత్పత్తిలో (జీడీపీ) 2.5శాతం ఖర్చు చేయాలి. భారత భవిష్యత్తు పర్యావరణ, అభివృద్ధి మధ్య సమతుల్యతను ఎలా కాపాడుకుంటుందోనన్నది కీలకం. దీని కోసం నాలుగు ప్రధాన మార్గాలను అనుసరించాలి. మొదటగా, స్థానిక ప్రజల సంప్రదాయ పరిజ్ఞానాన్ని ఆధునికశాస్త్రంతో అనుసంధానం చేయాలి. రెండవది, పర్యావరణ పరిరక్షణలో పేదల హక్కులను ముఖ్యంగా పరిగణించాలి. మూడవది, పాలనలో పర్యావరణ నిపుణుల పాత్రను పెంచాలి. చివరగా, యువతను పర్యావరణ పరిరక్షణలో చురుకుగా పాల్గొనేలా చేయాలి. చిప్కో ఉద్యమం మనకు ఈ విషయాన్ని స్పష్టంగా నేర్పింది. మానవాళి ప్రకృతిపై అధిపత్యం కలిగి లేదని, మనం ఈ భూమికి అతిథులం మాత్రమేనన్న భావనతో ముందుకు సాగితేనే భారతదేశం అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ మధ్య సమతుల్యతను సాధించగలదు. •

# సభాసంప్రదాయాలు అక్కరలేదా?

## స్పీకర్ తీరుపై ఇండియా కూటమి నేతల ధ్వజం

## ఓంబిర్లాకు వినతిపత్రం ఇచ్చిన వివిధ పార్టీల నేతలు

**న్యూఢిల్లీ,మార్చి 27:** లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీని మాట్లాడేందుకు అవకాశం ఇవ్వడంలేదని కాంగ్రెస్‌ఎంపిలు అందరూ కలిసి స్పీకర్‌కు ఫిర్యాదుచేసిన వెనువెంటనే ఇండియా కూటమి నాయకులు కూడా ఓంబిర్లాను కలిసి గురువారం ఒకవినతిపత్రం అందచేసారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంటరీ విధానాలను గౌరవించక పోవడంపై వీరంతా తమ వినతి పత్రంలో విమర్శించారు. కాంగ్రెస్ డిప్యూటీ నాయకుడు గౌరవ్ గగోయ్, సమాజ్‌వాదిపార్టీ ధర్మేంద్రయాదవ్, డిఎంకె ఎ రాజా, టిఎంసి కల్యాణ్ బెనర్జీ, ఎన్సీపీ సుప్రియా సులే తదితరులున్నారు. స్పీకర్‌ను కలిసిన తర్వాత గగోయ్ మీడియాతో మాట్లాడుతూ ఇండియా కూటమి నాయకులంతా కలిసి పార్లమెంటరీ విధానాలను ఉల్లంఘిస్తోందని విమర్శించారు.

వివిధ అంశాలనుప్రస్తావించిన బ్లాక్ నేతలు సభలో రాహుల్‌గాంధీ మాట్లాడే అవకాశం ఇవ్వక పోవడాన్ని కూడా ప్రస్తావించామని చెప్పారు. సభలో ఎప్పుడు ఎల్వోపీ లేచి నిలబడినా వారికి మాట్లాడే అవకాశం లభిస్తుందని, ఈ వ్యవస్థ షక్దర్ అండ్ కౌల్ పార్లమెంటరీ కార్యాచరణలో కూడా నమోదయిందని, అయితే ప్రస్తుతం ప్రభుత్వం పదేపదే ఎల్వోపీకి మాట్లాడే అవకాశం ఇవ్వడంలేదని ఎన్నోసార్లు విజ్ఞప్తులుచేసినా అవకాశం కూడా ఇవ్వడంలేదని ఇండియా కూటమి నేతలు ఆరోపించారు. వివాదాస్పదమైన అంశాల్లో చర్చించేందుకు ప్రతిపక్షనేత స్వరం వినేందుకు స్పీకర్ సుముఖంగా లేరని వారు విమర్శించారు. ఇండియాకూటమి, ప్రభుత్వం మధ్య కీలక అంశంగా నడుస్తున్న ఈ వివాదంపై కూటమి పార్టీలన్నీ కూడా రాహుల్‌గాంధీకి మద్దతుగా నిలిచాయి. స్పీకర్ అప్రజాస్వామిక పద్ధతిలో సభను కొనసాగిస్తున్నారని, ప్రతిపక్ష నేతను మాట్లాడనీయడంలేదని ఆరోపించిన సంగతి తెలిసిందే.

జీరో అవర్‌లో పార్లమెంటు విధివిధానాలకు కట్టుబడి ఉండాలని,సభ హుందా తనాన్ని పరిరక్షించాలని స్పీకర్ రాహుల్‌ను స్వల్పంగా మందలించిన సంగతి తెలిసిందే. ఈ సభలో తండ్రి కుమార్తె, తల్లికుమార్తె, భార్య భర్త అందరూ సభ్యులుగా ఉన్నారని, ఈక్రమంలో ప్రతిపక్షనేత రూల్ 349కి అనుగుణంగా నడుచుకోవాలని స్పీకర్ రాహుల్‌కు హితవు పలికారు. రాహుల్ మాట్లాడేందుకు ప్రయత్నిస్తుండగానే స్పీకర్ వెంటనే సభను వాయిదావేయడం ఇక్కడ చర్చనీయాంశంగా మారింది. అలాగేసభలో విపక్ష సభ్యులు మాట్లాడుతున్న వేళ మైక్రోఫోన్‌లను



స్విచ్ఛాఫ్‌చేయడాన్ని కూడా కూటమి నాయకులు స్పీకర్‌వద్దప్రస్తావించారు. వారి అభిప్రాయాలు, ఆందోళనలు ఆన్‌రికార్డు వ్యక్తంచేసే వీలులేకుండా మైక్రోఫోన్లు కట్‌చేస్తున్నారన్నారు. అదే మంత్రులు, అధికార ఎంపిలు మాట్లాడుతుంటే మాత్రం వారికి అన్ని అనుమతులు ఇస్తున్నారని, ఏకపక్షంగా సభను నిర్వహించడం సభాసాంప్రదాయం కాదంటూ ఆరోపించారు. గడచిన ఆరేళ్లుగా లోక్‌సభకు డిప్యూటీ స్పీకర్‌ను నియమించకపోవడంపై స్పీకర్‌ను నిలదీసారు. 2019నుంచి డిప్యూటీ స్పీకర్‌పదవి ఖాళీగానే ఉందని, ఇది ఎంతమాత్రం సముచితం కాదని వారు గుర్తుచేసారు. సభ తటస్థ వైఖరితో కొనసాగేందుకు డిప్యూటీ స్పీకర్ పాత్ర ఎంతో కీలకం అవుతుందని ప్రభుత్వం ఇప్పటికీ ఎన్నిక నిర్వహించడంలో విఫలం అయిందన్నారు.

అలాగే బిజినెస్ అడ్వయిజరీ కమిటీలో తీసుకున్న నిర్ణయాలు కూడా అమలుకురాక పోవడం పైనా స్పీకర్‌వద్ద ప్రస్తావించారు. సభలోప్రధాని ప్రకటన అంశం ముందుగా బిఎసిలో చేర్చిన అంశంకాదని గుర్తుచేసారు. ప్రస్తుత ప్రభుత్వంలో ఏకపక్షంగా సభా కార్యకలాపాలు జరుగుతున్నాయని, ఎలాంటి ముందస్తు సంప్రదింపులు కానీ, సమాచారం కానీ ఉండటంలేదన్నారు. గతవారంలో జరిగిన సభలోప్రధాని ప్రకటన ఇందుకు నిదర్శనం అని గగోయ్ చెప్పారు.

వాయిదా తీర్మానాలను విస్మరిస్తున్నారని, తిరసనకరిస్తున్నారని, ప్రైవేటు సభ్యుల బిల్లులు తీర్మానాలను కూడా తిరస్కరిస్తుండటాన్ని సభా మర్యాదగా భావించలేమని ఇండియా కూటమి సభ్యులు చెప్పారు. వాయిదా తీర్మానం ప్రవేశ పెట్టినపుడు స్పీకర్ ఎంపిల పేర్లు ప్రస్తావించి వారిని జాతీయ ప్రాధాన్యత కలిగిన అంశాలపై మాట్లాడేందుకు జీరో అవర్‌లో అనుమతిస్తారని, అందుకువిరుద్ధంగా ఇపుడు పూర్తిగా తిరస్కరించారన్నారు. ప్రైవేటు బిల్లుల్లో కూడా చర్చకు అనుమతించడంలేదని తరాలుగా వస్తున్న సాంప్రదాయాన్ని ప్రస్తుత సభ విస్మరించిందని అన్నారు. బడ్జెట్, గ్రాంట్లడిమాండ్‌పై చర్చల్లో కీలక మంత్రిత్వశాఖలను కూడా నిలిపివేస్తోందని ఆరోపించారు. 193వ నిబంధన ప్రకారం అత్యవసర ప్రజాప్రాధాన్యం కలిగిన అంశాలను ఎలాంటి ఓటింగ్‌లేకుండా చర్చకు అనుమతించాల్సి ఉండగా అలా కూడా జరగడంలేదన్నారు.



## భారత్‌లో పర్యటనకు

# పుతిన్ అంగీకారం!

## రష్యా విదేశాంగమంత్రి సెర్గీ లావ్రోవ్ వెల్లడి

**మాస్కో, మార్చి 27:** రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ త్వరలో భారత్‌లో పర్యటించనున్నారు. భారత్ పర్యటనకు రావాల్సిందిగా ప్రధాని నరేంద్రమోడీ చేసిన ఆహ్వానాన్ని తమ దేశాధినేత పుతిన్ అంగీకరించినట్లు రష్యా విదేశాంగశాఖ మంత్రి సెర్గీ లావ్రోవ్ వెల్లడించారు. 'రష్యా అండ్ ఇండియా: టువార్డ్ ఏ బైలాటరల్ అజెండా' పేరుతో రష్యన్ ఇంటర్నేషనల్ అఫైర్స్ కౌన్సిల్ (ఆర్ఐఎసి) నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో లావ్రోవ్ మాట్లాడుతూ.. ఈ పర్యటన కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయని అన్నారు. భారత ప్రధానిగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన ప్రధాని మోడీ.. తొలి అంతర్జాతీయ పర్యటన రష్యాలో చేసిన విషయాన్ని లావ్రోవ్ గుర్తు చేశారు. ఇప్పుడు తమ వంతు వచ్చిందన్నారు. అయితే, పర్యటన తేదీలను మాత్రం ఆయన వెల్లడించలేదు.

ఇదిలా ఉంటే, ప్రధాని మోడీ గతేడాది జూలైలో రష్యాలో పర్యటించారు. ఐదేళ్ల వ్యవధి తర్వాత అక్కడ పర్యటించడం అదే తొలిసారి. అంతకు ముందు 2019లో రష్యాలోని వ్లాదివోస్టోక్ నగరంలో నిర్వహించిన ఆర్థిక సదస్సులో మోడీ పాల్గొన్న సంగతి తెలిసిందే.

ఇటీవల రష్యా పర్యటన సందర్భంగా భారత్‌కు రావాలని పుతిన్‌ను మోడీ ఆహ్వానించారు. అమెరికా నుంచి టారిఫ్‌ల ముప్పు, ఉక్రెయిన్-రష్యా యుద్ధం ముగింపునకు సంప్రదింపులు జరుగుతోన్న సమయంలో పుతిన్ భారత్‌లో పర్యటించనుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.



## ఎర్రసముద్రంలో మునిగిన

# జలాంతర్గామి

### ఆరుగురు మృతి, మరో తొమ్మిది మందికి గాయాలు!

**కైరో, మార్చి 27:** ఈజిప్టు తీర నగరమైన హుర్ఘడలో ఎర్ర సముద్రంలో పర్యాటకుల జలాంతర్గామి మునిగిపోయింది. ప్రమాద సమయంలో సబ్‌మెరైన్‌లో దాదాపు 40 మంది ఉండగా వీరిలో ఆరుగురు మృతి చెందినట్లు తెలిసింది. మరో తొమ్మిది మందికి గాయాలు కాగా వారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. నౌకాశ్రయం సమీపంలోనే ఈ ఘటన చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. హుర్ఘడ నగరం పర్యాటకానికి ఎంతో ప్రసిద్ధి. ఇక్కడి బీచ్‌లు, పగడపు దిబ్బలు పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తుంటాయి. దీంతో పర్యాటక జలాంతర్గాములు ఇక్కడ సేవలందిస్తుంటాయి. ఇందులో సింద్‌బాద్ అనే టూరిస్ట్ సబ్‌మెరైన్ కూడా ఒకటి. సముద్రంలో 25 మీటర్ల లోతువరకు పర్యాటకులను అనుమతిస్తుంటారు. తాజా ప్రమాదంపై సదరు సంస్థ స్పందిస్తూ ప్రపంచవ్యాప్తంగా ఇటువంటి జలాంతర్గాములు 14 మాత్రమే ఉన్నాయని, వాటిలో రెండు తమవేనని పేర్కొంది.

## పాక్ జైల్లో

## భారత్ మత్స్యకారుడి

# ఆత్మహత్య!

**ఇస్లామాబాద్, మార్చి 27:** కారాగారంలో మగ్గిపోతున్న భారత్‌కు చెందిన ఓ మత్స్యకారుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాత్‌రూమ్‌లో ఉరివేసుకుని ప్రాణాలు తీసుకున్నాడు. జైలు సూపరింటెండెంట్ ఈ విషయాన్ని వెల్లడించినట్లు సమాచారం. భారత్, పాకిస్తాన్ జలసరిహద్దులపై సరిగా అవగాహన లేకుండా చేపల వేటకు వెళ్లి అక్కడి అధికారులకు చిక్కినవారు ఎంతో మంది ఉన్నారు. అదేవిధంగా భారత్‌కు చెందిన మత్స్యకారుడు గౌరవ్‌రామ్ ఆనంద్‌ను (52) 2022లో అదుపులోకి తీసుకున్నారు.

అతడిని అరెస్టు చేసి కరాచీ జైల్లో ఉంచారు. నాటి నుంచి అతడు అక్కడి కారాగారంలోనే మగ్గిపోతున్నాడు. అయితే బాత్‌రూమ్‌లోకి వెళ్లిన మత్స్యకారుడు తాడుతో బలవన్మరణానికి పాల్పడ్డాడు. అతడు ఎంతసేపటికి బయటికి రాకపోవడంతో అనుమానించిన జైలు అధికారి లోపలికి వెళ్లి చూడగా అప్పటికే అతడు ప్రాణాలో కోల్పోయాడు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. చట్టపరమైన ప్రక్రియ పూర్తి చేసేంతవరకు మృతదేహాన్ని కోల్డ్ స్టోరేజ్‌లో ఉంచనున్నట్లు పాక్ అధికారులు తెలిపారు.

కాగా గత నెలలో తమ కారాగారంలో ఉన్న 22మంది మత్స్యకారులను పాక్ ప్రభుత్వం విడుదల చేసిన సంగతి తెలిసిందే. వారి శిక్షాకాలం పూర్తికావడంతో కరాచీలోని మాలిర్ కారాగారంనుంచి విడుదల చేసింది. మత్స్యకారులు సరిహద్దులను సరిగా గుర్తించకపోవడంతో ఇరువైపులా ఈ అరెస్టులు జరుగుతున్నాయి.

ఇదిలా ఉంటే జనవరి 1న ఇరుదేశాల ఖైదీల జాబితా మార్పిడి జరిగింది. పాకిస్థాన్‌లో 266 మంది భారత ఖైదీలున్నారు. భారత జైళ్లలో మొత్తం 462 మంది పాకిస్థానీయులు ఉన్నట్లు మనదేశ జాబితా పేర్కొంది.

# మొబైల్‌ఫోన్లలోనే అగ్రనేతల దౌత్యం!



**పారిస్, మార్చి 27:** ప్రపంచనాయకులమధ్య మొబైల్‌ఫోన్లు కొత్త దౌత్యమార్గాలకు ద్వారాలు తెరుస్తున్నాయి. నేరుగా సంభాషణలకు ఆకస్మిక కాల్స్‌కు వేగంగా చర్చలు జరిపేందుకు ఇవి ఉపయోగపడుతున్నాయని మేక్రాన్ సహాయకులు ఒకరు తెలిపారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు సుమారు ప్రతిరోజు ఒక్కసారైనా జెలెన్‌స్కీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో సంభాషిస్తున్నట్లు చెప్పారు. బ్రిటన్ ప్రధాని స్టార్మర్‌పరిస్థితి కూడా ఇలాగే ఉంది. మొబైల్‌ఫోన్ దౌత్యంతో భౌగోళిక రాజకీయాలో సాంప్రదాయ రాయబారులపని తగ్గిపోయింది. ట్రంప్ శ్వేతసౌధంలో అడుగుపెట్టాక నేతలమధ్య మొబైల్‌ఫోన్ సంభాషణలు పెరిగిపోయాయి. టెలిఫోన్‌లో నాయకులు మాట్లాడాలంటే ముందు వారి సహాయకులు చాలాముందుగానే ఏర్పాట్లు చేసేవారు. ఇపుడు అవి తగ్గిపోయాయి. రోజుకు ఒకసారైనా ట్రంప్ తనతో మాట్లాడతారని ఇటీవలే ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ తెలిపారు. కొన్ని సందర్భాల్లో తాను మీటింగ్‌ల్లో ఉన్నా వాటిని త్వరగా ముగించి తనతో మాట్లాడాలని ఒత్తిడిచేస్తారని కూడా ఆయన చెప్పారు. వాస్తవానికి నాయకులు మొబైల్‌లలో మాట్లాడుకోవడం కొత్తేమీ కాదు. కానీ ట్రంప్ నేరుగా ఆవలి నేతతో మాట్లాడటానికి ష్టపడతారు. గతంలో బైడెన్ మాత్రం సాంప్రదాయ టెలిఫోన్ కాల్స్‌కే ప్రాధాన్యం ఇచ్చేవారు. యుద్ధం ప్రారంభ సమయంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కూడా వేగంగా నాయకులతో మాట్లాడేందుకు ఇదే విధానం వాడేవారు.

దేశాధినేతలు మొబైల్స్‌లో నేరుగా సంభాషించుకని ఆ వివరాలను సహాయకులకు చెప్పకపోతే చర్చల్లో వచ్చిన అంశాలు మరుగునపడిపోవడమే నిర్లక్ష్యానికి గురవడమో జరుగుతుందని దౌత్యరంగ నిపుణులు పేర్కొంటున్నారు. కొన్నాళ్లక్రితం ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ మీడియా మీట్‌లో మాట్లాడుతుంటే ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్‌నుంచి కాల్‌వచ్చింది. కొద్దిసేపు పక్కకువెళ్లిమాట్లాడి ఓపావుగంట తర్వాత చేస్తానని తిరిగి మీడియామీట్‌లో పాల్గొన్నారు. తాను రోజుకు ఒక్కసారైనా మేక్రాన్‌తో మాట్లాడతానని ఉక్రెయిన్ అధ్యక్షుడుజెలెన్‌స్కీ చెప్పారు. దీన్నిబట్టిచూస్తే అగ్రనేతలమధ్య మొబైల్ సంభాషణలతో దౌత్యబంధంమరింత పటిష్టం అవుతున్నదని నేరుగాసంభాషించేందుకు మరింతగా దోహదంచేస్తోందని దేశాధినేతలు పేర్కొంటున్నారు.

## ఇయు, కెనడా చేతులు కలిపితే

# మరింత భారీగా సుంకాలు

## హెచ్చరించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్

**వాషింగ్టన్, మార్చి 27:** తమ దేశ ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీయడానికి ఐరోపా సమాఖ్య, కెనడా చేతులు కలిపితే మరింత భారీగా టారిఫ్‌లను విధిస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ప్రస్తుతం ప్రకటించిన మొత్తం కంటే చాలా ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. అమెరికా దిగుమతి చేసుకొనే ఆటోమొబైల్స్‌పై 25 శాతం సుంకాన్ని ఆయన ప్రకటించిన విషయం తెలిసిందే. ఇక ట్రంప్ నిర్ణయంపై ఐరోపా సమాఖ్య అధ్యక్షురాలు ఉర్సులా వాన్‌డెర్ లెయెన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. 'ఈ నిర్ణయం వ్యాపారాలకు ఏమాత్రం మంచిదికాదు.. వినియోగదారుల కోణంలో దారుణమైంది' అని విమర్శించారు. మరోవైపు కెనడా ప్రధాని మార్క్ కార్నీ కూడా ట్రంప్ నిర్ణయాన్ని తప్పుపట్టారు. కెనడా కార్మికులపై ప్రత్యక్షదాడిగా పేర్కొన్నారు. దీనికి సంబంధించి ప్రతీకరా చర్యలను తాము పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు.

మరోవైపు ఐరోపా సమాఖ్య తన ప్రతిఘటన నిర్ణయాలను ఏప్రిల్ మధ్య వరకు వాయిదా వేసింది. వీటిల్లో అమెరికా బర్బన్‌పై 50 శాతం సుంకాల విధింపు కూడా ఉంది. ఈ నిర్ణయం అమలుచేస్తే.. తాము ఐరోపా వైన్లు, ఆల్కహాల్‌పై 200 శాతం పన్ను విధిస్తామని ట్రంప్ హెచ్చరించారు. ఏప్రిల్ 3వ తేదీ నుంచి ఆటోమొబైల్స్ దిగుమతులపై అదనపు సుంకాల నిర్ణయం అమల్లోకి రానుంది. దీంతో అమెరికాలోకి దిగుమతి అయ్యే కార్లు, తేలికపాటి ట్రక్కుల ధరలు పెరగనున్నాయి.

## 2వేల వీసా అపాయింట్‌మెంట్లు

# రద్దుచేసిన అమెరికా!



**న్యూఢిల్లీ, మార్చి 27:** భారత్‌లోని అమెరికా దౌత్యకార్యాలయం రెండువేల వీసా అపాయింట్‌మెంట్లను రద్దుచేస్తున్నట్లు ప్రకటించింది. మోసపూరిత కార్యకలాపాలతో సంబంధం ఉండటంతో ఈనిర్ణయం తీసుకున్నట్లు చెప్పింది. అపాయింట్‌మెంట్ వ్యవస్థలో ఒక భారీ లోపాన్ని గుర్తించామని దౌత్యకార్యాలయం ప్రకటించింది. ఇవిమొత్తం బాట్స్‌ద్వారా వచ్చినట్లు గుర్తించామని వివరించింది.ఎక్స్ పోస్టులో దౌత్యకార్యాలయం ఇతర వివరాలను కూడా వెల్లడించింది. బాట్స్‌చేసిన 2వేల వీసా అపాయింట్‌మెంట్‌లు భారత్‌లో కాన్సులర్ బృందం రద్దుచేస్తోంది. మా షెడ్యూలింగ్ విధానాలు ప్రభావితంచేసే ఏజెంట్స్, ఫిక్సర్లను ఎంతమాత్రం సహించబోమని ఈ అపాయింట్‌మెంట్లను రద్దుచేయడంతోపాటు అనుబంధ ఖాతాలకు షెడ్యూలింగ్ అధికారాలను కూడా సస్పెండ్ చేస్తున్నట్లు వెల్లడించింది. మోసాల నిర్మూలనకు మా ప్రయత్నాలు నిరంతరం కొనసాగుతాయని వాటిని ఎంతమాత్రం అనుమతించబోమని అన్నారు. అమెరికా బిజినెస్, విజిటర్స్, బి1, బీ2 స్టూడెంట్ వీసాలకు అపాయింట్‌మెంట్లకోసం సుదీర్ఘ సమయం వెయిటింగ్ ఉంటుందన్న విషయం తెలిసిందే. ఏజెంట్లకు డబ్బులు చెల్లిస్తేమాత్రం కేవలం నెలరోజుల్లోనే అపాయింట్‌మెంట్లు లభించడం పర్యాటకరంగంలో సర్వసాధారణం. ఇందుకోసం ఒక్కోవీసా దరఖాస్తుదారుడినుంచి 30 వేలనుంచి 35వేలవరకూ ఏజెంట్లు వసూలుచేస్తారు. తమ కుమారుడు అమెరికా యూనివర్సిటీలోచేరేందుకు సొంతంగా అపాయింట్‌మెంట్ ప్రయత్నిస్తే సాధ్యంకాలేదని, అదే ఏజెంట్‌కు 30వేలు చెల్లిస్తే వెంటనే వచ్చిందని ఒక వ్యక్తి చెప్పడం లోపాలను స్పష్టంచేస్తోంది. దరఖాస్తుదారుడు సొంతంగా అప్లికేషన్ పంపిస్తే సమీపకాలంలో అపాయింట్‌మెంట్ తేదీలు ఉండవు. కానీ ఏజెంట్లుకొన్ని రకాల ప్రత్యేకమైన బాట్స్‌ను వినియోగించి స్లాట్లను బ్లాక్‌చేస్తారు. 2023లో బీ1, బీ2 అపాయింట్‌మెంట్ల 999 రోజుల మార్పును చూపించింది. దీనితో భారతీయ దరఖాస్తుదారులకోసం ఫ్రాంక్‌ఫర్ట్, బ్యాంకాక్ ఇతరప్రదేశాల్లో అమెరికా అపాయింట్‌మెంట్లను తెరిచింది. మూడేళ్లక్రితంవరకూ వీసా వెయిటింగ్ సమయం చాలా ఎక్కువగా ఉందని భారత ప్రభుత్వం అమెరికా దృష్టికి తీసుకెళ్లింది. దీనిపై సీరియస్‌చర్యలు తీసుకన్న అమెరికా ప్రభుత్వం గణనీయంగా వెయిటింగ్ పీరియడ్‌ను తగ్గించింది. ఇపుడు బాట్స్ వినియోగాన్ని అడ్డుకోవడంపై దృష్టిపెట్టింది.

## ఉక్రెయిన్‌పై యుద్ధానికి మరో

# 3 వేల మంది ఉత్తరకొరియా సైనికులు

**క్యీవ్, మార్చి 27:** రష్యా తరపున ఉక్రెయిన్‌పై యుద్ధం చేయడానికి ఉత్తరకొరియానుంచి మరోమూడువేల మంది సైనికులను పంపించినట్లు దక్షిణకొరియా సైనిక విభాగం గురువారం వెల్లడించింది. ఉత్తరకొరియా అధినేత కిమ్‌జోంగ్ ఉన్ తమ దేశంలో పర్యటించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు రష్యా విదేశాంగశాఖ సహాయ మంత్రి ఆండ్రీ రూడెంకో తెలిపారు. ఇప్పటికే రష్యా తరపున పోరాడేందుకు 11 వేలమందిని కిమ్ ప్రభుత్వం పంపించింది. వీరిలో నాలుగువేల మందికిపైగా మరణించడమో గాయపడటమో జరిగిందని దక్షిణకొరియా జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ వెల్లడించారు. కేవలం సైన్యమే కాదు పెద్ద మొత్తంలో షార్ట్‌రేంజ్ బాలిస్టిక్ క్షిపణులను కూడా రష్యాకు తరలించింది. దీనితోపాటు 220కిపైగా 170 ఎంఎం, 240 ఎంఎం శతఘ్నులను కూడా మాస్కోకు పంపించిందని ఆయన తెలిపారు. అదేసమయంలో రష్యా అత్యాధునిక స్పేస్, ఉపగ్రహ సాంకేతికతను ఉత్తరకొరియాతో పంచుకుంటున్నదని అమెరికా వర్గాలు ఇప్పటికే తెలిపాయి. ప్యాంగ్‌యాంగ్‌సేనలకు ఆయుధ వినియోగం శిక్షణ కూడా మాస్కో అందచేస్తోంది. ఉత్తరకొరియా అధినేత కిమ్‌జోంగ్‌ఉన్ సమక్షంలో నేడు ఆత్మాహుతిడ్రోన్లను పరీక్షించారు. కృత్రిమ మేధతో ఇవి పనిచేస్తాయని పేర్కొన్నాయి. తమ సేనల డ్రోన్ల సామర్థ్యాన్ని కిమ్ తనిఖీచేసినట్లు వెల్లడించాయి.ఈ సందర్భంగా మానవ రహిత విమానాలు నిర్దేశిత లక్ష్యాలను ఛేదించాయి.

తమ దేశ అత్యాధునిక డ్రోన్లు శత్రువులపై నిఘా వేయడంతోపాటు భూమి సముద్రంపై దాడులు చేయగలవని కెసిఎన్ఎ సంస్థ ప్రకటించింది. ఇప్పటికే ఉత్తరకొరియా ఎయిర్‌బార్న్ ఎర్లీ వార్నింగ్ ఎయిర్‌క్రాఫ్ట్‌ను కూడా తయారు చేసింది. ఇది ఆదేశరక్షణ సామర్థ్యం గణనీయంగా పెంచింది. రష్యాకు చెందిన ఐఎల్ 76 విమానాన్నే ఎర్లీవార్నింగ్ వ్యవస్థ అమర్చేందుకు వాడినట్లు నిపుణులు చెపుతున్నారు.

# మనిషికి పంది కాలేయం.. చైనా డాక్టర్ల ఘనత!



**బీజింగ్, మార్చి 27:** వైద్య రంగంలో మరో అరుదైన ప్రయోగం. బ్రెయిన్ డెడ్ అయిన మనిషి శరీరంలో పంది కాలేయాన్ని అమర్చారు. ఈ మేరకు చైనా వైద్యులు ప్రకటించారు. భవిష్యత్తులో రోగుల ప్రాణాలు కాపాడేందుకు ఈ ప్రయత్నం దోహదపడుతుందని భావిస్తున్నట్లు తెలిపారు. మానవ శరీరంలోకి సరిపోయేలా జన్యు సవరణలు చేసిన ఓ పంది కాలేయాన్ని వైద్యులు సేకరించారు. బ్రెయిన్ డెడ్ అయిన మానవ శరీరంలోకి దాన్ని మార్పిడి చేశారు. గతంలోనూ అమెరికా వైద్యులు పంది మూత్రపిండాలు, గుండెను విజయవంతంగా అమర్చారు. అయితే.. ప్రపంచవ్యాప్తంగా కాలేయ దాతలకు భారీగా డిమాండ్ పెరుగుతోంది. ఈ పరిణామాల దృష్ట్యా వైద్యులు మానవులకు ఈ సమస్య నుంచి ఉపశమనం కల్పించేందుకు పరిశోధనలు చేస్తున్నారు.

'జన్యు సవరణలు చేసిన పందుల అవయవాలను.. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న రోగులకు తాత్కాలిక ఉపశమనాన్ని కల్పించే అవకాశం ఉంటుంది. మళ్లీ మానవ కాలేయ దాత దొరికేంతవరకు ఆ రోగికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉపయోగపడుతుంది. 10 రోజులపాటు ఆ వ్యక్తి వైద్యుల పర్యవేక్షణలో ఉంటారు. పంది కాలేయం పనితీరు.. మానవ శరీరం ప్రతిస్పందనను మా వైద్య బృందం పరిశీలిస్తుంది. ఇప్పటివరకు కాలేయం పనితీరు సక్రమంగా జరుగుతోంది' అని చైనాలోని జియాన్‌లో నాల్గో మిలిటరీ మెడికల్ యూనివర్సిటీ వైద్యులు తాజా ప్రకటనలో పేర్కొన్నారు. కాలేయ సంబంధ వ్యాధులతో బాధపడేవారికి ఈ ప్రయోగం ఎంతో మేలు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో ఓ వ్యక్తికి అమెరికా వైద్యులు పంది గుండెను విజయవంతంగా అమర్చారు. సర్జరీ తర్వాత అతడు 40 రోజుల వరకు బాగానే ఉన్నాడు. తర్వాత ఆ గుండె వైఫల్యం చెందడంతో మృతి చెందాడు. ఈ విషయాన్ని యూనివర్సిటీ ఆఫ్ మేరీల్యాండ్ స్కూల్ ఆఫ్ మెడిసిన్ అధికారికంగా ప్రకటించింది. తాజాగా చైనా వైద్యులు చేసిన ఈ ప్రయత్నాలు ఎంతవరకు ఫలిస్తాయనే అంశం ఆసక్తికరంగా మారింది.

## కన్నడ నటి రన్యారావు బెయిల్ పిటిషన్ నిరాకరణ

### ఈ కేసులో మరో వ్యక్తిని అరెస్టు చేసిన అధికారులు!

**బెంగళూరు, మార్చి 27:** బంగారం స్మగ్లింగ్ కేసులో అరెస్టయిన కన్నడ నటి రన్యారావు బెయిల్ పిటిషన్‌పై బెంగళూరులోని సెషన్స్ కోర్టు విచారణ చేపట్టింది. ఆమెకు బెయిల్ మంజూరుచేసేందుకు న్యాయస్థానం నిరాకరించింది. ప్రస్తుతం తమ కస్టడీలో ఉన్న రన్యారావును అధికారులు విచారిస్తున్నారు. అయితేబెయిల్ కోసం ఆమె హైకోర్టును ఆశ్రయించే అవకాశం ఉన్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.



రన్యారావు కేసులో మరో వ్యక్తిని అధికారులు తాజాగా అరెస్టు చేశారు. రన్యారావు కేసులో మరో వ్యక్తిని అధికారులు తాజాగా అరెస్టు చేశారు. సాహిల్ జైన్ అనే వ్యక్తి గోల్డ్ డీలర్‌గా వ్యవహరించాడు. నటి అక్రమంగా బంగారాన్ని రవాణా చేసేందుకు ఇతడు సహకరించాడు. అంతేకాకుండా గతంలోనూ రెండుసార్లు ఆమెకు సహాయం చేశాడని డిఆర్ఐ అధికారుల దర్యాప్తులోతేలింది. అందుకు సంబంధించిన ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు. కాగా దుబాయ్ నుంచి అక్రమంగా 14కేజీలకు పైగా బంగారం తరలిస్తుండగా ఎయిర్‌పోర్టులో రన్యారావును అధికారులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో మరో నిందితుడు తరుణ్ రాజ్‌కు ఆమె ఆర్థిక సహాయం చేసినట్లు డిఆర్ఐ విచారణలో తేలింది. ఆమె పంపిన డబ్బుతోనే నిందితుడు దుబాయ్ నుంచి హైదరాబాద్ వెళ్లాడని కోర్టుకు తెలిపారు. అంతేకాకుండా బ్యాంకాక్, జెనీవాలకు బంగారాన్ని అక్రమంగా రవాణా చేసేవారని పేర్కొంది. తరుణ్ రాజ్‌దుబాయ్ వెళ్లినరోజే తిరిగి వచ్చే వాడని ఆరోపించింది. తరుణ్‌రాజ్, రన్యారావు స్నేహితులని, వీరిద్దరూ2023లో దుబాయ్‌లో విరా డైమండ్స్ ట్రేడింగ్ ఎల్ఎల్‌సి అనే ట్రేడింగ్ కంపెనీని స్థాపించారని, నాటి నుంచి వ్యాపార భాగస్వాములుగా కొనసాగుతూ దీనిని నిర్వహిస్తున్నారని తెలిపింది. ఇప్పటివరకు ఈకేసులో ముగ్గురిని అధికారులు అరెస్టుచేశారు. తరుణ్ రాజ్‌ను ఎ2గా మరో వ్యాపారి అయిన సాహిల్ జైన్ ఏ3గా కస్టడీలోకి తీసుకున్నారు. బంగారాన్ని కొనుగోలు చేసేందుకు ఆమె హవాలా మార్గాల ద్వారా నగదు బదిలీ చేసినట్లు రన్యా రావు అంగీకరించారని ఇటీవల న్యాయస్థానంలో డిఆర్ఐ తెలిపింది. ఈ క్రమంలోనే మరోసారి విచారణ జరిపిన న్యాయస్థానం ఆమె బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించింది.

# వివిధ కారణాలతో ఖాళీ అయిన స్థానిక సంస్థల స్థానాలకు ఎన్నికలు

విజయవాడ, మార్చి27, ప్రభాతవార్త ప్రతినిధి: ఏపీలో వివిధ కారణాలతో ఖాళీ అయిన స్థానిక సంస్థల స్థానాలకు గురువారం ఎన్నికలు జరిగాయి, ఇందు కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంపీపీలు, సర్పంచ్, ఉప సర్పంచ్ ఎన్నికలు పలు ప్రాంతాల్లో ఉత్రికత ఉద్రిక్తత ఎర్పడినా పోలీసులు పరిస్థితులను అదుపుచేసారు. 28 ఎంపీపీలు 23 వైస్ ఎంపీపీ స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. ప్రధానంగా కూటమి వైకాంగ్రెస్‌పార్టీ మధ్య పోటీ నెలకొంది. ఉమ్మడి కడప జడ్పీచైర్మెన్ గా వైకాంగ్రెస్‌పార్టీకి చెందిన రామగోవింద రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు జిల్లా కలెక్టర్ శ్రీధర్ ప్రకటించారు. ఒకే నామినేషన్ రావడంతో ఎన్నికైనట్లు కలెక్టర్ వెల్లడించారు. కడప పరిషత్ ఛైర్మన్ పదవికి తాము పోటీ చేయడం లేదని టీడీపీ కూటమి ప్రకటించింది. దీంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో జడ్పీ చైర్మన్‌గా రామ గోవిందరెడ్డి చేత కలెక్టర్ ప్రమాణస్వీకారం చేయించారు. పశ్చిమగోదావరి అత్తిలిలో ఎంపీపీ ఎన్నిక సందర్భంగా ఉద్రిక్తత నెలకొంది. టీడీపీ కూటమి, వైకాంగ్రెస్ పార్టీ నేతల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసులు రంగ ప్రవేశం చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. వైసీపీకి చెందినవారు కారుమూరి నివాసం నుండి ఎంపీటీసీలతో వెళుతుండగా అక్కడ వారిని టీడీపీ కూటమి నేతలు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగి ఉద్రిక్తతకు దారితీసింది. కాగా మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికకు అధికారులు ఏర్పాట్లు చేశారు. చిత్తూరు జిల్లా: కుప్పం నియోజకవర్గం రామకుప్పం మండలం ఎంపీపీ ఎన్నికలో ఉత్కంఠత నెలకొంది. గతంలో ఎంపీపీగా ఉన్న శాంతకుమారి మరణంతో ఇక్కడ ఎంపీపీ ఎన్నిక జరుగుతోంది 2021లో జరిగిన స్థానిక సంస్థల ఎంపీటీసీ ఎన్నికల్లో అప్పటి వైసీపీ ప్రభుత్వం అనుసరించిన విధానాలతో ఒక్క ఎంపీటీసీ కూడా టీడీపీకి దక్కలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైకాంగ్రెస్‌పార్టీకి సంబంధించిన కొంతమంది ఎంపీటీసీలు టీడీపీలో చేరారు. ఇప్పుడు ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ఎవరు ఎంపీపీగా ఎన్నిక అవుతారన్న ఉత్కంఠత కలిగిం,ఇంది.. ఎన్టీఆర్ జిల్లా నందిగామ ఎంపీపీ స్థానం మళ్ళీ వైకాంగ్రెస్‌కే దక్కింది. ఇక్కడ టీడీపీ పోటీ చేయలేదు. కైకలూరు వైస్ ఎంపీపీ ఎన్నిక జరుగుతోంది. ప్రధానంగా టీడీపీ కూటమి, వైసిపి మధ్య పోటీ నెలకొంది. మొత్తం 22 మంది ఎంపీటీసీలకు ఒకరు మరణించగా, మరొకరు రాజీనామా చేయగా 20 మంది మధ్య పోటా పోటీ నెలకొంది. కూటమికి పది వైసీపీకి పది మంది ఉండటంతో పోటీ ఉత్కంఠతగా మారింది. ఎన్నిక జరిగే ప్రాంతంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు 144 సెక్షన్ అమలు చేశారు. సబ్బవరం మండలం, నారపాడులో వైస్ ఎంపీపీ ఎన్నిక జరుగుతోంది.

# సిసి కెమెరాలు, డ్రోన్‌లతో నేరస్తుల భరతం పడతాం : మంత్రి అనిత

## - జగ్గయ్యపేట సర్కిల్‌లో 509 సిసి కెమెరాల ఏర్పాటు



ఫోక్స్ యాక్టుకు సంబంధించిన స్టాటిస్టిక్స్ యాప్ షేప్ పుస్తకాలను సభలో ఆవిష్కరిస్తున్న రాష్ట్ర హోం మంత్రి అనిత, రాష్ట్ర డిజిపి

జగ్గయ్యపేట, మార్చి 27, ప్రభాతవార్త : ఆంధ్ర రాష్ట్రలోని అన్ని ప్రాంతాల్లో క్లోజ్డ్ సర్క్యూట్ కెమేరాలు (సిసి కెమేరాలు), డ్రోన్ కెమేరాలను ఏర్పాటుతో డ్రోన్ కెమేరాలతో నేరస్తుల భరతంపడతాం మంటూ రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అసాంఘిక శక్తులకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణ శివారులోని బి కన్వెన్షన్ హాలులో గురువారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 509 సిసి కెమేరాల పైలెట్ ప్రాజెక్టును మంత్రి అనిత రాష్ట్ర డిజిపి హరీష్‌కుమార్, స్థానిక ఎంఎల్ఏ శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), ప్రభుత్వవిప్-నందిగామ ఎంఎల్ఏ తంగిరాల సౌమ్య, మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, సిటి కమిషనర్ రాజశేఖరబాబులతో కలిసి ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో హోం మంత్రి అనిత ప్రసంగించారు. సిసి కెమేరాల ఏర్పాటు ద్వారా ప్రతి గ్రామంలో ప్రజలకు రక్షణ కల్పిస్తామన్నారు. జగ్గయ్యపేటలో 509 కెమేరాలను ఏర్పాటు చేయటం గొప్ప విషయమంటూ స్థానిక ఎంఎల్ఏ రాజగోపాల్‌ను అభినందించారు. అదే స్ఫూర్తితో తన నియోజకవర్గం పాయకరావుపేటలో కూడా సిసి కెమేరాలను విస్తరింపజేయనున్నట్లు ప్రకటించారు. ఇప్పటి వరకు వెయ్యి సిసి కెమేరాలు, 28 డ్రోన్‌లను ఏర్పాటుచేశామన్నారు. ప్రతి ఇంటిలో ఫ్రిజ్, ఏసిలతోపాటు సిసి కెమేరా ఉండాలన్నారు. సిసి కెమేరాలు, డ్రోన్ల ప్రయోగంతో నేరస్థులు చెల్లాచెదురవుతున్నారన్నారు. విజయనగరంలోని ఒక లారీ ట్యాంక్ లోపల కూర్చొని పేకాట ఆడుతున్న విషయం డ్రోన్ కెమేరా పసిగట్టటంతో జూదరులు పోలీసులకు దొరికిపోయారన్నారు. నేర నియంత్రణలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని, ప్రతి ఇల్లు, దుకాణంలలో కూడా సిసి కెమేరాలను ఏర్పాటుచేసుకోవటం ద్వారా నేరాల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుందన్నారు. గత ప్రభుత్వ నిర్వాకం కారణంగా పోలీసు వ్యవస్థ నిర్వీర్యమైందని విచారం వ్యక్తపర్చారు. రాష్ట్రంలో మద్యం, డ్రగ్స్, గంజాయి, పేకాట వంటి అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. ప్రతి ఒక్కరూ బైక్ నడిపే సందర్భాల్లో తప్పకుండా హెల్మెట్ ధరించాలని, సెల్‌ఫోన్‌ను జాగ్రత్తపర్చుకున్నట్లు, జీవితాన్ని కాపాడుకునేందుకు హెల్మెట్ వాడాలన్నారు. పోలీసులు పట్టుకున్న సందర్భాలో ఎంఎల్ఏలు పైరవీలు చేయవద్దని కోరుతూ వేదికపై ఉన్న స్థానిక ఎంఎల్ఏ రాజగోపాల్‌ను కూడా పైరవీ చేయవద్దని సూచించారు. ఫోక్స్ యాక్టుకు సంబంధించిన స్టాటిస్టిక్స్ యాప్ షేప్ పుస్తకాలను సభలో ఆవిష్కరించారు. నేర నియంత్రణలో సిసి కెమేరాల పాత్ర కీలకమైందని స్థానిక ఎంఎల్ఏ రాజగోపాల్ అన్నారు. నేర నియంత్రణలో ప్రజలు సహకరించాలని కోరారు. మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర మాట్లాడుతూ పోలీస్ క్వార్టర్స్ శిథిలావస్థలో ఉన్నాయని, వాటిని పునర్నిర్మించాలని మంత్రిని కోరారు. సిటి కమిషనర్ రాజశేఖరబాబు మాట్లాడుతూ ఎన్‌టిఆర్ జిల్లా పరిధిలో ఇంత వరకు 2,500ల సిసి కెమేరాలు ఏర్పాటుచేవామన్నారు. ప్రభుత్వవిప్ తంగిరాల సౌమ్య మాట్లాడుతూ ఈప్రాజెక్టును నందిగామ ప్రాంతంలో కూడా ఇదే స్ఫూర్తితో ఏర్పాటుచేస్తామన్నారు.

కాగా సభానంతరం ఎంఎల్ఏ రాజగోపాల్ నివాసానికి వెళ్ళిన మంత్రి అనిత రాజగోపాల్ మాతృమూర్తి సంవత్సరిక కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించారు.

# మనసును నియంత్రించటం కోసం సాధన అవసరం

## పురాతన ఆలయాన్ని జీర్ణోద్ధరణ చేయటం మంచిది: కంచి స్వామి



తంగేళ్ళ పాళెం సభలో మాట్లాడుతున్న కంచికామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి

తొట్టంబేడు, మార్చి 27 ప్రభాతవార్త 'వాయువును నియంత్రించటం ఎంత కష్టమో మనస్సును నియంత్రించటం కూడా అంతే కష్టమని అందుకు ఎంతో సాధన అవసరమని కంచికామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్రసరస్వతి అన్నారు. గురువారం శ్రీకాళహస్తికి సుమారు 4 కిలో మీటర్ల దూరంలోని గిరి సుత సమేత నీలకంఠేశ్వరస్వామి పురాతన శిధిల ఆలయాన్ని స్వామి సందర్శించారు. మాజీ శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడు అభ్యర్థన మేరకు స్వామి గ్రామాన్ని సందర్శించారు. ఘనస్వాగతం: కంచిస్వామి శంకరవిజయేంద్ర సరస్వతి తంగేళ్ళ పాళెం గ్రామానికి రాగా గ్రామంలో పండగ వాతావరణం చోటు చేసుకుంది. ఎప్పుడూ క్వారీల్లో శబ్దాలతో సతమతమయ్యే ప్రజలకు స్వామి రాకతో మేళ తాళాలు, మంగళవాయిద్యాదలు, తప్పెట్ల మోతతో దద్దరిల్లింది. స్వామి రాకతో గ్రామంలో మామిడి తోరణాలు, అరటి చోట్లతో శోభాయమానంగా తిర్చి దిద్దారు. వేదపండితులు వేద మంత్రాలను చదువుతుండగా స్వామి రాకతో గ్రామం పునీతమైనట్లు గ్రామస్థులు భావించారు. స్వామికి నిమ్మకాయల మాలలను అలంకరింపజేసారు. అలాగే పూల మాలలతో ముంచెత్తారు కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి మాజీ శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడు అభ్యర్థన మేరకు సుమారు వెయ్యి సంత్సరాల నాటి శిధిలమైన గిరిసుత నీలకంఠేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ స్వామి గోపూజలను నిర్వహించి, గోవులకు ఆహారాన్ని అందించారు. తరువాత ఆలయ పరిసరాలను పరిశీలించారు. అక్కడ ఉన్న చారిత్రక ఆధారాలతో ఆలయ నిర్మాణం శైలి పరిస్థితిని గమనించిన స్వామి ఇది ఎంతో మహిమాన్వితమైన ఆలయమని దీని స్థానంలో కొత్త ఆలయాన్ని నిర్మించటం కన్నా పునర్నిర్మాణమే మంచిదని సూచించారు. దాంతో వెంటనే ఆలయ మరమ్మత్తులకు భూమి పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభావేదికలో కంచికామకోటి పీఠాధిపతి చుట్టుపక్కల గ్రామస్థులను ఆశీర్వదించారు. తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ దక్షిణ కాశిగా ప్రసిద్ది చెందిన శ్రీకాళహస్తీశ్వరాలయం పరిసరాల్లో ఎన్నో విశేషాలు దాగి ఉన్నాయని వివరించారు. నాడు కంచికామకోటి పీఠాధిపతి చంద్రశేఖర్ సరస్వతి పర్యటించిన ఈ ప్రాంతాల విశిష్టత ఇంతా అంత కాదన్నారు. ఇక్కడ శిధిలమైన ఆలయాన్ని తొలగించి కొత్త ఆలయాన్ని నిర్మించటం ఎంతో సులభమని అయితే అతి పురాతనమైన ఆలయాన్ని పునర్నిర్మించటం ఎంతో శ్రేష్టమన్నారు.

# నాలా చట్టం రద్దు పై త్వరలోనే విధివిధానాలు

## - నారెడ్కో ప్రతినిధులతో మంత్రి అనగాని సత్యప్రసాద్

సచివాలయం, మార్చి 27, ప్రభాతవార్త : నాలా చట్టం రద్దుపై త్వరలోనే విధివిధానాలను విడుదల చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖమంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు. అభివృద్ధికి ఆటంకంగా ఉన్న నాలా చట్టాని రద్దుచేయాలని సీఎం చంద్రబాబు కలెక్టర్ల కాన్ఫరెన్స్ లో ప్రకటించిన విషయం విధతమే.. ఈ నేపథ్యంలో రియాల్టీ సంస్థ అయిన నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (నారెడ్కో) ప్రతినిధులు గురువారం అమరావతిలోని సచివాలయంలో మంత్రి అనగాని సత్యప్రసాద్ ను కలిసి ధన్యవాదాలు తెలిపారు. నాలా చట్టం రద్దు వెనుక మంత్రి అనగాని సత్యప్రసాద్ కృషి ఎంతో ఉందన్నారు. మంత్రి సత్యప్రసాద్‌కు దుశ్శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా వారితో మంత్రి అనగాని మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎప్పుడూ డైనమిక్ నిర్ణయాలు తీసుకుంటారని, నాలా చట్టం రద్దు నిర్ణయం కూడా అందులో భాగమేనని చెప్పారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ లోభాగంగా ఈ సమస్య తన దృష్టికి వచ్చిన వెంటనే సీఎం వద్దకు తీసుకెళ్ళి త్వరగా నిర్ణయం తీసుకోగలిగామని చెప్పారు. నాలా చట్టం రద్దు పై విధివిధానాలు అతి త్వరలోనే వస్తాయని చెప్పారు.

# వేసవి తాపానికి దుర్గమ్మ ఆలయంలో భక్తులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ



ఇంద్రకీలాద్రి, మార్చి 26, ప్రభాత'వార్త' :దుర్గమ్మ వారిని దర్శించుకోడానికి వచ్చే భక్తులకు ఉచితంగా మజ్జిగను పంపిణీ చేయనున్నట్లు ఆలయ ఇఓ కె రామచంద్ర మోహన్ తెలిపారు. వేసవి సందర్భంగా ఎండవేడిమినుండి కాపాడుకోడానికి వీలుగా వైట్‌కూలింగ్ పెయింట్‌ను భక్తులు తిరుగాడే రాజగోపారం, పాత రాజగోపురం తదితర ఆలయంలోని ముఖ్య ప్రాంతాల్లో వేయిస్తామన్నారు.

# ఎల్లలు దాటుతున్న బండరాళ్లు రవాణా! పట్టించుకునే అధికారులే లేరు..

రౌతులపూడి, మార్చి 27( ప్రభాతవార్త ): కాకినాడ జిల్లా, రౌతులపూడి మండలంలోనిఎస్. పైడిపాల, మల్లంపేట, ములగపూడి, ఉప్పంపాలెం క్వారీ ప్రాంతాల నుండి భారీ బండరాళ్ల ను కాకినాడ సెజ్, అనకాపల్లి జిల్లారాంబిల్లి ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. అంతేకాకుండా కాకినాడ పోర్ట్ నుండి బంగ్లాదేశ్ కు షిప్ ద్వారా రవాణా చేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం రవాణా చేసే సమయంలో తీసుకోవాల్సిన నిబంధనలు ఎవరు పాటించడం లేదు. సుప్రీంకోర్టు ఆదేశాలను పట్టించుకోవటం లేదు. రోడ్డుపై ప్రయాణించే ప్రయాణికులను భయభ్రాంతులకు గురి చేసే విధంగా బండరాళ్లను రవాణా సాగించేస్తున్నారు. ఏ అధికారులు మా వైపు కన్నెత్తి చూడరనేదీమాను వ్యక్తం చేస్తూ మూడు పువ్వులు ఆరు కాయలు వలే బినామీ వ్యాపారులు సొమ్ములు చేసుకుంటున్నారు. బండరాయి రోడ్డుపై జారిపడితే ప్రయాణికులు ప్రమాదం కొని తెచ్చుకున్నట్లే అనే విధంగా రవాణా చేస్తున్నారు. లారీ కంపెనీ మ్యానుఫ్యాక్చరింగ్ బాడీ కంటే అదనపు ఎత్తును తయారు చేయించి అధిక లోడు రవాణా చేస్తున్నారు. ఈ బండరాళ్ల రవాణాపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

# ఇంటర్మీడియట్ విద్యాస్థాయిలో సిబిఎస్‌ఇ సిలబస్ !

విజయవాడ, మార్చి 27, ప్రభాతవార్త ప్రతినిధి: ఇంటర్మీడియట్ విద్య స్థాయిలో సీబీఎస్‌ఈ సిలబస్ ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. ఇందుకనుగుణంగా ఏప్రిల్ 1వ తేదీ నుంచి ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు సంబంధించి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభించనుంది. ఏప్రిల్ ఏడోతేదీ నుంచే ఓరియంటేషన్ తరగతులు మొదలు కానున్నాయి. ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి తద్వారా ప్రవేశాలు పెంచేందుకు ఇంటర్ విద్యాశాఖ ఇప్పటికే ప్రణాళికలు రూపొందించింది. ఇంటర్ ప్రథమ సంవత్సరం సీబీఎస్‌ఈ పుస్తకాలను ప్రభుత్వం ఉచితంగా అందించనుంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా వాటితోపాటు నోటు పుస్తకాలు, రికార్డు షీట్లు ఉచితంగా ఇవ్వనున్నారు. ఇప్పటికే మధ్యాహ్న భోజన పథకం అమలవుతోంది. పదో తరగతి విద్యార్థులకు సెమిస్టర్ విధానంలో పుస్తకాల ఏర్పాటు తరహాలోనే ఇంటర్ విద్యార్థులకు ఫిజిక్స్, కెమిస్ట్రీ కలిపి ఒక పుస్తకం బోటనీ, జువాలజీ కలిపి మరో పుస్తకంగాను, గణితం 1ఏ గణితం 1బిని కలిపి ఒకే పుస్తకంగాను రూపొందించనున్నారు. కొత్తగా ఎంబైపీసీ సైతం అమలు చేయనున్నారు. ద్వితీయ సంవత్సర విద్యార్థులకు యథావిధిగా పాత సిలబస్‌లోనే పాఠ్యాంశాలు బోధించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల శ్రేయస్సు, అభివృద్ధే ధ్యేయంగా నూతన విద్యావిధానాన్ని అమలు పరుస్తోందని తిరుపతి ఆర్ఐవో ప్రభాకర్ రెడ్డి తెలిపారు. తద్వారా వారిలో నైపుణ్యం పెరిగి విజ్ఞానవంతులుగా ఎదుగుతారన్నారు. సీబీఎస్‌ఈ సిలబస్ ద్వారా విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తారు. దీనికి సంబంధించి జిల్లాలో అధ్యాపకులకు త్వరలో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తామని వివరించారు.

# హైకోర్టు మెట్లెక్కిన టెన్త్ డిబార్ విద్యార్థిని

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 27: నల్లగొండ జిల్లా నకిరేకల్ లో పదో తరగతి పరీక్షా పత్రం లీకేజీ వ్యవహారం ఎట్టకేలకు తెలంగాణ హైకోర్టు కు చేరింది. ఇప్పటికే ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు మొత్తం 11 మందిపై కేసులు నమోదు చేశారు. అదేవిధంగా పేపర్ లీకేజీకి సహకరించిందంటూ విద్యార్థిని ఝాన్సీలక్ష్మిని అధికారులు డీబార్ చేశారు. అయితే, మొత్తం వ్యవహారంలో తన తప్పేమీ లేదని, పరీక్షకు అనుమతించాలని ఝాన్సీలక్ష్మీ అధికారులను వేడుకుంది. ఎవరో ఆకతాయిలు వచ్చి కిటికీ దగ్గర ఎగ్జామ్ రాస్తున్న తనను బెదిరించి ప్రశ్నాపత్రాన్ని ఫోటో తీసుకుని వెళ్లారని వాపోయింది. ఫోటోలు తీసిన వ్యక్తులు ఎవరో తెలియదని బాధితురాలు కన్నీళ్లు పెట్టింది.

# గాండ్ల పెంట ఎంపిపి టిడిపి ఖాతాలోకి వెళ్లనుందా?

## - వ్యూహాన్ని రచించడంలో వైఎస్సార్సీ ఫెయిల్ అయిందా..

అనంతపురం, మార్చి 27 ప్రభాతవార్త బ్యూరో కదిరి నియోజకవర్గం గాండ్లపెంట మండల ఎంపిపి స్థానానికి గురువారం ఎన్నికలు జరగాల్సి ఉండగా కోరం లేక వాయిదా పడ్డాయి. శుక్రవారం తిరిగి ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. గాండ్లపెంట మండలంలో ఏడు ఎంపిటిసిలు ఉండగా ఆరు ఎంపిటిసిలను వైసిపి, ఒక ఎంపిటిసిని టిడిపి చేజిక్కించుకుంది. ఇప్పటి వరకు ఎంపిపిగా వైసిపి వారే ఉన్నారు. గాండ్లపెంట ఎంపిపి ఉప ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని వైసిపి కదిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మక్బుల్ పర్యవేక్షణలో ఎంపిటిసిలను క్యాంపుకు తీసుకెళ్లినట్లు సమాచారం. అయితే గురువారం రోజు సరైన సమయానికి వైసిపి వారు నామినేషన్లు వేయకపోవడంతో ఎన్నికలు వాయిదా పడినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఎన్నికలు జరగనున్నాయి. ఇదిలా ఉండగా ఆరు మంది ఎంపిటిసిలలో ఉదయానికే ఒక ఎంపిటిసి టిడిపి వర్గీయుల ఆధీనంలోకి వెళ్లినట్లు తెలిసింది. మరో ఇద్దరు వైసిపి ఎంపిటిసిలను టిడిపి వారు తమవైపు తిప్పుకున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో గాండ్లపెంట ఎంపిపి స్థానం టిడిపి ఖాతాలోకి వెళ్లే అవకాశం కనిపిసుస్తున్నట్లు తెలుస్తోంది. వైసిపి నాయకులు సరైన వ్యూహాలు రచించక పోవడం వల్ల టిడిపి వారి ప్రలోభాలకు వైసిపి ఎంపిటిసిలు వెళ్లినట్లు తెలుస్తోంది. కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ప్రత్యేక దృష్టి పెట్టిగాండ్ల పెంట ఎంపిపి స్థానాన్ని చేజిక్కించుకోవాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. రాప్తాడు నియోజకవర్గం రామగిరి ఎంపిపి స్థానానికి గురువారం కోరం లేక ఎ న్నికలు వాయిదా పడ్డాయి. ఈనేపథ్యంలో శుక్రవారం ఈ స్థానానికి ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ ఎంపిపి స్థానం విషయంలో టిడిపి, వైసిపి వర్గాలు గొడవ పడటంతో టెన్షన్ వాతావరణం నెలకొంది. మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షులు ఉషాశ్రీచరణ్, జడ్పి చైర్మన్ బోయ గిరిజమ్మ తదితరులతో కలిసి రామగిరి మండల వైసిపి ఎంపిటిసి ఎంపిపిలు గురువారం పెనుకొండకు చేరుకుని అక్కడ పోలీసు అధికారుల వద్ద హాజరై, ఆ తర్వాత కర్ణాటకకు క్యాంపు వెళ్లినట్లు తెలిసింది.

# దేశంలోనే ఏపి ముందుండాలనేది సిఎం చంద్రబాబు లక్ష్యం

## - ప్రజల నుంచి మేం ఏమీ ఆశించం.. గంజాయి విక్రయిస్తే ఒక్క ఉతుకు ఉతకండి: నారా భువనేశ్వరి



కుప్పం మండలం జరుగు గ్రామంలో మహిళలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న సిఎం సతీమణి నారా భువనేశ్వరి

కుప్పం, మార్చి 27 ప్రభాతవార్త దేశ ంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ముందుండాలనేది సిఎం చంద్రబాబునాయుడు లక్ష్యమని సిఎం చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి పేర్కొన్నారు. గురువారం కుప్పం మున్సిపల్ పరిధి మోడల్ కాలనీ, కెడిపల్లి, జరుగు పంచాయతీల్లో ఆమె పర్యటించి మహిళలతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. పోలవరం ప్రాజెక్టును రెండేళ్లలో పూర్తి చేయాలని సిఎం చంద్రబాబు దృష్టి పెట్టారన్నారు. అలాగే రాజధాని అమరావతి నగర నిర్మాణం పూర్తికి కృషి చేస్తున్నారన్నారు. 2019-24మధ్య చంద్రబాబునాయుడే సిఎంగా ఉంటే రాష్ట్రం నెంబర్‌వన్‌గా ఉండేదన్నారు. అయితే ఆయన నిరుత్సాహం చెందక రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. ఐదేళ్ల వైఎస్సార్సీ పాలనలో ప్రజలు రోడ్లపై రావాలంటే భయపడేవారన్నారు. నేడు చంద్రబాబు పాలనలో ప్రజలు సంతోషంగా తిరుగుతున్నారన్నారు. వైఎస్సార్సీ పాలనలో రాష్ట్రానికి వచ్చిన పారిశ్రామికవేత్తలు కూడా వెళ్లిపోయారన్నారు. నేడు సిఎం చంద్రబాబుపై నమ్మకంతోనే ఇతర దేశాలు, రాష్ట్రాలనుంచి ఎపికి పెట్టుబడులు వస్తున్నాయన్నారు. తాము ఏమీ ఆశించేది లేదని ప్రజలకు మేలు చేయాలన్నదే తమ తపన అని నారా భువనేశ్వరి పేర్కొన్నారు. వైకాపా పాలనలో సంక్షేమ పథకాలు ఆగాయని అయితే మరలా సిఎం చంద్రబాబు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి జిల్లాకు పరిశ్రమలు తేవాలని ఆయన కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలోని మహిళలకు సిఎం చంద్రబాబు గౌరవం తెచ్చారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముప్పై ఏళ్ల క్రితం డ్వాక్రా సంఘాలు స్థాపించారన్నారు. తాను కూడా గతంలో ఇంటికే పరిమితం అయ్యేదాన్నని అనంతరం బాబు ప్రోత్సాహంతో వ్యాపార రంగంలో అడుగుపెట్టానని పేర్కొన్నారు. మహిళలు తమ వద్ద డబ్బులేదనే విషయం ఉండరాదని మహిళలను అన్ని విధాలా ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. గంజాయి విక్రయిస్తే ఒక్క ఉతుకు ఉతకండి : గ్రామాల్లో ఎవరైనా గంజాయి విక్రయాలు చేపడితే మహిళలంతా చేయిచేయి కలిపి ఒక్క ఉతుకు ఉతకాలని నారా భువనేశ్వరి పిలుపునిచ్చారు. గత వైఎస్సార్సీ పాలనలో 20-30వేల కోట్ల విలువ చేసే గంజాయి ఎగుమతయ్యేదని, విచ్చలవిడిగా విక్రయాలు జరిగేవన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో గంజాయి విక్రయాలపై చర్యలు చేపట్టారన్నారు. అంతకుముందు గ్రామాల్లో నారా భువనేశ్వరికి మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. కార్యక్రమాల్లో ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, సలహాదారు నరేష్‌చారి, రాష్ట్ర నేత డా॥ బిఆర్ సురేష్‌బాబు, మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు, మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, నేతలు సాంబశివం, డా॥ వెంకటేష్, రామచంద్ర, మహేంద్ర, సోమశేఖర్, గనిఉల్లా, నబీఉల్లా, నాగభూషణం, కార్పోరేషన్ డైరెక్టర్ రాజగోపాల్, మహిళా నేతలు పాల్గొన్నారు.

# పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ జరపాలి

## క్రిస్టియన్ సంఘాల డిమాండ్



పాస్టర్ ప్రవీణ్ అంతిమయాత్రలో పాల్గొన్న క్రిస్టియన్లు, అభిమానులు

హైదరాబాద్ (కంటోన్మెంట్), మార్చి 27, ప్రభాతవార్త: రాజమండ్రిలో ఇటీవల అనుమానస్పదస్థితిలో మృతి చెందిన పాస్టర్ పగడాల ప్రవీణ్ భౌతిక కా యాన్ని సికిందరాబాద్ సెంటనరీ బాప్టిస్ట్ చర్చిలో గురువారం సందర్శకుల కోసం ఉంచారు. సెంట నరీ బాప్టిస్ట్ చర్చికి చెందిన ఆంధ్రప్రదేశ్, తెలం గాణ రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున పాస్టర్లు, క్రిస్టియ న్లు తరలివచ్చి సంతాపం వ్యక్తంచేశారు. ఈ సంద ర్భంగా పలు చర్చిల పాస్టర్లు, ఫాదర్లు మాట్లా డుతూ పాస్టర్ ప్రవీణ్ మరణం క్రైస్తవ లోకానికి తీరనిలోటన్నారు. అనుమా నస్పద స్థితిలో ప్రవీణ్ మృతి చెందడం క్రైస్తవ సమాజాన్ని తీవ్రంగా కలిచివేసిందన్నారు. కొంతమంది మతో న్మాద శక్తులు ఆయనను హత్యచేసి రోడ్డు ప్రమా దంలో మృతి చెందినట్లు ప్రకటించారు. ప్రవీణ్ హత్యపై సమగ్రవిచారణ జరిపి నిందితులను అరెస్టు చేయాలన్నారు. దేశంలో శాంతిభద్రతలు దెబ్బతినడంతో పాటు క్రైస్తవులకు రక్షణ లేకుండా పోయిందన్నాం అనుమానస్పదస్థితిలో మృతి చెందిన పగడాల ప్రవీణ్ మరణవార్త తెలియగానే గురువారం సికిందరాబాద్ బాప్టిస్ట్ చర్చికి ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపకులు పాస్టర్ కె.ఎ పాల్, బ్రదర్ అనీల్, మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్ రావు, ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎం. రాజీవ్ సాగర్, ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు గద్దపాటి విజయరాజు, ఉపాధ్య క్షుడు దేవిడ్ కడారి, కుల వివక్ష వ్యతి రేక పోరాట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు, బాప్టిస్ట్ చర్చి అధ్య క్షుడు క్యాలిస్టర్, ప్రధాన కార్యదర్శి సోలమన్ లతోపాటు వేలాదిమంది క్రిస్టియన్లు తరలివచ్చి సంతాపం వ్యక్తం చేశారు.

# ఇంటర్ తరువాత ఏం చదవాలి?

## నేడు టి-శాట్‌లో ప్రత్యేక లైవ్

హైదరాబాద్, మార్చి 27, ప్రభాతవార్త: రాష్ట్రంలోని విద్యార్థులు ఇంటర్మీడియట్ పూర్తి చేసిన తరువాత ఏ కోర్సులను చదవాలని విద్యార్థులు ఆందోళన పడుతుంటారు. అటువంటి వారి కోసం టి-సాట్ ప్రత్యేకంగా ఇంటర్మీడియట్ తరువాత ఏ కోర్సులను చదవాలనే అంశాలపై నేడు(శుక్రవారం) ప్రత్యేక లైవ్ షోను నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన విషయాన్ని టి-శాట్ సిఇఒ వేణుగోపాల్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ విద్య పూర్తి చేశాక విద్యార్థులు ఏ కోర్సు చదవాలనే సందిగ్ధం వీడేందుకు టి-శాట్ నెట్‌వర్క్ ప్రత్యేక లైవ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఇంటర్ విద్య పూర్తి చేశాక ఏ కోర్స్ చదవాలి, సైన్స్, మ్యాథ్స్ లేదా ఏ ఇతర వృత్తి విద్య కోర్సులు ఎంచు కోవాలనే విషయమై అవగాహన కల్పించేందుకు తెలంగాణ బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ ఆధ్వర్యంలో నిర్మాణ్, ఆస్మాన్ ఫౌండేషన్ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని సీఈవో తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటల నుండి టి-శాట్ నిపుణలో జరిగే ప్రత్యేక లైవ్ కార్యక్రమంలో ఇదే అంశంపై నిపుణులు ప్రత్యేక సలహాలు సూచనలు అందించనున్నారని వేణు ప్రకటనలో పేర్కొన్నారు. సుమారు 10 లక్షల మంది ప్రభుత్వ, ప్రయివేటు విద్యార్థులు ఈ యేడాది ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు హాజరయ్యారని, వారి భవిష్యత్‌ను నిర్ణయించే సరైన నిర్ణయాన్ని సూచించే విధంగా ప్రసార కార్యక్రమం ఉంటుందన్నారు. కార్య క్రమాన్ని విద్యార్థులు, విద్యార్థుల తల్లదండ్రులు సద్వినియోగ పరుచుకోవాలని టి-సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి పత్రిక ప్రకటనలో కోరారు. లైవ్ ప్రసారాలు టి-సాట్ నెట్వర్క్ చానళ్లతో పాటు టి-సాట్ యాప్, యూట్యూబ్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. భారత రాజ్యాంగంపై ప్రత్యేక ప్రసారాలు భారత పౌరులు అత్యంత ప్రాధాన్యంగా భావించే భారత రాజ్యాంగంపై టి-సాట్ ప్రత్యేక ప్రసారాలు అందించనుంది. భారత రాజ్యాంగం రూపకల్పన, నిర్మాణం, ప్రాథమిక సూత్రాలు, కేంద్రరాష్ట్రాల మధ్య సంబంధాలు తదితర ప్రధాన అంశాలపై 30 నిమిషాల నిడివిగల సుమారు 15 ఎపిసోడ్స్ ప్రసారం కానున్నాయని తెలిపారు. ఈ నెల 29వ తేదీ శనివారం మధ్యాహ్నం ఒంటి గంట నుండి ఒంటి గంటన్నర వరకు నిపుణ, తిరిగి సాయంత్రం 6 గంటల నుండి ఆరున్నర గంటల వరకు విద్యలో ప్రసారమవుతాయన్నారు. రాజ్యాంగాన్ని రూపొందించి సుమారు 75 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా కొత్త సమాజానికి రాజ్యాంగం ప్రాధాన్యతలు తెలియజెప్పేందుకు టి-సాట్ ప్రయత్నిస్తోందని.. ఈ అవకాశాన్ని విద్యార్థులు, యువత తప్పనిసరిగా వినియోగించుకోవాలని వేణుగోపాల్ రెడ్డి ఒక ప్రకటనలో సూచించారు.

# జూనియర్ డాక్టర్ సూసైడ్ కేసులో నిందితుడి అరెస్ట్



**రాజమహేంద్రవరం, మార్చి ,27, ( ప్రభాతవార్త ) :**
ప్రకాష్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న జూనియర్ డాక్టర్ నల్లపు నాగంజలికి సంబంధించిన సూసైడ్ కేసులో ప్రధాన నిందితుడైన దువ్వాడ మాధవ రావు దీపక్ ను గురువారం పోలీసులు అరెస్ట్ చేశారు. తూర్పు గోదావరి జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ డి. నరసింహ కిషోర్, సౌత్ జోన్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఎస్. భవ్య కిషోర్ ఆదేశాల ప్రకారం ఈ కేసు దర్యాప్తు ప్రారంభమైంది. ప్రకాష్ నగర్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఆర్. ఎస్ కే బాజీలాల్ ఆధ్వర్యంలో సబ్ ఇన్స్పెక్టర్ ఎస్. శివ ప్రసాద్, కానిస్టేబుల్స్ వి. శివప్రసాద్, జే. ఈశ్వరరావు లచే ప్రత్యేక నిఘా నిర్వహించబడింది. ఈనెల 24న కిమ్స్ బొల్లినేని హాస్పిటల్ నందు ఫార్మాలజిస్ట్‌గా పనిచేస్తున్న నల్లపు నాగంజలి, ముద్దాయైన దువ్వాడ మాధవ రావు దీపక్ నుంచి లైంగిక వేదనకు గురయ్యిందని, తండ్రి నల్లపు దుర్గ రావు పోలీసులకు ఫిర్యాదు చేస్తూ, దీపక్ తన కుమార్తెని ప్రేమ పేరుతో శారీరకంగా వేదించి, తరువాత బెదిరించడం, బ్లాక్‌మెయిల్ చేయడం జరిగిందని తెలిపారు. ఫిర్యాదులో ప్రస్తావించినట్లు,ఈ నెల 23న బొల్లినేని హాస్పిటల్ నుండి ఫోన్ కాల్ వచ్చి, నాగంజలి కళ్ళు తిరిగి పడిపోయిందని తెలిపింది. ఆమె రూమ్ వద్ద ఒక సూసైడ్ నోట్ కూడా లభించింది, అందులో తనకు లైంగిక వేధన, శారీరకంగా అనుభవాలు, టార్చర్ చేశానని పేర్కొంటూ, దీపక్ తనతో ప్రేమనాటకాలు ఆడినట్లు, ఆ బలాత్కారాలను అధిగమించలేకే తన ప్రాణాలు తీసుకునేలా నిర్ణయించుకుంది అని వ్రాసింది. ఈ ఘాతుకం తరువాత, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టిన పోలీసులు ముద్దాయిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఆధారాల ఆధారంగా ఈ కేసులో దువ్వాడ మాధవ రావు దీపక్‌ను రాజమహేంద్రవరం విద్య నగరంలోని ఆయన ఇంటి వద్ద అరెస్ట్ చేసి, తదుపరి విచారణ కోసం రిమాండ్ కు తరలించారు.

# అనాధ శవానికి అంత్యక్రియలు



**అంబాజీపేట, మార్చి ,27, ( ప్రభాతవార్త ) :**
మండలంలోని పుల్లేటికుర్రు శివారు చినలంక బైపాస్ రోడ్డుపై ఈ నెల 24న జరిగిన ప్రమాదంలో గుర్తు తెలియని, మతిస్థిమితం లేని 35 ఏళ్ల మహిళ మృతి చెందింది. శవ పంచినామా అనంతరం అంబాజీపేటకు చెందిన నాగాబత్తుల సాహెబ్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ నాగాబత్తుల వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో పుల్లేటికుర్రు గ్రామ సర్పంచి జల్లి బాలరాజు, వార్డ్ మెంబర్ యలమంచిలి బుచ్చిబాబు, సత్యాల కొండలరావు, నాగాబత్తుల మధుబాబుల సహకారంతో ప్రత్యేక వాహనం పై అమలాపురం మున్సిపాలిటీ స్మశానంనకు తరలించి గురువారం అంత్యక్రియలు నిర్వహించామని అంబాజీపేట ఎస్సై కె. చిరంజీవి తెలిపారు. సుబ్బారావు సేవలను పలువురు కొనియాడారు.

# డెంగ్యూ వ్యాధి నిర్ధారణ..
# పారిశుధ్య పనులపై దృష్టి సారించిన గ్రామ పంచాయితీ

**అంబాజీపేట, మార్చి ,27, ( ప్రభాతవార్త ) :**
మండలంలోని గంగలకుర్రు ఆగ్రహారం దంగేటివారిపాలెంలో ఓ మహిళలకు డెంగ్యూ వ్యాధి నిర్ధారణ అయినట్లు అంబాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కె.ఎన్.శ్రీనివాస్ తెలిపారు. దంగేటివారిపాలెంకు చెందిన రాయుడు పద్మ రెండు వారాల క్రితం అయినవిల్లి మండలం చింతనలంకలో కూలిపనికి వెళ్లి వచ్చిన తర్వాత జ్వరం వచ్చిందన్నారు. అనంతరం ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం చేయించినప్పటికి జ్వరం తగ్గకపోవడంతో ఆమె బంధువులు కొత్తపేట ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడి నుండి అమలాపురం ఏరియా ఆస్పత్రికి పంపారన్నారు. మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారన్నారు. అక్కడ వైద్యులు పద్మకు డెంగ్యూ వ్యాధి లక్షణాలు గుర్తించి నిర్ధారణ చేశారన్నారు. దాంతో దంగేటివారిపాలెంలో పారిశుధ్య పనులపై దృష్టి సారించిన సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు పారిశుధ్య పనులు చేపట్టించారన్నారు. అలాగే గ్రామంలో డోర్టుడోర్



సర్వే చేసి జ్వరాల బారిన పడిన వారి వివరాలను సేకరిస్తున్నామన్నారు. డెంగ్యూ వ్యాధి సోకిన రోగి ఇంటి వద్ద ప్రత్యేక చర్యలు తీసుకున్నామని డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. సీహెచ్ ఓ బి.అప్పారావు పర్యవేక్షణలో దంగేటి వారిపాలెంలో మెడికల్ క్యాంపును నిర్వహిస్తున్నామన్నారు.

# ఈ బండరాళ్ల రవాణాన్ని పట్టించుకునే వారెవరు?



**రౌతులపూడి, మార్చి ,27, ( ప్రభాతవార్త ) :**
మండలంలోనిఎస్. పైడిపాల, మల్లంపేట, ములగపూడి, ఉప్పంపాలెం క్వారీ ప్రాంతాల నుండి భారీ బండరాళ్లను కాకినాడ సెజ్, రాంబిల్లి ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. రవాణా చేసే సమయంలో తీసుకోవాల్సిన నిబంధనలు ఎవరు పాటించడం లేదు. రోడ్డుపై ప్రయాణించే ప్రయాణికులను భయభ్రాంతులకు గురి చేసే విధంగా బండరాళ్లను రవాణా సాగించేస్తున్నారు. ఏ అధికారులు మా వైపు కన్నెత్తి చూడరనేదీమాను వ్యక్తం చేస్తూ మూడు పువ్వులు ఆరు కాయలు వలే బినామీ వ్యాపారులు సొమ్ములు చేసుకుంటున్నారు. బండరాయి రోడ్డుపై జారిపడితే ప్రయాణికులు ప్రమాదం కొని తెచ్చుకున్నట్లే అనే విధంగా రవాణా చేస్తున్నారు. ఈ బండరాళ్ల రవాణాపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

# జనసేన పార్టీ అభివృద్ధిలో చెల్లుబోయిన పాత్ర ఎనలేనిది

**పిఠాపురం, మార్చి ,27, ( ప్రభాతవార్త ) :**
పిఠాపురం నియోజకవర్గంలో జనసేన పార్టీ అభివృద్ధిలో చెల్లు బోయిన సతీష్ కుమార్ పాత్ర ఎనలేనిదని నియోజకవర్గ ఇన్చార్జ్ మర్రెడ్డి శ్రీనివాసరావు అన్నారు. ఆయన పుట్టినరోజు కార్యక్రమానికి విచ్చేసి మాట్లాడారు. పిఠాపురం నియోజకవర్గ జనసేన నాయకుడు చెల్లుబోయిన సతీష్ కుమార్ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. పిఠాపురం నుండి రాపర్తి గ్రామం వెళ్లే రోడ్డు మార్గంలో ఉన్న గ్రీన్ ఫీల్డ్ ఫాం హౌస్ లో జరిగిన ఈ జన్మదిన వేడుకలలో ప్రముఖులు పాల్గొన్నారు. ముందుగా జనసేన నాయకుడు



చెల్లుబోయిన సతీష్ కుమార్ కేక్ కట్ చేసి తన జన్మదిన వేడుకలను ప్రారంభించారు. అనంతరం తన పుట్టిన రోజు సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం నియోజకవర్గ జనసేన నాయకులు, జన సైనికులు, చెల్లుబోయిన అనుచరులు,తదితరులు పాల్గొన్నారు.

# ఆన్ లైన్ మోసాలు, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



## కొత్తపేట డిఎస్పీ సుంకర మురళీ మోహన్

**రావులపాలెం, మార్చి ,27, ( ప్రభాతవార్త ) :**
సమాజంలో జరుగుతున్న మోసాలు, సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పిల్లల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి పెట్టి కాపాడుకోవాలని కొత్తపేట డి.ఎస్.పి సుంకర మురళీ మోహన్ సూచించారు. రావులపాలెం మండలం ఈతకోట జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులకు పోలీసులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో డి.ఎస్.పి మాట్లాడుతూ ప్రస్తుతం సైబర్ నేరగాళ్ల మోసాలు ఎక్కువయ్యాయని, ఆన్ లైన్ కార్యకలాపాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సోషల్ మీడియాలో పరిచయం అయిన వ్యక్తులను నమ్మి బాలికలు, యువతులు వారి వలలో పడవద్దని హెచ్చరించారు. ఆన్ లైన్ బెట్టింగ్ యాప్ లు, క్రికెట్ బెట్టింగ్, ర్యాగింగ్, జూదాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. మద్యం, గంజాయి మత్తుకు బానిసలైన కొందరు ప్రజలను మోసం చేయడమే అలవాటుగా చేసుకున్నారని, ఇటువంటి వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండి అనుమానం వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. పిల్లలు బయటకు వెళ్లి ఏం చేస్తున్నారో తల్లిదండ్రులు దృష్టి పెట్టాలని, సెల్ ఫోన్లు చెడు మార్గానికి కాకుండా మంచికి వినియోగించుకోవాలని అన్నారు. బాలికల పట్ల ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, ర్యాగింగ్ చేసినా వెంటనే పోలీసులకు సమాచారం అందజేయలన్నారు. 18 ఏళ్ళు నిండకుండా, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా మోటార్ వాహనాలు నడిపవద్దని, తల్లిదండ్రులు ఈ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. తమతో పాటు, తమ కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారు తప్పకుండా హెల్మెట్ ధరించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రావులపాలెం టౌన్ సిఐ ఎం.శేఖర్ బాబు, ఎస్సై ఎన్.రాము, గ్రామ కార్యదర్శి మాడుగుల సుందర రామలక్ష్మణ శర్మ. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.వి కృష్ణారెడ్డి, ఎస్.ఎం.సి ఛైర్మన్ పిప్పర రమేష్. గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# రూరల్ ఎం పి పి జనసేన పార్టీ కైవసం




: ఎం పి పి గా నందిపాటి అనంతలక్ష్మి ఏకగ్రీవం
: సమావేశానికి గైర్హాజరు అయిన వై సి పి ఎంపీటీసీలు

**కాకినాడ రూరల్ , మార్చి ,27, ( ప్రభాతవార్త ) :**
కాకినాడ రూరల్ మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలి పీఠం జనసేన పార్టీ కైవసం చేసుకుంది. పండూరు గ్రామం జనసేన పార్టీ కి చెందినఎంపీటీసీ నందిపాటి అనంతలక్ష్మి ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ అధ్యక్ష ఎన్నిక నిర్వహించారు. ఎన్నికల అధికారిగా డ్రామా పీడీ అడపా వెంకటలక్ష్మి, ఎన్నికల అబ్జర్వర్ గా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా వ్యవహరించారు.. ఈ సందర్భంగా జరిగిన ఎన్నికల్లో రూరల్ మండలానికి చెందిన మొత్తం 18 మంది సభ్యులు గాను పదిమంది హాజరయ్యారు. 8 మంది వైసిపి ఎంపీటీసీలు గైరహాజరయ్యారు. ఎంపీపీ ఎన్నికల్లో భాగంగా పండూరు 1 ఎంపీటీసీ నందిపాటి అనంతలక్ష్మి ఎంపీపీ అభ్యర్థినిగా నామినేషన్ దాఖలు చేశారు. అనంతలక్ష్మి నామినేషన్ ను ఎంపీటీసీలు నందిపాటి శ్రీనివాస్, గుత్తుల శ్రీనివాస్ లు ప్రతిపాదించారు. ఎన్నిక సమావేశానికి మొత్తం పదిమంది సభ్యులు హాజరుకాగా కేవలం ఒకరు మాత్రమే నామినేషన్ దాఖలు చేయడంతో ఎంపీపీ గా నందిపాటి అనంతలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి వెంకటలక్ష్మి ప్రకటించారు. అనంతరం ఎన్నిక ధ్రువపత్రాన్ని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా తో కలిసి నూతన ఎంపీపీ అనంతలక్ష్మి కు అందజేశారు. అనంతరం ఆమె చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా రూరల్ ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 10 నెలలకు అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని ముఖ్యంగా గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని గ్రామాల అభివృద్ధి జరుగుతున్న విధానానికి రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు పెద్ద ఎత్తున కూటమి ప్రభుత్వానికి మద్దతు తెలుపుతున్నారని దాంట్లో భాగంగానే గత వైసిపి ప్రభుత్వం లో ఎన్నికైన కొంతమంది ఎంపీటీసీ సభ్యులు ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనకు సంతృప్తి చెంది తమ గ్రామాలను సైతం అభివృద్ధి చేసుకోవాలని లక్ష్యంగా జనసేన పార్టీలో చేరడం జరిగిందని దీంతో ప్రస్తుతం ఖాళీగా ఉన్న కాకినాడ రూరల్ ఎంపీపీ అభ్యర్థిగా జనసేన పార్టీ ఎంపీటీసీ నందిపాటి అనంతలక్ష్మి పోటీ చేశారని సభ్యుల మద్దతుతో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని అన్నారు. నూతన ఎంపీపీ కి ఈ సందర్భంగా ఆయన అభినందనలు తెలిపారు అనంతరం నూతన ఎంపీపీ, సభ్యులు పెద్ద ఎత్తున బాణాసంచాతో ఊరేగింపుగా ఎండిఓ కార్యాలయం నుండి జనసేన పార్టీ కార్యాలయం వరకు ర్యాలీ గా వెళ్లారు. ఈ సమావేశంలో రూరల్ ఎం డి ఓ పసుపులేటి సతీష్, ఈ ఓ పి ఆర్ డి రామాంజనేయులు, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# సామర్లకోట టిటిడిసి లో జాబ్ మేళా

**సామర్లకోట , మార్చి ,27, ( ప్రభాతవార్త ) :**
జిల్లా మహిళా సాధికార సంస్థ అయిన సామర్లకోట టిటిడిసి శిక్షణ కేంద్రంలో ఈనెల 29వ తేదీ శనివారం నిరుద్యోగ యువతకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా జాబ్స్ కోఆర్డినేటర్లు శివ, రేవతిలు తెలిపారు. గురువారం వారు ఒక ప్రకటనలో తెలుపుతూ బ్లూ ఓషన్ బయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్, ఎల్జి ఆథరైజ్డ్ సర్వీస్ సెంటర్, టీం లీజు కంపెనీల్లో ఉద్యోగాలకు ఈ జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు తెలిపారు. బ్లూ ఆప్షన్ కంపెనీలో ప్రోడక్ట్ ఆపరేటర్లుగా పని చేసేందుకు పదవ తరగతి, ఇంటర్, ఐటిఐ, మెకానికల్ ఇంజనీరింగ్ పురుషుల అవసరమన్నారు. ఎల్జి ఆథరైజ్డ్ కంపెనీలో ఫీల్డ్ ఇంజనీర్ ఖాళీలకు ఇంటర్, డిప్లమో, ఏదైనా డిగ్రీ అర్హత గల స్త్రీ, పురుషులు అవసరమన్నారు. కంపెనీలో బ్రాంచ్ రిలేషన్షిప్ ఎగ్జిక్యూటివ్, బ్రాంచ్ రిలేషన్షిప్ మేనేజర్లు ఉద్యోగాలకు ఇంటర్ ఏదైనా డిగ్రీ విద్యార్హత గల యువతీ యువకులు అవసరమన్నారు. 18 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల లోపు యువతీ యువకులు ఈ ఇంటర్వ్యూలకు నేరుగా హాజరు కావాలన్నారు. విద్యార్హత ధృపత్రాలతో పాటు ఆధార్ కార్డ్, పాస్పోర్ట్ సైజ్ ఫోటోలతో 29వ తేదీ శనివారం ఉదయం 9 గంటలకు సామర్లకోట టిటిడిసి శిక్షణ కేంద్రంలో హాజరు కావాలన్నారు. జీతం రూ. 20వేలు నుంచి రూ. 25 వేల వరకు ఉంటుందని ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని జాబ్ కోఆర్డినేటర్లు శివ, రేవతి లు తెలిపారు.

# హెల్మెట్ ధరించడం తప్పనిసరి : సి ఐ సురేష్



**కోనసీమ బ్యూరో (మండపేట), మార్చి ,26, ( ప్రభాతవార్త ) :**
మోటర్ సైకిల్ నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించడం తప్పనిసరి అని మండపేట టౌన్ సిఐ దారం సురేష్ పేర్కొన్నారు. మండపేట పట్టణంలో ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ పై అవగాహన కల్పించే కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ క్రమంలో మండపేట పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ దారం సురేష్ ఎస్ఐ జి చంటి లు ద్విచక్ర వాహనదారులను తనిఖీ చేశారు. ఈ తనిఖీ చేసే క్రమంలో హెల్మెట్ ఉపయోగించని కొంతమంది వాహనదారులకు ఫైన్ విధించకుండా ఫైన్ చెల్లించే నగదుతో వారికి హెల్మెట్లు కొనిచ్చారు. అనంతరం సర్కిల్ ఇన్స్పెక్టర్ దారం సురేష్ మాట్లాడుతూ వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరిగా ఉపయోగించాలని పేర్కొన్నారు. హెల్మెట్ అనేది వారి కుటుంబానికి కూడా శ్రీరామరక్ష లాంటిదని సూచించారు. ప్రతి ఒక్క వాహనదారుడు హెల్మెట్ ఉపయోగిస్తే రోడ్డు ప్రమాదాల సంభవించే మరణాలు అరికట్టవచ్చని ఆయన అన్నారు.

# జనవాణిలో సమస్యలు పరిష్కారం ,ప్రజల వద్ద నుండి అర్జీలు స్వీకరణ

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, మార్చి ,27, ( ప్రభాతవార్త ) :**
రాజానగరం మండలం పల్లకడియం గ్రామంలో పల్లెబాట కార్యక్రమానికి అడుగడుగునా ప్రజలు నీరాజనాలు పలికారు. గ్రామంలో రాజానగరం నియోజకవర్గం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ జనవాణినిర్వహించి అర్జీలను స్వీకరించి, ఆయా సమస్యల పరిష్కారానికి అధికారులతో చర్చించారు. కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించదగిన సమస్యలను పరిష్కరించారు. కొన్ని సమస్యలను పరిష్కరించడానికి చర్యలు చేపట్టారు. పెద్ద సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలరామకృష్ణ మాట్లాడుతూభూమి హెచ్చుతగ్గులు, భూమి వివాదాలు, సంక్షేమ పథకాల సమస్యలు,





ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

రోడ్లు, డ్రైనేజీలు, త్రాగునీరు, సాగునీరు,ఎన్. ఆర్. ఇ. జి. ఎస్.పనులు, విద్య, వైద్యం, వ్యవసాయం, పలు రకాల సమస్యలపై ప్రజల వద్ద నుండి అర్జీలు స్వీకరించడం జరిగిందన్నారు. గడచిన 10 నెలల పాలనలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం ప్రతీ ఒక్కరూ కళ్ళారా చూస్తున్నారన్నారు. పల్లకడియం గ్రామంలో సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని, రైతాంగానికి ఇబ్బందులు లేకుండా సాగునీరు అందిస్తామన్నారు. అలాగే త్రాగునీటికి ఇబ్బందులు పడుతున్న గ్రామాల్లో రక్షిత మంచినీటిని అందించే విధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జనవాణి కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ని గ్రామస్తులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# చైర్పర్సన్ పై తిరగబడిన సొంత పార్టీ కౌన్సిలర్లు అవిశ్వాస హెచ్చరిక



**అమలాపురం, మార్చి ,27, ( ప్రభాతవార్త ) :**
అమలాపురం చైర్పర్సన్ పై సొంత పార్టీకౌన్సిలర్లు తిరుగుబాటుచేసి అవిశ్వాస హెచ్చిరిక చేయడంతో వైకాపాలో విబేధాలు రచ్చ కెక్కాయి. మున్సిపల్ సమావేశం లో రసాభాసకాగా వైసిపి చైర్ పర్సన్ పై వైసీపీ కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేయడంతో పార్టీ లో నెలకొన్న ఈముసలం ముదిరి నట్టైంది. అవిశ్వాస తీర్మానం పెట్టడానికి సిద్ధమంటు హెచ్చరించి న వైసిపి కౌన్సిలర్లు మున్సిపాలిటీ లో చైర్మన్ రెడ్డి నాగేంద్ర మణి భర్త ఆగడాలపై ఆ పార్టీ కౌన్సిలర్ల ఆగ్రహంతో ఆరోపణాస్త్రాలు సందించారు. మున్సిపల్ సాదారణ సమావేశంకి చైర్మన్ నాగేంద్ర మణి అద్యక్షత వహించగా అధికారులు, కౌన్సిలర్లపై చైర్పర్సన్ భర్త సత్యనారాయణ రుబాబు చేస్తున్నారని సొంత పార్టీ కౌన్సిలర్లు మండి పడ్డారు. మేమందరం ఎన్నుకుంటేనే చైర్పర్సన్ అయ్యావ్ అంటూ మహిళా చైర్ పర్సన్ పై కౌన్సిలర్ మట్టపర్తి నాగేంద్ర తిరగబడ్డారు. నా భర్త ఎటువంటి అక్రమాలకు పాల్పడలేదని చైర్మన్ గా నేను ఉన్నా పాలన ఎవరు చేస్తున్నారో అధికారులకు తెలుసునని చైర్మన్ నాగేంద్రమణి బదులిచ్చారు. రాజీవ్ అనే మున్సిపల్ గుమస్తా షాడో మీటింగ్ లో లేని అంశాన్ని తేవడంతో అతనిపై చర్యలకు సిపార్సు చేశామని దానికి ఉద్యోగులు ఎందుకు నిరసన చేస్తున్నారని ఆమె ప్రశ్నించారు. అధిష్టానికే ఫిర్యాదు చేసి మీపై అవిశ్వాసం పెడతామంటూ కౌన్సిలర్ నాగేంద్ర హెచ్చరించారు ఉద్యోగులు బ్లాక్ మెయిల్ చేస్తున్నారని నల్లబ్యాడ్జ్ లతో ఎందుకు నిరసనతెలుపుతున్నారని మీ రీయాక్షన్ కరెక్ట్ కాదని ఎమ్మెల్యే అయితాబత్తుల అనందరావు పేర్కొన్నారు. డ్రైన్ ఆవల వున్న పాత రైల్వే డి పి ఆర్ మార్చడం సాధ్యం కాదని కొత్త లైన్ ఎలా కుదురుతుందని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్య నారాయణ అన్నారు.

# అరటి కార్మికులకు ఉచిత బీమా సౌకర్యం,నమోదు ప్రక్రియ ప్రారంభించిన అధికారులు

**రావులపాలెం, మార్చి ,26, ( ప్రభాతవార్త ) :**
అరటి కార్మికులు కేంద్ర ప్రభుత్వం అసంఘటిత కార్మికులకు అందిస్తున్న ఉచిత భీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని అంబేద్కర్ కోనసీమ జిల్లా కార్మిక శాఖ అసిస్టెంట్ కమీషనర్ నాగలక్ష్మి, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి కె. విశాలాక్షి సూచించారు. రావులపాలెం అరటి మార్కెట్ యార్డులోని రైతు విశ్రాంతి భవనంలో గురువారం వారి పర్యవేక్షణలో అసంఘటిత కార్మికులకు ఉచిత బీమా నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి ఐ.రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రావులపాలెం మార్కెట్ యార్డులో



పనిచేస్తున్న అరటి ఎగుమతి, ప్యాకింగ్ జట్టు కార్మికులకు ఉచిత భీమా సౌకర్యం ఏర్పాటు చేయాలనే ఉద్దేశ్యంతో కేంద్ర కార్మిక శాఖ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమారు 150 మంది కార్మికులు పాల్గొనగా వారికి ఉచిత బీమా సౌకర్యం గురించి అవగాహన కల్పించారు. అప్పటికప్పుడు 16 మంది కార్మికులకు ఆన్ లైన్ లో బీమా వర్తించే విధంగా నమోదు చేసి కార్డులు పంపిణీ చేశారు. యార్డులోని కార్మికులందరికీ ఉగాది లోగా కార్డులు అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు సిబ్బంది వి.శ్రీనివాసు, జి.బి.వి.ప్రసాదు, జె. అలేఖ్య, మార్కెట్ యార్డు సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీశ్రీశ్రీ వేగులమ్మ అమ్మవారి సంబర మహోత్సవంలో పాల్గొన్న బత్తుల



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, మార్చి ,27, ( ప్రభాతవార్త ) :** సీతానగరం మండలం,మిర్తిపాడు గ్రామంలో ఘనంగా జరిగిన శ్రీశ్రీశ్రీ వేగులమ్మ అమ్మవారి సంబర మహోత్సవంలో పాల్గొని అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు కమిటీ కో-ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి నిర్వహించారు. అనంతరం బత్తుల వెంకటలక్ష్మిని శాలువాతో మహిళలు సత్కరించారు.ఈ కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ జన్మదినం సందర్భంగా రక్తదానం

**కాకినాడ, మార్చి ,27, ( ప్రభాతవార్త ) :** గ్లోబల్ స్టార్, హీరో రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా కాకినాడ సిటీ చిరంజీవి, పవన్ కళ్యాణ్, రామ్ చరణ్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రామ్ చరణ్ 40వ జన్మదిన సందర్భంగా గురువారం కాకినాడలోని రోటరీ బ్లడ్ బ్యాంకులో ఈ కార్యక్రమాన్ని ఫాన్స్ నగర అధ్యక్షుడు చింతకాయల చిన్ని ఆధ్వర్యంలో 35వ మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. హీరో రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి అభిమానులు పంచారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. భవిష్యత్తులో హీరో రామ్ చరణ్ పేరు మీదగా మరిన్ని



సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. ఆంధ్ర, తెలంగాణలో సేవా కార్యక్రమాలు తమ అభిమాన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు చింతకాయల చిన్ని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కామరాజు, అభిమానులు ఐ రవి, కోడి శ్రీను, సుబ్రహ్మణ్యం, కుమారస్వామి, సాడే ఆనంద్, రౌతు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి పై సమగ్ర దర్యాప్తు జరపాలి




**అమలాపురం , మార్చి ,27, ( ప్రభాతవార్త ) :** పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి పై సమగ్ర దర్యాప్తు జరపాలని కోనసీమ పాస్టర్లు,క్రైస్తవ సంఘాలు అమలాపురంలో ఆందోళన చేశారు.స్థానిక గడియార స్తంభం సెంటర్ నుండి చేపట్టిన ర్యాలీ కలక్టరేట్ వరకు నిర్వహించారు.అనంతరం కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేసారు.కోనసీమ పాస్టర్లు ప్లకార్డులతో చేపట్టిన ఈ ర్యాలీ లో పాస్టర్ ప్రవీణ్ మృతి పై అనుమానాలున్నాయని అది యాక్సిడెంట్ కాదు హత్య అని వేం భావిస్తున్నామంటూ నినాదాలు చేశారు.ప్రభుత్వం స్పందించి,మత స్వేచ్ఛను కాపాడాలని,క్రైస్తవులపై దాడులు అరికట్టాలని వారు డిమాండ్ చేశారు.

## మాచవరం ఉప సర్పంచ్ గా సాంబశివరావు ఏకగ్రీవ ఎన్నిక

**అంబాజీపేట, మార్చి ,27, ( ప్రభాతవార్త ) :** మాచవరం గ్రామపంచాయతీకి 2021లో జరిగిన ఎన్నికల్లో ఉపసర్పంచ్ ఎన్నికకు పెద్దల మధ్యవర్తిత్వంతో జెంటిల్మెన్ ఒప్పందం జరిగింది. ఉప సర్పంచ్ గా నాలుగేళ్లు ఒకరు, ఒక ఏడాది మరొకరు ఉండేలా ఒప్పందం కుదిరింది. దాన్లో భాగంగా నాలుగేళ్ల ఉప సర్పంచిగా పదవీ బాధ్యతలు నిర్వహించిన 2వ వార్డ్ సభ్యుడు సుంకర పేరయ్య నాయుడుఈ ఏడాది జనవరిలో రాజీనామా చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఉప సర్పంచ్ పదవికు స్థానిక పంచాయతీ కార్యాలయంలో గురువారం ఎన్నిక నిర్వహించారు. జెంటిల్మెన్ ఒప్పందంలో భాగంగా 14వ వార్డు సభ్యుడు మట్టపర్తి సాంబశివరావును ఉప సర్పంచ్ గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మెజార్టీ వార్డు సభ్యుల ఆమోదం



మేరకు సాంబశివరావు ఉప సర్పంచిగా ఎన్నికైనట్లు పంచాయతీ కార్యదర్శి కె.వి.వి.సత్యనారాయణ తెలిపారు. నూతనంగా ఎన్నికైన ఉప సర్పంచ్ సాంబశివరావును సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, వార్డు సభ్యులు, నాయకులు బొంతు పెదబాబు,శిరిగినీడి వెంకటేశ్వరరావు, మైపాల తాతాజీ, కొర్లపాటి గోపి, దొమ్మేటి సాయికృష్ణ, దొమ్మేటి రామారావు,నాగాబత్తుల సుబ్బారావు,దొమ్మేటి శ్యామ్, మట్టపర్తి శ్రీనివాసరావులు అభినందనలు తెలిపారు.

## పి వేమవరం ఉప సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవం



**సామర్లకోట, మార్చి ,27, ( ప్రభాతవార్త ) :** కాకినాడ జిల్లా సామర్లకోట మండలం పి వేమవరం గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నిక గురువారం జరిగింది. ఈ ఎన్నికల్లో 11 మంది వార్డు సభ్యులు పాల్గొనగా 7వ వార్డు సభ్యులైన మేడిది వీర రాఘవ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఎం ఎస్ ఎన్ రెడ్డి ధృవీకరించారు. అనంతరం ధ్రువీకరణ పత్రాన్ని మేడిది వీర రాఘవమ్మకు అందజేశారు నూతనంగా ఎన్నికైన ఉప సర్పంచును కూటమి నాయకులు వార్డు మెంబర్లు పూలమాలతో సత్కరించారు. ఎన్నిక ప్రశాంతంగా జరగడానికి పెద్దాపురం డిఎస్పి శ్రీహరి రాజు పరిరక్షణలో సామర్లకోట సి ఐ కృష్ణ భగవాన్ ఎస్ ఐ మూర్తి ఇతర పోలీస్ సిబ్బంది భద్రత ఏర్పాట్లు నిర్వహించారు. ఈ ఎన్నికలో కూటమి తెలుగుదేశం నాయకులు,బిజెపి నాయకులు, జనసేన నాయకులు పాల్గొన్నారు, ఈ సందర్భంగా ఉప సర్పంచ్ వీర రాఘవమ్మ తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు అందరకు పేరుపేరునా ధన్యవాదములు తెలియజేశారు.

## కొత్తపేట నూతన ఉప సర్పంచ్ గా ఎన్నికైన విల్ల మారుతీ

**కొత్తపేట రూరల్,, మార్చి ,27, ( ప్రభాతవార్త ) :** కొత్తపేట గ్రామ పంచాయితీ ఉప సర్పంచ్ గా నూతనంగా ఎన్నికైన విల్ల మారుతీ ప్రసాద్ ను స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అభినందించారు.పాలక మండలి సభ్యులంతా కలిసికట్టుగా పని చేసి ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు.అభివృద్ధి కూడా గ్రామంలో పూర్తి స్థాయిలో జరిగేలా కృషి చేయాలని ఎమ్మెల్యే సత్యానందరావు సూచించారు.ఈ కార్యక్రమంలో కంఠంశెట్టి శ్రీనివాస్, బూసి జయలక్ష్మి భాస్కరరావు,



బండారు బుల్లితాత,మిదే ఆదినారాయణ,ధరణాల రామకృష్ణ, బీర ఇస్సాక్, వాసంశెట్టి సత్యనారాయణ, పంచాయతీ పాలకవర్గం మరియు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎస్.టి.యు.ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు



**మామిడికుదురు,, మార్చి ,27, ( ప్రభాతవార్త ) :** స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్.టి.యు)మామిడికుదురు మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం స్థానిక బి.ఆర్.అంబేద్కర్ కమ్యూనిటీ భవనం నందు ముస్లిం ఉపాధ్యాయులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు.ఈ ఇఫ్తార్ విందు కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ మువ్వా రామలింగం,జిల్లా విద్యాశాఖాధికారి డా.షేక్ సలీం బాషా,డి.సి.ఇ.బి.కార్యదర్శి బీర హనుమంతరావు ,ఎం.ఇ.ఓలు లక్ష్మినారాయణ, వెంకన్నబాబు విశిష్ట అతిథులుగా విచ్చేశారు. ఎస్.టి.యు.జిల్లా నాయకులు పోతంశెట్టి దొరబాబు,నరిదే సత్య పల్లంరాజు,నెరేడుమిల్లి సత్యనారాయణ,నాగిరెడ్డి శివ ప్రసాద్,చొప్పల రాంబాబు,మట్టా నాగరాజు మండల అధ్యక్ష, కార్యదర్శిలు కారుపల్లి కళ్యాణ్ బాబు,కొమ్ముల వీర రాఘవరావు, ఆర్థిక కార్యదర్శి సయ్యద్ రజి,సయ్యద్ రూహి మండల పరిధిలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సత్య ప్రభ కృషితో రోడ్లకు మహర్దశ , రాష్ట్ర టిఎన్‌టియు సి ఉపాధ్యక్షులు శివ

**శంఖవరం, మార్చి ,27, ( ప్రభాతవార్త ) :** ప్రత్తిపాడుఎమ్మెల్యే సత్య ప్రభ రాజా సారథ్యంలో నియోజకవర్గ రోడ్లకు మహర్దశ పట్టిందని రాష్ట్ర టిఎన్టియుసి ఉపాధ్యక్షులు వెన్న శివ పేర్కొన్నారు శంకవరం మండలంలోని సీతయ్యమ్మపేట గ్రామంలో గల కమ్యూనిటీ హాల్లో గురువారం తెలుగుదేశం పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు రోడ్ల నిర్మాణం ద్వారా గ్రామాల మధ్య దూరం తగ్గి ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నారని నియోజకవర్గంలో చాలా రోడ్లు గత కొన్ని సంవత్సరాల నుంచి అభివృద్ధికి నోచుకోక అధ్వాన్నంగా తయారయ్యాయని, కూటమి




ప్రభుత్వం ఏర్పడ్డాక ఎమ్మెల్యే సత్య ప్రభ రాజా చొరవతో రోడ్లకు మహర్దశ కలిగిందని అన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా బీటీ రోడ్లు, సీసీ రోడ్లకు 15.83 కోట్లు మంజూరు చేయడం జరిగిందనీ , శంఖవరం మండలంలో జాతీయ రహదారి నుండి వజ్ర కూటం గ్రామానికి బీటీ రోడ్ నిర్మాణానికి 1.98 కోట్లు కొంతంగి కొత్తూరు అచ్చంపేట జి కొత్తపల్లి గ్రామానికి 2.0 కోట్లతో బీటీ రోడ్లు నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం జరిగిందని మండలంలో 80 లక్షలతో సిసి రోడ్లు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన 9 నెలల్లోనే గ్రామాల్లో అభివృద్ధిపై దృష్టి సారించి మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ లకు శంఖవరం మండల ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు. అనంతరం మండల పార్టీ అధ్యక్షులు బద్ది రామారావు నియోజకవర్గ యువత అధ్యక్షులు కీర్తి సుభాష్ ప్రసంగించారు ఈ సమావేశంలో పిర్ల అప్పారావు ,పోలం చిన్న మెరపల నరసయ్య గారు, బొమ్మిడి సత్తిబాబు , కరణం సుబ్రహ్మణ్యం గాబు సుభాష్ , ఈగల దేవుడు , కర్రి శివాజీ తదితరులు పాల్గొన్నారు.

## పుష్కర తాళ్లూరు లిఫ్టుకు మరమతులకై చంద్రబాబుకు వినతి -ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



**గండేపల్లి , మార్చి ,27, ( ప్రభాతవార్త ) :** పోలవరం ప్రాజెక్టు పనులపై సమీక్షా సమావేశం నిర్వహించేందుకు పోలవరం విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ను జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కలిసి పుష్కర ఎత్తిపోతల పథకం అంతర్భాగం తాళ్లూరు లిఫ్ట్ పి ఎస్ సి పైప్ లైన్లు పూర్తిగా పాడైపోవడంతో వాటి స్థానంలో ఎమ్మెస్(ఐరన్ పైపులు) పైప్ లైన్ శాంక్షన్ చేయమని వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ జగ్గంపేట నియోజకవర్గంలో పుష్కర ఎత్తిపోతల పథకంలో పోలవరం కాలువ 45 కిలోమీటర్ల నుండి 195 కిలోమీటర్ వద్ద గల తాళ్లూరు లిఫ్ట్ సంబంధించిన పి ఎస్ సి (సిమెంట్) పైప్ లైను పూర్తిగా పాడైపోవడం వల్ల గత సీజన్ లో 31000 ఎకరాలకు సాగునీరు అందక రైతుల పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయారని. ఈ లిఫ్టు యొక్క పైప్ లైన్ కు ఎమ్మెస్(ఐరన్ పైపు) పైప్ లైన్ వేయుటకు ఇరిగేషన్ అధికారులు 52 కోట్లు రూపాయలు అంచన వేసినారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో జగ్గంపేట వచ్చినప్పుడు పుష్కర రైతులు, నేను ఈ స్కీము రిపేర్ చేసి రైతులను ఆదుకోవాలని కోరగా చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎమ్మెస్ పైప్ లైన్లు వేసి పనులు పూర్తి చేసి రైతులకు నీరు అందిస్తానని హామీ ఇచ్చారని కావున 52 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేయించి రైతులను ఆదుకోవాలని వినతిపత్రం తో పాటు ఎస్టిమేట్ కాఫీ అందించామని ముఖ్యమంత్రి చంద్రబాబు కి, ఇరిగేషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సాయి ప్రసాద్ కిఅందించామని ముఖ్యమంత్రి చంద్రబాబు కి, ఇరిగేషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సాయి ప్రసాద్ కి,, నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కి వినతి పత్రం అందజేయడం జరిగిందని ఎమ్మెల్యే నెహ్రూ తెలిపారు. జ్యోతుల ఫౌండేషన్ సేవలను ప్రశంసించిన సిఎం చంద్రబాబు జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ చేసిన సేవా కార్యక్రమాలను చూసి అనేక మంది ముందుకు వచ్చి వరద బాధితులకు సహాయాలు అందించారని ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ చేస్తున్న సేవలను ఆయన ప్రశంసించారు.

## డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థుల ధర్నా

**కాకినాడ టౌన్, మార్చి , మార్చి ,27, ( ప్రభాతవార్త ) :** రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థుల పట్ల తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందని ప్రభుత్వం వెంటనే స్పందించి కోర్టు కేసులు క్లియర్ చేసి మెయిన్స్ పరీక్షల తేదీలను ప్రకటించాలని లేని పక్షంలో ఛలో విజయవాడ కార్యక్రమాన్ని చేపడతామని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి రామన్న రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గురువారం కాకినాడలో పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరుతూ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు. ముందుగా కాకినాడ నగరంలో బాలాజీ చెరువు సెంటర్ నుండి కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి రామన్న మాట్లాడుతూ గత ప్రభుత్వం 2022 నవంబర్ 28న 6100 పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చారని, జనవరిలో జరిగిన ప్రిలిమ్స్ పరీక్షకు 4.52 లక్షల మంది అభ్యర్థులు హాజరైనట్లు చెప్పారు. ఇందులో 92 వేల మంది అర్హత సాధించారని, రెండేళ్ల సుదీర్ఘ పోరాటం తర్వాత ఫీజికల్ ఈవేంట్స్ నిర్వహించారన్నారు. ఇప్పుడు కోర్టు కేసులు క్లియర్ చేసి మెయిన్స్ పరీక్షలు నిర్వహించాలని రామన్న డిమాండ్ చేశారు. ఇప్పటికే పోలీస్ శాఖలో 20వేలు పోస్టులు ఖాళీగా ఉన్నాయని మరి వాటి సంగతి ఏమిటని ప్రశ్నించారు. గత మూడేళ్లుగా నిరుద్యోగులు కోచింగ్ ఫీజులు, రూం అద్దెలు కట్టలేక, పుస్తకాలు కోనలేక, భార్యను, కుటుంబాన్ని వదిలేసి చదువుకుంటుటే రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గు చేటన్నారు. యువగళంలో లోకేష్ ఇచ్చిన మాట



నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ప్రశ్నిస్తానన్న పవన్ కళ్యాణ్ అధికారంలోకి రాగానే గొంతు మూ గబోయిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులకు కోర్టు కేసులు క్లియర్ చేసి మెయిన్స్ పరీక్షల తేదీలను ప్రకటించాలని కోరారు. డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పిడి ప్రసాద్, జిల్లా నాయకులు టి రాజాలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నిరుద్యోగ యువతతో ఆటలు ఆడుతోందన్నారు. పది నెలల్లో ఎన్ని నోటిఫికేషన్లు ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల పట్ల ఇలాగే వ్యవహరిస్తే పెద్ద ఎత్తున పోరాటానికి దిగుతామని హెచ్చరించారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాకి అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులు పవన్, నాయుడు, వేణుగోపాల్, ప్రవీణ్, వినీత్, సురేష్, హరీష్ కుమార్, జగన్, రామారావు, కృష్ణ, జగన్నాథరావు, పూర్ణ, శ్యాంబాబు వందలాదిమంది పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంతో రైతులకు బహుళ ప్రయోజనాలు - ఏఓ సద్గురు మూర్తి



**గండేపల్లి , మార్చి ,27, ( ప్రభాతవార్త ) :** ప్రకృతి వ్యవసాయంతో రైతులకు బహుళ ప్రయోజనాలు ఉన్నాయని మండల వ్యవసాయ శాఖాధికారి సద్గురు మూర్తి అన్నారు. ప్రకృతి వ్యవసాయం చేయు రైతులకు 2025-26 ఖరీఫ్ ప్రణాళిక చేయుటకు మండల స్థాయి వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం మండలపరిషత్ కార్యాలయం లో మండల వ్యవసాయ అధికారి సద్గురుమూర్తి అధ్యక్షతన జరిగింది. ప్రస్తుతం మనం రసాయన వ్యవసాయం వల్ల పెద్ద ప్రమాదంలో ఉన్నాం. ఈ ప్రమాదం ఒక్క రైతే అనుభవించడు, ఆ రసాయన వ్యవసాయం వల్ల ప్రతి ఒక్కరికి ప్రమాదమే అందువల్ల మనమందరం ప్రతి ఒక్క శాఖ ఈ ప్రకృతి వ్యవసాయంను ప్రతి రైతు చేసేటట్లు చూడవలసిన బాధ్యత మన అందరికీ ఉంది. మన గ్రామం స్థాయిలో జరిగే కెఏపి ప్రక్రియకు సహకరించాలి స్వయం సహాయక సంఘలలో ఉన్న సభ్యులు సంఘంలో లేని రైతులకు ప్రకృతి వ్యవసాయ ఖరీఫ్ ప్రణాళికలు 2025 - 26 చేస్తున్నాం కనుక ప్రతి రైతు ప్రతి సభ్యులు ఖరీఫ్ ప్రణాళికలు 365 రోజులు పంటలు ఉండేటట్లు అందరి రైతులు పిఎమ్.డిఎస్ వేసే విధంగా అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కె మహేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో-ఆర్డినేటర్ వై గణేష్, మాస్టర్ ట్రైనర్ భాస్కరరావు, రమ్య, వ్యవసాయం, ఉద్యాన సహాయకులు, ఐసీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

## దశాబ్దకాల రోడ్లకు మోక్షం కల్పించిన ఎమ్మెల్యే

**రౌతులపూడి , మార్చి ,27, ( ప్రభాతవార్త ) :** దశాబ్ద కాలం నుండి అధ్వానం ఉన్న మండలంలోని పలు రోడ్లకు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ మోక్షం కల్పించారని రాష్ట్ర కొప్పుల వెలమ సంఘం డైరెక్టర్ పైల సాంబశివరావు విలేకర్ల సమావేశంలో తెలిపారు. గురువారం స్థానిక భవాని కన్వెన్షన్లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సిసి రోడ్ల నిర్మాణానికి రూ 85 లక్షలు మంజూరు చేశారన్నారు. అంతేకాకుండా లచ్చిడిపాలెం నుండి ఎన్. ఎన్. పట్నం కు బిటి రోడ్డు నిర్మాణానికి రూ 2.60 కోట్లు, రౌతులపూడి,గిడజాం రోడ్డు నుండి బేబీ పట్నం గ్రామం మీదుగా లచ్చిడిపాలెం కు బిటి రోడ్డు నిర్మాణానికి రూ 1.80 కోట్లు, రాజవరం నుండి దిగువ శివాడకు బిటి రోడ్డు నిర్మాణానికిరూ 1 కోటి, రాజవరం నుండి గంగవరం కు బీటీ రోడ్ నిర్మాణానికి రూ 60 లక్షలు మంజూరు చేయించారన్నారు. త్వరలో ఈ పనులు ఎమ్మెల్యే చేతుల మీదుగా శంకుస్థాపన చేసి ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సొంత నిధులతో రెండు నెలల జీతాల చెల్లింపు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో , మార్చి ,27, ( ప్రభాతవార్త ) :** పురుషోత్తమ పట్నం శ్రీ సత్యసాయి త్రాగునీరు యూనియన్ ఉద్యోగుల సమస్య పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందని, సాధ్యమైనంత తొందరలో జీతాలు చెల్లింపు, పి ఎఫ్ బకాయిల చెల్లింపులు ఏజెన్సీస్ చెల్లించే నిధుల నుంచి నేరుగా జరపడం పై దృష్టి పెట్టడం జరుగుతుందని రాష్ట్ర పర్యటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ , జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి తెలియ చేశారు. గురువారం స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహంలో శ్రీ సత్యసాయి డ్రింకింగ్ వాటర్ వర్కర్స్ యూనియన్, పురుషోత్తపట్నం ఉద్యోగ సంఘాల ప్రతినిధులకు రెండు నెలల జీతం రూ.20 లక్షల చెక్కును కలెక్టర్ పి ప్రశాంతి, ఎమ్మెల్యే బత్తుల బలరామ కృష్ణ లలో కలిసి అందచేశారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ



మీ సమస్య పై పూర్తి అవగాహనా ఉందని తప్పనిసరి గా పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఈ విషయమై సానుకూలంగా , వ్యక్తీగతంగా స్పందించినట్లుహా తెలియ చేశారు. చిత్తశుద్ధి ఉండడం వల్ల ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తన సొంత నిధులతో రెండూ నెలల జీతం చెల్లించడం జరిగిందన్నారు. మీ సమస్య పరిష్కారం కోసం ఉప ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి సానుకూలత వ్యక్తం కావడం, జీత భత్యాల చెల్లింపు కు అవసరమైన రూ.20 లక్షలు చెల్లించడం జరిగిందన్నారు. వేసవి దృష్ట్యా త్రాగునీరు సరఫరా విధానం ఎటువంటి ఆటంకం ప్రజలకి త్రాగునీరు సరఫరా ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. త్వరలోనే మీకు అన్ని విధాలుగా న్యాయం జరిగేలా, పిఎఫ్ చెల్లింపు సమస్య కూడా పరిష్కారం అయ్యే విధంగా చర్యలు చేపట్టనున్నట్లు శాసన సభ్యులు బత్తుల బలరామ కృష్ణ పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి మాట్లాడుతూప్రభుత్వం నుంచి ఏజెన్సీస్ కు చెల్లింపులు జరిగే సందర్భాల్లో పిఎఫ్ చెల్లింపు జరగడం పై నిర్దుష్టమైన నిర్ణయం ప్రభుత్వం ద్వారా తీసుకునే అవకాశం ఉందని, ఆమేరకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇటువంటి సమస్య పునరావృతం కాకుండా చూడనున్నట్లు తెలియ చేశారు. వేసవి దృష్ట్యా ప్రజలకి నీటి సరఫరా విధానం లో ఎటువంటి ఆటంకం లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్న రాముడు, జిల్లా ఆర్డబ్ల్యూఎస్ సూపరిండెంట్ ఇంజనీరు బీ.వి.గిరి,శ్రీ సత్యసాయి త్రాగునీరు యూనియన్ ఉద్యోగ సంఘాల నాయకులు అధ్యక్షులు కట్టమూరి వీరబాబు, జనరల్ సెక్రటరీ ఉందుర్తి ఇస్సాక్ తదితరులు పాల్గొన్నారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408.
RNI No.64863/96,“Editor : *Damerla Sai Baba, *Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps

28- 3pg 9 chel:28- 3pg 9 chel.qxd 3/27/2025 4:56 PM Page 1





# విద్యార్థుల ఖర్చు కోసం..

ఆ అమ్మాయి ఇంజినీరింగ్ సెకండ్ ఇయర్ చదువుతోంది. ఖర్చులకోసం నెలకు రూ.6 వేలు ఇస్తారు ఇంట్లో. కానీ 20వ తేదీ వచ్చేసరికి వాలెట్ ఖాళీ అయిపోతుంది. డబ్బులంటూ ఇంట్లో మళ్లీ అడుగుతుంది. ఈ పరిస్థితి అమ్మానాన్నల్ని అసహ నానికి గురిచేస్తుంటుంది. విద్యార్థులేమో ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు ఎంజాయ్‌మెంట్ అంటే. తల్లిదండ్రులేమో డబ్బు విలువ తెలుసుకునేది ఇంకెప్పుడు అంటారు ఈ సమస్యకు పరిష్కారమేంటి? కాలేజీ అంటేనే రంగుల ప్రపంచం. చదువుల్తో పాటు బేనా.. స్నేహితులూ, సరదాలూ, ఫ్యాషన్లూ, సినిమాలూ, షికార్లు, షాపింగ్‌లూ, వారాంతపు విహారాలూ! వాటితోపాటే ఆర్థిక సవాళ్లు. పిల్లలకు చెలగాటం తల్లిదండ్రులకు ప్రాణసంకటంలా ఉంటుంది పరిస్థితి. ఇది అదుపు తప్పకుండా జాగ్రత్తపడాల్సిందే !

**తల్లిదండ్రులు ఏం చేయాలంటే..**

1 పిల్లల్ని బడ్జెట్ వేసుకోమనండి. అవసరాలు, పొదుపు, సరదాలు... మూడు విభాగాలుగా ఖర్చులను విభజించుకోమనండి.

2. స్నేహితుల్తో తరచూ ఒకరు సినిమా అంటే, మర్నాడు ఇంకొకరు షాపింగ్ అంటారు. అన్నింటికీ సిద్ధమైపోకుండా జాగ్రత్త పడమనాలి. వీటికి వెళ్లకపోవడం త్యాగం కాదు, తెలివైన నిర్ణయం. సమయం, డబ్బు రెండూ ఆదా అని వివరంగా చెప్పండి.

3. చాలా వరకు పైచదువులకు రుణాలు తీసుకుంటున్నారు. డిగ్రీ పూర్తవగానే ఈఎంఐలు మొదలవుతుంటాయి. అందుకు ఆర్థిక క్రమశిక్షణ అవసరమని చెప్పండి.

**విద్యార్థులు ఏం చేయాలంటే..**

1. ఔటింగ్స్ కోసం కొంత మొత్తం అనుకుని దాన్నే ఖర్చు చేయండి అంటుంది:

2. మీ బడ్జెట్ సహకరించకపోతే, బెస్ట్ ఫ్రెండ్ అయినా ఈసారి కుదరదు, తర్వాత చూద్దామని చెప్పండి.

3. చదువు పూర్తవగానే లోన్ తీర్చాలి. అంటే ఉద్యోగం తప్పనిసరి. చదువు ప్రాధాన్యాన్ని అర్థం చేసుకోండి. చదువు, ఉద్యోగం, డబ్బు... వీటి విషయంలో ప్రణాళిక, క్రమశిక్షణతో ఉండండి.

4. ఖర్చులకు తల్లిదండ్రులు ఇచ్చిన మొత్తం నెలాఖరుకు రూ.500 మిగిల్చి చూడండి. ఎంత సంతృప్తినిస్తుందో?

5. ఆర్థిక విషయాలు నేర్చుకోవడానికి కాలేజీ రోజులకి మించిన సమయం ఉండదు. నేటి పొదుపు బాట, రేపటికి ఆర్థిక బాసట.

# దేశ ప్రథమ మహిళా నేర పరిశోధకురాలు !

నేరాలను గుర్తించడం, దర్యాప్తు చేయడం మరియు న్యాయ నిర్వహణలో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం భారతదేశానికి కొత్తేమీ కాదు. మన పూర్వీకులకు ప్రస్తుత రూపంలోని నేర పరిశోధక సాంకేతికత (ఫోరెన్సిక్ సైన్స్) తెలియకపోయినా, నేర పరిశోధనలో వారు ఏదో విధమైన శాస్త్రీయ పద్ధతులు అనుసరించినట్లు అనిపిస్తుంది. దీని వివరణాత్మక ప్రస్తావన 2300 సంవత్సరాల క్రితం వ్రాయబడిన కౌటిల్యుని అర్థశాస్త్రంలో ఉండటం భారతీయులుగా మనందరికీ గర్వకారణం. భారతీయులు వేల సంవత్సరాల క్రితమే హస్త (పామిస్ట్రీ) రేఖల యొక్క వివిధ నమూనాలను అధ్యయనం చేశారు. తరతా అని పిలువబడే వేలి ముద్రలు నకలు చేసేందుకు వీలు కానివి (ప్రత్యేకమైనవి) అని భారతీయులకు అనాది కాలంగా తెలుసు. శతాబ్దాల క్రితం నుండి, ఏ ఒక్క వ్యక్తి యొక్క వేలి ముద్రలు కూడా మరే ఇతర వ్యక్తితో పోలి ఉండవు అన్న విషయం శాస్త్రీయంగా నిరూపించబడే వరకు, భారతదేశంలో నిరక్షరాస్యులైన ప్రజలు వేలిముద్రలను సంతకాలుగా ఉపయోగించడం కొంతమంది ఆధారంగా మాత్రమే పరిగణించారు. అయితే ఫోరెన్సిక్ సైన్స్ లేదా నేర పరిశోధన పురుషులకు మాత్రమే అనుకూలం పూర్తిగా నిర్ణీతం. ఈ రంగంలో స్త్రీ- పురుషులకు సమానావకాశాలు ఉంటాయన్నది అక్షర సత్యం.

**దేశ ప్రప్రథమ మహిళా నేర పరిశోధకురాలు:** డాక్టర్ రుక్మిణి కృష్ణమూర్తి భారతదేశపు తొలి మహిళా ఫోరెన్సిక్ శాస్త్రవేత్త లేదా నేర పరిశోధకురాలు. చాలా మందికి ఫోరెన్సిక్ సైన్స్ (నేర పరిశోధన) అంటే ఏమిటో కూడా తెలియని సమయంలో ఆమె ఈ రంగంలోకి ప్రవేశించారు. ఆమె స్నేహితుడు ఒకరు ఆమె కళాశాలలోని కెమిస్ట్రీ ల్యాబ్‌ను ఫోరెన్సిక్ పరిశోధన కోసం ఉపయోగించడంతో, ఆమెలో కూడా ఈ అంశం పై ఆసక్తి పెరిగి, 1974లో బొంబాయిలోని ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీలో సాధారణ రీసెర్చ్ అసిస్టెంట్ గా చేరి 2008లో పదవీ విరమణ చేసేనాటికి సంస్థ డైరెక్టర్ గా ఎనిమిది సంవత్సరాలు విధులు నిర్వహించారు. 1974లో సంస్థలో చేరినపుడు ఆమె ఏకైక మహిళా ఉద్యోగిని అయినప్పటికీ, లాబొరేటరీ వీడి వెళ్లిపోయినప్పుడు మొత్తం సిబ్బందిలో 20 శాతం మహిళలు ఉండడం విశేషం. ప్రస్తుతం డాక్టర్ రుక్మిణి ముంబైలోని హెలిక్ అడ్వైజరీ లిమిటెడ్ చైర్ పర్సన్ మరియు ముఖ్య కార్య నిర్వహణాధికారి (సిఈఓ) మాత్రమే కాక గుజరాత్‌లోని నేషనల్ ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్సిటీలో అకడమిక్ కౌన్సిల్ సభ్యురాలు. ఆమె పీహెచ్‌డీ విద్యార్థులకు మార్గదర్శనం చేయడంతో పాటు ఫోరెన్సిక్ సైన్స్ పై రెండు పుస్తకాలు కూడా రాసింది. ఫోరెన్సిక్స్‌ను కెరీర్‌గా ఎందుకు ఎంచుకున్నారు అన్న ప్రశ్నకు సమాధానంగా డా రుక్మిణి కృష్ణమూర్తి, తనకు రసాయన శాస్త్రంలో (కెమిస్ట్రీ) మాస్టర్స్ డిగ్రీ ఉండగా, తాను మూడు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోగా అన్నింటిలోనూ తనకు ఉద్యోగం వచ్చిందని తెలిపారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నాకు క్లర్కల్ ఉద్యోగం, ముంబైలోని ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీలో టీచింగ్ ఉద్యోగం మరియు రీసెర్చ్ అసిస్టెంట్ ఉద్యోగం వచ్చాయి అని తెలిపారు. ఆమె నాగ్‌పూర్‌లో ఎం.ఎస్సీ చేసింది. ఆమె కుటుంబ సభ్యుల వ్యతిరేకత ఉన్నప్పటికీ, తన సోదరుడి మద్దతు, ప్రోత్సాహంతో చివరికి ఫోరెన్సిక్ లాబొరేటరీలో చేరింది. ఈ రంగంలో అమ్మాయిలు పనిచేయడం కష్టం, ఇక్కడ మీరెందుకు చేరాలనుకుంటున్నారని అప్పటి ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ ఆమెను అడగ్గా తనకు ఈ రంగంలో ఆసక్తి ఉందని ఆమె స్థిరంగా బదులిచ్చారు. నియామక లేఖలో, ఆమెకు కేటాయించిన విధి నేరం జరిగిన ప్రదేశాన్ని మరియు అవస రాన్ని బట్టి కోర్టును సందర్శించడం. కానీ డైరెక్టర్ మొదట్లో ఆమెను అనుమతించలేదు. అబ్బాయిలు కుటుంబానికి ఎక్కువ మద్దతు ఇస్తారని, అమ్మాయిలు భారమని ఆమె కుటుంబం కూడా నమ్మింది. డాక్టర్ రుక్మిణి మహారాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఆరు ప్రపంచ స్థాయి ఫోరెన్సిక్ ప్రయోగశాలలను స్థాపించారు, డిఎన్ఏ, మెదడు వేలిముద్రలు, నార్కోఅనాలిసిస్, లై డిటెక్టర్, సైబర్ ఫోరెన్సిక్, టేప్ ఆథెంటికేషన్, స్పీకర్ ఐడెంటిఫికేషన్ మరియు ఫోరెన్సిక్ క్లినికల్ టాక్సికాలజీ వంటి కొత్త పద్ధతులను ప్రవేశపెట్టారు. ప్రస్తుతం, ఆమె ముంబైలోని హెలిక్ అడ్వైజరీ లిమిటెడ్ చైర్‌పర్సన్ మరియు సిఈఓ. విధి నిర్వహణలో



భాగంగా తాను చేపట్టిన మొదటి కేసు వరకట్న మరణం అని తెలిపారు. ఫిబ్రవరి 13, 1976న జరిగిన భయంకర మైన మాతుంగ రైలు అగ్నిప్రమాదం కేసు గురించి మాట్లాడుతూ ఆ సంఘటనలో 24 మంది ప్రయాణికులు మరణించి నట్లు తెలిపారు. తాను కూడా ఒక సభ్యురాలిగా ఫోరెన్సిక్ బృదం అప్పుడు చేపట్టిన విచారణలో ఒక ప్రయాణీకుడు కిరోసిన్ నిండిన ప్లాస్టిక్ డబ్బాతో ప్రయాణిస్తుండగా అందులోని కిరోసేన్ లీక్ కావడాన్ని గమనించక పోవడం, వేరొక ప్రయాణీకుడు అశ్రద్ధగా కాల్చేసిన సిగరెట్ ముక్కను విసిరినప్పుడు మంటలు చెలరేగినట్లు నిర్ధారణ అయినట్లు తెలిపారు. ఈ సంఘటన అనంతరం, తమ సలహా ప్రకారం ప్రజా రవాణా వ్యవస్థలో పెట్రోల్, కిరోసిన్ వంటి మండే స్వభావం గల వస్తువులను తీసుకెళ్లడంపై ప్రభుత్వం నిషేధం విధించినట్లు ఆమె తెలిపారు.

**1993 ముంబై బాంబు పేలుళ్ల కేసు:** 1993 ముంబై బాంబు పేలుళ్ల తర్వాత జరిగిన విధ్వంసాన్ని కళ్ళారా చూసిన ప్రత్యక్ష సాక్షి ఆమె. ఆ రోజు ఉగ్ర దాడి కారణంగా ముంబైలో వరుస బాంబు పేలుళ్ల జరిగినప్పుడు, ఆసుపత్రిలో యాంజియోప్లాస్టీ చేయించుకుంటున్న తన సోదరుడిని కలవడానికి వెళుతున్న ఆమె దారిలో హృదయవిదారకమైన అనేక మంది మృతదేహాలను గమనించి విస్మయం చెందింది. ముంబై ఫోరెన్సిక్ లాబొరేటరీ డిప్యూటీ డైరెక్టర్ పదవిలో ఉన్న ఆమె మరుసటి రోజు ఉదయం పని ప్రారంభించారు. మొదట బాంబు పేలుడు జరిగిన అన్ని ప్రదేశాల నుండి నమూనాలను సేకరించి వాటిలో సాధారణమైన విషయం ఏమిటో కనుగొని, ఆ తరువాత ఒకసమగ్ర నివేదికను రూపొందించడానికి మూడు నెలలు కష్టపడి పనిచేశామని తెలిపారు. ఈ కుట్రలో ఉగ్రవాదులు ఒక స్కూటర్‌లో అమర్చిన బాంబు పేలలేదు. ఉగ్రవాదులు 20 కిలోల ఆర్డీఎక్స్‌ను ఇనుప ముక్కలతో కలిపి ఉపయోగించారు. అవి పేలినప్పుడు తూటాల లాగా పనిచేస్తాయి. ఒకే ఒక్క బాంబుతో దాదాపు 20 కార్లు దెబ్బతిన్నాయి. ఒక కారు ఇంజిన్ సాధారణ కాగితంలాగా కత్తిరించబడిందని, దీనిని బట్టి మానవ శరీరంపై దాని ప్రభావాన్ని ఊహించవచ్చని ఆమె తెలిపారు. ముంబై ఫోరెన్సిక్ లాబొరేటరీ తరువాత బాంబు పేలుళ్లను దర్యాప్తు చేసిన ఇంటర్‌పోల్ కూడా ఆమె మరియు ఆమె బృందం సభ్యులు తయారు చేసిన నివేదికను ప్రశంసించింది. దర్యాప్తు కోసం అనుసరించిన సాంకేతికత మరియు పద్ధతి అంతర్జాతీయ కార్యనిర్వహణ పద్ధతికి అనుగుణంగా ఉందని, డాక్టర్ రుక్మిణి మరియు ఆమె బృందానికి అభినందనలు తెలిపింది. తరువాత 2000వ సంవత్సరం తొలినాళ్ళలో జరిగిన స్టాంపు పేపర్ల కుంభకోణానికి సంబంధించిన అబ్దుల్ కరీం తెల్గి కేసులో డాక్టర్ రుక్మిణి కూడా ముఖ్యమైన పాత్ర పోషించారు. ఈ కేసులో నేరస్థుడు ప్రభుత్వ ముద్రలను ఉపయోగించడంతో నేర నిరూపణకు చాలా శ్రమించాల్సి వచ్చిందని తెలిపారు. మూడు సంవత్సరాలు శోధించి నేరస్తుడు ఉపయోగించిన కాగితం ప్రభుత్వ పత్రం కంటే భిన్నంగా ఉందని తాము కనుగొన్నామని తెలిపారు. ఇందుకు గాను సుప్రీంకోర్టు వారి పనితీరును ప్రశంసించిందన్నారు. నక్సలైట్లు దాడిలో, ఆమె దాడి చేసిన వారి లాలాజలం ఉన్న రుమాలు నుండి డిఎన్ఏ నమూనాలను సేకరించి నేర నిరూపణ చేయడంతో పాటు ఆ తరువాత ఆమె అనేక హత్య రహస్యాలను ఛేదించారు. అంతేకాదు, ఆమె ఎసిటిక్ అన్హైడ్రేట్ అమ్మకాలను నియంత్రించడం ద్వారా మాదకద్రవ్యాల వ్యాపారాన్ని నియంత్రించడంలో కీలక పాత్ర పోషించారు. 2008లో జరిగిన నీరజ్ గ్రోవర్ హత్య కేసు గురించి వివరిస్తూ, టీవీ తారల పాత్ర కూడా ఉన్నందున ఇదొక హై ప్రొఫైల్ కేసు అని ఇందులో నేరస్థులు బాధితుడిని చంపి, అతని శరీరాన్ని ముక్కలుగా చేసి, ఆపై అడవిలో నిప్పంటించారు. గదిలోని రక్తపు గుర్తులను గుర్తించకుండా ఉండేందుకు వారు గోడకు పెయింట్ వేసినప్పటికీ గోడపై మరియు కారులో బాధితుడి రక్తపు మరకలను తాము కనుగొనడంతో ఇది హత్య అని నిర్ధారించడానికి తమకు సహాయపడిందన్నారు. 26/11, 2008 నాటి ఉగ్రదాడి విచారణ కూడా డా రుక్మిణి ఆద్వర్యంలో జరగడం గమనార్హం. సామాజిక సేవ:ప్రస్తుతం ఆమె సామాజిక కార్యకలాపాలలో మరియు ప్లాస్టిక్ రహిత ప్రపంచం కోసం మద్దతు ఇచ్చే సంస్థలలో, పేద కుటుంబాల పిల్లలకు విద్య రుసుములను అందించడం మొదలైన వాటిలో చురుకుగా పాల్గొంటున్నారు. వన్యప్రాణుల ఫోరెన్సిక్స్‌పై ఆమె అభిప్రాయాల గురించి అడిగినప్పుడు, మన దేశంలో ఈ సామర్థ్యాన్ని అభివృద్ధి చేయవలసిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. చట్టపరమైన ప్రక్రియలలో ఆధారాలకు సంబంధించి మానవ ఫోరెన్సిక్ విశ్లేషణ అంటే ఏమిటో బాగా నిర్వచించబడిన ప్రమాణాలు ఉన్నప్పటికీ వన్యప్రాణుల ఫోరెన్సిక్ కేసులను పరిష్కరించడానికి అవసరమైన మోర్ఫోమెట్రీ, మాలిక్యులర్ లాంటి ఇతర పద్ధతుల ఆధారంగా జాతుల వివిధ జంతు సమూహాలను గుర్తించడానికి సాంకేతికత ఇంకా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. డాక్టర్ రుక్మిణి కృష్ణమూర్తి సాధించిన విజయాలు దేశంలోని మరెందరో యువతులకు మరియు మహిళలకు ప్రేరననిస్తుందని ఆశిద్దాం.

**- యేచన్ చంద్ర శేఖర్**





# రెండువరుసలు పెండెంట్లు


ఈతరం కొత్తదనాన్నే కాదు...
మినిమలిజాన్నీ తెగ ఇష్ట పడుతోంది. అందుకే, వారిని మెప్పించేందుకు నగలెన్నో నవ్యమైన హంగుల్ని అద్దుకుని మార్కెట్లోకి వచ్చేశాయి. వాటిలో ఇప్పుడు 2 లేయర్డ్ చెయిన్లో హవా. పాశ్చాత్య శైలిని అనుకరిస్తూ సంప్రదాయ సొబగుల్ని అద్దుకుని అందంగా వచ్చేశాయి. యువత మనసుని కొల్లగొట్టేశాయి. రెండు వరుసల్లో రెండు పెండెంట్లు వీటి ప్రత్యేకత. కొన్ని దుస్తుల మీదకు ఈ గొలుసులు కనీ కనిపించనట్లే ఉంటాయి. జతగా మారి ధగధగలాడిపోతాయి. మనకి కావలసింది అదే కదా అంటారా? అవును మీలా సరికొత్త రకం జ్యూయెలరీని కోరుకునే వారికోసమే ఇవి. సింపుల్గానూ, స్టైలిష్‌గానూ సందడి చేస్తోన్న ఈ డిజైన్లను మీరూ ఓసారి చూసేయండి.



















# తేన్పులతో ఇబ్బందా ..

తేన్పులతో కొన్నిసార్లు చాలా ఇబ్బందిగా ఉంటుంది. కడుపు, చాతీలో మంటగా అనిపిస్తుంది. తిన్న ఆహారం అరగదు. అస్తమానూ తేన్పులూ వస్తుంటాయి. ఈ సమస్యకు లవంగాలు చక్కని పరిష్కారాన్ని చూపిస్తాయి. వీటిని తినడం వల్ల నోట్లో లాలాజలం ఎక్కువగా ఊరుతుంది. జీర్ణక్రియ మెరుగుపడుతుంది.

✦ తలనొప్పి, సైనస్, జలుబుల నుంచీ ఉపశమనం కలిగిస్తాయి.

✦ రోగ నిరోధక వ్యవస్థనూ మెరుగుపరుస్తుంది.



# కన్నడిగుల దిల్‌పసంద్

దీనికి దిల్కుష్ అనే పేరు కూడా ఉంది. ఇది దేశమంతా ప్రసిద్ధమైనా పుట్టింది. కర్ణాటకలో. దీన్నెలా చేస్తారంటే. ముందుగా రెండు కప్పుల మైదా, అరకప్పు పాలు, పెళ్లి అరచెంచా డ్రై ఈస్ట్, పంచదార, నూనె రెండు టేబుల్ స్పూన్ల చొప్పున, రుచికి తగినంత ఉప్పు వేసి పన్నెండు, బాదంపప్పులు ఐదారు, పావుచెంచా యాలకులపొడి వేసి కలపాలి. పిండిని రెండు భాగాలు చేసి మందమైన రొట్టెలుగా వత్తుకోవాలి. ఒక రొట్టెను అవెన్ సేఫ్ ప్లేటు మీద ఉంచి, కొబ్బరి స్టఫింగ్ను అంచుల దగ్గర కాస్త వదిలేసి.. మిగిలిన భాగంలో సమానంగా పరవాలి. రెండో రొట్టెను దాని మీద ఉంచి, అంచులను సీల్ చేసినట్టుగా కలపాలి. అరగంట అలా ఉంచేస్తే రొట్టె ఉబ్బి, రెట్టింపు సైజు అవుతుంది. దాని మీద చెంచా పాలు పోసి.. మధ్యలో ఇంటూ మార్క్ గాటు.. ప్రీహీట్ చేసి అవెన్‌లో 180 డిగ్రీలు పెట్టి అరగంట బేక్ చేయాలి. బయటకు తీసి టేబుల్స్పూన్ వెన్నను. సిలికాన్ కుంచెతో అద్దినట్లు చేయాలి. పది నిమిషాల తర్వాత స్లైసులుగా కట్ చేసుకోవాలి. వీటిని గోరు వెచ్చగానూ తినొచ్చు. కొంతసేపు ఫ్రిజ్‌లో ఉంచి చల్లగానూ తినొచ్చు.

# నెమ్మది నెమ్మదిగా నేర్పించండి..

**ప్రశ్న:** మా అబ్బాయి చదువులో వెనకబడుతున్నాడు. వయస్సు 11 ఏళ్ళు పూర్తియ్యాయి. ఆరవ తరగతి పూర్తిచేసుకుని ఏడవ తరగతికి వెళుతున్నాడు. అతి కష్టం మీద ఆరవ తరగతి దాటిస్తున్నాము. తరగతులు పెరిగే కొద్ది మరింత జఠిలం అయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. అతనికి చదివింది సరిగా గుర్తు ఉండదు. ఇప్పుడు చదివింది కొద్ది సమయం తరువాత చెప్పలేడు. పుస్తకం ముందు కూర్చుంటాడు తప్పచదువుపై ఏకాగ్రత నిలపలేడు. ఒక్కోసారి అతను మూడవ తరగతి విద్యార్థిలా కనిపి స్తాడు. చదవడం నేర్చుకోవడం పట్ల శ్రద్ధ చూపడు. చదువు పట్ల విసుగు నిర్లక్ష్యం ప్రదర్శిస్తుంటాడు. అయితే పిల్లలు అందరితో కలసి సరదాగా ఆడుకుంటాడు. పొలం పనులు బాగా చేస్తాడు. మా ఆవులకు వాటి దూడలకు గడ్డి వేయడం, నీళ్ళు పెట్టడం లాంటి పనులు చాల శ్రద్ధగా చేస్తాడు. అయితే చదువు అనగానే అతనిలో మంద కొడితనం కనిపి స్తోంది. పాఠశాల టీచర్ల సలహాతో పట్టణం వెళ్ళి న్యూరాలజిస్టుకు చూపించాము. అతను అన్ని పరీక్షలు చేసి లోపం ఏదీ లేదన్నారు. మా అబ్బాయి స్లో లెర్నర్ కాబట్టి శ్రద్ధ చూపమని సలహా ఇచ్చారు. అలాగే అభ్యసనలోపాలను సరిదిద్దే అనుభవం ఉన్న మానసిక నిపుణులకు చూపమన్నారు. మాది దిగువ మధ్య తరగతి కుటుంబం. నేను మావారు ఇద్దరం ఇంటర్‌వరకు చదువుకున్నాము. మాది మేనరికం కాబట్టి ఇలాంటి సమస్యలు వస్తాయని కొందరు చెప్పారు. అయితే నాలాగే మా బంధువులలో చాల మంది మేనరిపు వివాహాలు చేసుకున్నారు. వారిపిల్లలు అంతా బాగున్నారు. అయితే మా అబ్బాయికి పదేళ్ళ వయస్సు వచ్చేవరకు ఊపిరి తిత్తుల్లో నిమ్ము చేరేది డాక్టర్లు ఇచ్చిన మందులు వాడటం వల్ల ఇప్పుడు తగ్గిపోయింది. మా అబ్బాయిని బాగా చదివించి ప్రయోజకుని చేయడానికి తగిన సూచనలు ఇవ్వండి. **- ఒక సోదరి, శ్రీకాకుళం .**



**జవాబు :** అమ్మా! న్యూరాలజిస్ట్ చెప్పినట్టు మీ అబ్బాయి స్లో లెర్నర్ అనడంలో సందేహం లేదు. అంటే నెమ్మదిగా నేర్చుకునే తత్వం సందేహం లేదు. అంటే నెమ్మదిగా నేర్చుకునే తత్వం ఉన్న వ్యక్తి అని అర్థం. దీనిని అభ్యసనా వైకల్యం అని కూడ అంటారు. ఇలాంటి వారిలో గ్రహణశక్తిలోఅవరోధాలు ఉంటాయి. రాస్తున్న చదువుతున్న వింటున్న విషయాన్ని గ్రహించడంలో లోపం ఉంటుంది. దీనికి పలు కారణాలు ఉంటాయి. ప్రధానంగా ఎదుగుదల సమస్యలు ప్రతికూల పరిసరాలు, ఉద్వేగ లోపాలు, దీర్ఘ కాలిక ఆరోగ్య సమస్యలు ఇందుకు కారణం అవుతాయి. ఆత్మమాన్యత, నిర్లక్ష్యం, భయం, ఆందో ళన, ఒత్తిడి లాంటివి ప్రభావం చూపు తాయి. కొందరు మీకు చెప్పినట్టు మేనరికం కూడ ఒక కారణం కావచ్చు. ఇలాంటి వారిలో విసుక్కునే స్వభావం కూడ ఉంటుంది. పిల్లలు అందరిలో ఒకే విధమైన ప్రజ్ఞ ఉండదు. కొందరు చాల త్వరగా నేర్చుకుంటారు. కొందరిలో ఊహాత్మక శక్తి నేర్చుకోవడానికి దోహద పడుతుంది. కొందరు వినడం ద్వారా మరికొందరు చేయడం ద్వారా నేర్చుకుంటారు. కొందరు ఏకాంతంగా చదవడం ఇష్టపడితే మరికొందరు నలుగురితో కలిసి చదవడం పట్ల ఆసక్తి చూపుతారు. కాబట్టి పిల్లలు లేదా విద్యార్థుల మానసిక స్థితిని బట్టి నేర్పించడం లేదా చదివించడం మంచిది. మీ అబ్బాయికి నెమ్మదిగా నేర్పించండి. అందుకు మీరు ఓపిక వహించవలసిన అవసరం ఉంది. ఇతరులతో పోల్చి అవహేలన చేయడం ముద్రవేయడం, ఒత్తిడి చేయడం ఏ మాత్రం మంచిది కాదు. అతనికి ఎలా నేర్పిస్తే త్వరగా నేర్చుకుంటారో తెలుసుకుని నెమ్మది నెమ్మదిగా నేర్పించండి. చిన్న చిన్ని అంశాలుగా విడదీసి నేర్పించడం చిన్న చిన్న ప్రశ్నలు అడగడం ద్వారా అతనిలో నేర్చుకోవడం పట్ల అవగాహన కల్పించండి. ఆత్మ విశ్వాసంపెంచి, ప్రోత్సాహం కలిగించండి. సమతుల ఆహారం, వ్యాయామాల పట్ల శ్రద్ధ చూపండి. క్రమంగా నేర్చుకోవడం వేగం పెరుగుతుంది.



**ఎన్.బి.సుధాకర్‌రెడ్డి**
**సైకాలజిస్టు**

వ్యథ

# పార్వతీదేవి శాపం

ఆధ్యాత్మికం

పార్వతీదేవిని వివాహం చేసుకున్న తర్వాత శకరుడు నూరు దివ్య సంవత్సరాలు దాంపత్య సుఖం అనుభవించాడు. అయినా వారికి సంతానం కలగ లేదు. ఒకరోజు బ్రహ్మాది దేవతలు శివుని సమీపించి మీ తేజ ప్రభావంతో కలిగే పుత్రుణ్ణి లోకాలు భరించలేవు. అందువల్ల సంతాన యోచన విరమించి మీరిద్దరూ తపస్సు ఆచరిస్తేనే ముల్లోకాలు క్షేమంగా ఉంటాయి. ఆ తేజస్సును మీలోనే నిలిపి, లోకాలను కాపాడండి అని ప్రార్థించారు. మహేశ్వరుడు ఇకపై నిలువరిస్తాం సరే.. కానీ ఇప్పటికే స్వస్థానం నుంచి కదలిన తేజస్సును ఎవరు భరిస్తారు? అనడిగాడు. భూదేవి మాత్రమే భరించగలదన్నారు దేవతలు. పరమేశ్వరుడి తేజస్సు పర్వతాలు, వనాలతో నిండిన భూమి మీద వ్యాపించింది. అగ్ని, వాయు దేవుళ్లను కూడా శివ తేజస్సును భరించమని దేవతలు ఆజ్ఞాపించారు. దాంతో అగ్నితో కూడిన శివ తేజస్సు శ్వేత పర్వతమైంది. అక్కడ అగ్ని, సూర్యుల తేజస్సుతో సమానమైన తేజస్సు గల రెల్లు గడ్డి ఏర్పడింది. అక్కడే



కుమారస్వామి జన్మించాడు. కృత్తికలు పాలిచ్చి పెంచడం వల్ల కార్తికేయుడిగా, అగ్ని ధరించడం వల్ల అగ్ని సంభవుడిగా ప్రసిద్ధి చెందాడు శివనందనుడు. ఈ విషయం తెలుసుకున్న పార్వతీదేవి దేవతల మీద కోపించింది. నా భర్తతో పుత్రుని పొందాలన్న కోరిక తీరనివ్వలేదు కనుక మీకు భార్యలతో సంతానం కలగదు. వాళ్ళు సంతానవతులు కాలేదు" అంటూ ఆగ్రహంతో శపించింది. భూదేవినుద్దేశించి నువ్వు చౌడునేల లాంటి రూపాలు పొందుతావు. ఎందరో రాజులకు భార్యవై వాళ్ల పాలనలో ఉంటావు. నీక్కూడా సంతాన సుఖం ఉండదు" అని శపించింది. అది మొదలు దేవతలు, భూదేవి సంతానభాగ్యం కోల్పోయారు.

# 'మ్యాడ్ స్క్వేర్' ప్రిరిలీజ్

బ్లాక్ బస్టర్ చిత్రం మ్యాడ్‌కి సీక్వెల్‌గా రూపొందిన మ్యాడ్ స్క్వేర్‌పై భారీ అంచనాలు ఉన్నాయి. నార్నె నితిన్, సంగీత్ శోభన్, రామ్‌నితిన్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కళ్యాణ్ శంకర్ దర్శకత్వం వహించారు. శ్రీకర స్టూడియోస్‌తో కలిసి సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై హారిక సూర్యదేవర, సాయి సౌజన్య నిర్మించారు. ఈ చిత్రానికి సూర్యదేవర నాగవంశీ సమర్పకులు. భీమ్స్ సిసిరోలియో పాటలను స్వరపరచగా, తమన్ నేపథ్య సంగీతం అందించారు. ఈ వేసవికి వినోదాల విందుని అందించడానికి మ్యాడ్ స్క్వేర్ చిత్రం మార్చి 28న థియేటర్లలో అడుగుపెడుతోంది. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్, పాటలు విశేషంగా ఆకట్టుకొని.. ఈ సినిమా సంచలన విజయం సాధిస్తుందనే నమ్మకాన్ని కలిగించాయి. ఈ చిత్ర ప్రిరిలీజ్ వేడుకను హైదరాబాద్ లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో వైభవంగా నిర్వహించారు. యువ సామ్రాట్ అక్కినేని నాగచైతన్య ముఖ్య అతిథిగా హాజరైన ఈ వేడుకలో ప్రముఖ దర్శకులు మారుతి, వెంకీ అట్లూరితో పాటు చిత్ర బృందం పాల్గొంది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి అక్కినేని నాగచైతన్య మాట్లాడుతూ, "మ్యాడ్ స్క్వేర్ ట్రైలర్ చూశాను. అది మ్యాడ్ స్క్వేర్ కాదు, మ్యాడ్ మ్యాక్స్. ట్రైలర్ చాలా బాగుంది. నాకు ఈవేడుకకు రావడం సంతోషంగాఉంది. నేను మ్యాడ్ సినిమాలోని కామెడీ సీన్స్ చూస్తూ, ఒత్తిడిని దూరం చేసుకుంటూ ఉంటాను. ఇలాంటి సినిమాలు ఆరోగ్యానికి చాలామంచిది. డల్‌గా ఉన్నప్పుడు మ్యాడ్‌లాంటిసినిమా చూడమని డాక్టర్లు కూడా సూచించాలనేది నా అభిప్రాయం. ఇలాంటి సినిమాలు చూడటం వల్ల.. ఫ్రెండ్స్, ఫ్యామిలీతో కలిసి సరదాగా గడిపేలా చేస్తాయి. ఫ్రెండ్ షిప్‌ని స్ట్రాంగ్ చేస్తాయి. కొత్త ఫ్రెండ్స్‌ని పరిచయం చేస్తాయి. మ్యాడ్ లాంటిసినిమాలు రావడం సంతోషంగా ఉంది. మ్యాడ్ సినిమాతో ఈ ముగ్గురు హీరోలు స్టార్స్ అయిపోయారు.



# 'పెద్ది' ఫస్ట్ లుక్ విడుదల

గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ తన 16వ చిత్రంతో వెండితెరపై తుపాను సృష్టించటానికి సిద్ధమయ్యారు. ఈ చిత్రాన్ని జాతీయ అవార్డు గ్రహీత, ఉప్పెన ఫేమ్.. దర్శకుడు బుచ్చిబాబు సానా రూపొందిస్తోన్న చిత్రంతో ప్రేక్షకులను అలరించటానికి సిద్ధమవుతున్నారు. భారీ బడ్జెట్‌తో ఈ పాన్‌ఇండియా సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ సమర్పిస్తోంది, సుకుమార్ రైటింగ్స్ సృజనాత్మక శక్తి కూడా తోడవుతుంది. ఈహ్యూజ్ బడ్జెట్ మూవీని వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. నిజమైనత తుపాను రాక మునుపే మేకర్స్ దాని రాకను తెలియజేసేలా ప్రి లుక్‌ను విడుదల చేసి సినిమాపై అందరిలో ఆసక్తిని మరింతగా పెంచారు. గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ పుట్టిన రోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలను తెలియజేస్తూ మేకర్స్ సినిమా టైటిల్‌ను 'పెద్ది' అని అనౌన్స్ చేశారు. ఈ టైటిల్ రామ్ చరణ్ పాత్రలోని శక్తి, గాంభీర్యాన్ని సంపూర్ణంగా, గొప్పగా తెలియచేస్తోంది. 'పెద్ది' సినిమాకోసం రామ్‌చరణ్ అందరూ ఆశ్చర్యపోయి చూసేలా తన లుక్‌ను రగ్డ్‌గా మార్చుకోవటం విశేషం. ఈ రా క్యారెక్టర్‌లో నటించటానికి ఆయన స్టార్ ఇమేజ్‌ను పక్కకు పెట్టి ఇంటెన్స్, రియల్‌గా కనిపించే ప్రయత్నం చేశారు. ఇది వరకు రామ్ చరణ్ కనిపించనటువంటి సరికొత్త లుక్ ఇది. పదునైన చూపులు, గజిబిజి జుట్లు, గుబురు గడ్డం, ముక్కుకి రింగు, మాసిన బట్టలు, సిగరెట్ తాగుతూ తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించే అవతార్‌లో కనిపిస్తున్నారు చరణ్.



మరో పోస్టర్‌ను గమనిస్తే పాత క్రికెట్ బ్యాట్‌ను పట్టుకుని ఫ్లడ్ లైట్ వెలుతురులో ఓ గ్రామంలోని స్టేడియంలో నిలుచుని ఉన్నాడు. ఈ రెండు పోస్టర్స్ సినిమాలో హీరో పాత్ర నేపథ్యాన్ని, కథ, కథనం.. గ్రామీణ వాతావరణంలోని తీవ్రత, నాటకీయత సినిమాపై మరింత ఆసక్తిని పెంచాయి. డైరెక్టర్ బుచ్చిబాబు సానా రామ్ చరణ్ పాత్రను ఎంతో జాగ్రత్తగా రూపొందించినట్లు పోస్టర్స్‌లో స్పష్టంగా కనిపిస్తోంది. తను చెప్పాలనుకున్న విషయాలను పోస్టర్స్ రూపంలో చూపెట్టారు. హీరో రా క్యారెక్టర్ తన పాత్రలోని ఇతర భావాలను చెప్పేలా పోస్టర్స్‌ను డిజైన్ చేశారు. రామ్‌చరణ్ తన పాత్రకు ప్రామాణికతను తీసుకు రావడానికి.. బుచ్చిబాబు ఏదో కొత్తదనాన్ని సృష్టించేందుకు.. తమ నిబద్ధతను చూపిస్తున్నారు. 'పెద్ది' చిత్రం భారీ స్థాయిలో, అన్‌కాంప్రమైజ్డ్ బడ్జెట్‌తో, అత్యాధునిక సాంకేతికతతో, అద్భుతమైన దృశ్యాలతో, ప్రపంచ స్థాయి నిర్మాణ విలువలతో రూపొందుతోంది. సినిమాలోని డెప్త్, భారీతనం గొప్పతనం అభిమానులను, సినీ పరిశ్రమలోని వారిని ఆకర్షిస్తోంది. ప్రేక్షకులు సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యే ఓ అనుభవాన్ని సినిమాను అందించటానికి సిద్ధమవుతోంది. ఇతర చిత్ర పరిశ్రమల్లోని గొప్ప నటీనటులు ఈ సినిమాలో వర్క్ చేస్తున్నారు. కన్నడ సూపర్‌స్టార్ కరుణడ చక్రవర్తి శివ రాజ్‌కుమార్ ఇందులో కీలకపాత్రలో నటిస్తుండగా, బాలీవుడ్ బ్యూటీ జాన్వీకపూర్ హీరోయిన్‌గా నటిస్తుంది. అలాగే జగపతిబాబు, దివ్యేందు శర్మ ఇతర ప్రముఖ పాత్రల్లో మెప్పించనున్నారు.



# అనిల్ రావిపూడి, మెగాస్టార్ కాంబినేషన్ షురూ

సంక్రాంతికి వస్తున్నాంతో మ్యాసివ్ బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకున్న బ్లాక్ బస్టర్ హిట్ మెషిన్ అనిల్ రావిపూడి తన నెక్స్ట్ బిగ్ స్క్రీన్ షో కోసం రెడీ అవుతున్నారు. మెగాస్టార్ చిరంజీవితో కొలాబరేట్ అవుతున్నారు. తన అద్భుతమైన కామిక్ టైమింగ్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లకు పేరుపొందిన అనిల్ రావిపూడి, కామెడీ, ఎమోషన్, యాక్షన్‌ను బ్లెండ్ చేసే స్క్రిప్ట్‌తో చిరంజీవిని ఇంతకు ముందు ఎప్పుడూ చూడని పాత్రలో ప్రజెంట్ చేయనున్నారు. ప్రతిష్టాత్మక షైన్ స్క్రీన్స్ బ్యానర్‌లో గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో కలిసి సాహు గారపాటి నిర్మించే ఈ చిత్రం పండగ వైబ్స్, ఎమోషన్స్, అనిల్ రావిపూడి ట్రేడ్‌మార్క్ వినోదంతో ఈ చిత్రం హెల్తీ ఫ్యామిలీ ఎంటర్ టైనర్‌గా ఉండనుంది. చిరుఅనిల్ కోసం అంతా లాక్, లోడ్ అయ్యింది. అనిల్ రావిపూడి చిరంజీవికి ఫైనల్ నరేషన్ వినిపించారు. స్క్రిప్ట్‌తో థ్రిల్ అయ్యారు మెగాస్టార్. వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. మెగాస్టార్ ఆశీస్సులు లభించడంతో, ఈ చిత్ర బృందం ఇప్పుడు ఫుల్ స్వింగ్‌లో వర్క్ చేస్తోంది, గ్రాండ్ లాంచ్‌కు ముందే మిగిలిన నటీనటులు, సిబ్బందిని ఖరారు చేయనున్నారు. ఈ చిత్రానికి ప్లే ఫుల్ ట్విస్ట్‌ని జోడిస్తూ, చిరంజీవి శంకర్ వరప్రసాద్ పాత్రను పోషిస్తున్నారు. మెగాస్టార్ అసలు పేరు కొణిదెల శివ శంకర వరప్రసాద్.




# ఎస్ఎల్‌వి సినిమాస్ 'ది ప్యారడైజ్'

నేచురల్ స్టార్ నాని ఇంటెన్స్ యాక్షన్ థ్రిల్లర్ ది ప్యారడైజ్ రా స్టేట్‌మెంట్ టీజర్ ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఈ గ్రిప్పింగ్ టీజర్ అందరి దృష్టిని ఆకర్షించి రికార్డ్ బ్రేకింగ్ వ్యూస్ సంపాదించి, తెలుగు సినిమా ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిధిని రీడిఫైన్ చేసింది. ఈ మోస్ట్ ఎవైటెడ్ మూవీ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల సెకండ్ కొలాబరేషన్ ని సూచిస్తుంది. మార్చి 26, 2026న సరిగ్గా 365 రోజుల్లో ది ప్యారడైజ్ తెరపైకి రానుంది. భారతీయ సినిమా ఈ మ్యాడ్నెస్‌ను చూడటానికి సరిగ్గా ఏడాది వుంది. కౌంట్‌డౌన్‌ను గుర్తుచేసుకోవడానికి, పేలుళ్ళు, వార్ బ్యాక్ డ్రాప్‌లో తుపాకీని పట్టుకుని వున్న పవర్ ఫుల్ కొత్త లుక్‌లో నానిని ప్రజెంట్ చేసే ఇంటెన్స్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ ఇంటెన్స్ పోస్టర్ యాక్షన్‌ప్యాక్డ్ జర్నీని సూచిస్తుంది. హైదరాబాద్ హిస్టారికల్ బ్యాక్ డ్రాప్ సెట్ చేయబడిన ది ప్యారడైజ్ నానిని మోస్ట్ ఇంటెన్స్ క్యారెక్టర్‌లో ప్రజెంట్ చేయనుంది. ఎస్ఎల్‌వి సినిమాస్‌పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని అత్యున్నత స్థాయి నిర్మాణ విలువలతో నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించగా, బిరీ విష్ణు సినిమాటోగ్రఫీని అందిస్తున్నారు. ఈ చిత్రం ఇంగ్లీష్, స్పానిష్ సహా 8 భాషలలో విడుదల కానుంది.



# 'సంతాన ప్రాప్తిరస్తు' నుంచి లిరికల్ సాంగ్

విక్రాంత్, చాందినీ చౌదరి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న యూత్ ఫుల్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ మూవీ "సంతాన ప్రాప్తిరస్తు" టీజర్ ఇప్పటికే హ్యూజ్ రెస్పాన్స్ తెచ్చుకుంటుండగా... తాజాగా ఈ సినిమా మ్యూజిక్ ప్రమోషన్స్ గ్రాండ్‌గా బిగిన్ అయ్యాయి. ఈ సినిమా నుంచి నాలో ఏదో.. లిరికల్ సాంగ్‌ను రేడియో మిర్చిలో లాంచ్ చేశారు. నాలో ఏదో.. పాటకు మ్యూజిక్ డైరెక్టర్ సునీల్ కశ్యప్ బ్యూటిఫుల్ ట్యూన్ ఇవ్వగా.. శ్రీజో క్యాచీ లిరిక్స్ అందించారు. సింగర్స్ దినకర్ కల్వల, అదితి భావరాజు ఆకట్టుకునేలా పాడారు. నాలో ఏదో.. పాట ఎలా ఉందో చూస్తే, నాలో ఏదో మొదలైందని, నీతో చెలిమే రుజువైందని, కనులే చెబితే మనసే వినదా, నిజమే అనదా... అంటూ సాగుతుంది పాట. హీరో హీరోయిన్స్ విక్రాంత్, చాందినీ చౌదరిపై లవ్ సాంగ్‌గా ఈ పాటను చిత్రీకరించారు. రేడియో మిర్చిలో జరిగిన నాలో ఏదో.. సాంగ్ లాంచ్ కార్యక్రమంలో హీరో విక్రాంత్, ప్రొడ్యూసర్ మధుర శ్రీధర్ రెడ్డి, డైరెక్టర్ సంజీవ్ రెడ్డి, లిరిసిస్ట్ శ్రీజో, సింగర్ అదితి భావరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లిరిసిస్ట్ శ్రీజో మాట్లాడుతూ, నాలో ఏదో.. సాంగ్ హీరో హీరోయిన్స్ లవ్ జర్నీని, వాళ్ల ఎమోషన్స్‌ను చూపిస్తుంది. ఈ సినిమా చేసేప్పుడే మా డైరెక్టర్ ప్రొడ్యూసర్స్ లిరిక్స్ గురించి చాలా జాగ్రత్తలు తీసుకున్నారు. పాటలోని సాహిత్యం అందంగా, క్లుప్తంగా ఉండాలని చెప్పారు. ఖినాలో ఏదో.. సాంగ్‌కు సునీల్ కశ్యప్ మంచి ట్యూన్ ఇచ్చారు. ఈ పాట మీ అందరిని ఆదరణ పొంది ఛాట్ బస్టర్ అవుతుందని ఆశిస్తున్నా అన్నారు. సింగర్ అదితి భావరాజు మాట్లాడుతూ, నాలో ఏదో.. సాంగ్ పాడటం హ్యాపీగా అనిపించింది. మ్యూజిక్ లవర్స్ రకరకాల పాటలు వింటుంటారు. అలా ఏ తరహా పాటలు వినేవారికైనా నాలో ఏదో.. సాంగ్ నచ్చుతుంది. ఈ పాట తప్పకుండా పెద్ద హిట్ అవుతుందని నమ్ముతున్నాం. అన్నారు. హీరో విక్రాంత్ మాట్లాడుతూ, సంతాన ప్రాప్తిరస్తు సినిమాకు పనిచేయడాన్ని చాలా ఎంజాయ్ చేశాం. మా ప్రొడ్యూసర్ శ్రీధర్, హరి ప్రసాద్, డైరెక్టర్ సంజీవ్ తో పాటు మా టీమ్ అంతా ఒక ఫ్యామిలీలా మూవీకి వర్క్ చేశాం. నాలో ఏదో.. సాంగ్ బ్యూటిఫుల్‌గా ఉంటుంది. ఈ పాటకు సునీల్ కశ్యప్ ఛాట్ బస్టర్ ట్యూన్ ఇచ్చారు. మీరంతా ఈ పాటను ఎంజాయ్ చేస్తారు అన్నారు. నిర్మాత మధుర శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ, సంతాన ప్రాప్తిరస్తు ఒక కాంటెంపరీ ఫిల్మ్. నాలో ఏదో.. సాంగ్ గురించి చెప్పాలంటే చాలా విశేషాలు ఉన్నాయి. మా సంస్థకు సునీల్ కశ్యప్ ఎన్నో గుర్తుండిపోయే పాటలు ఇచ్చారు. ఇట్స్ మై లవ్ స్టోరీ మూవీలో నిన్నలా లేదే మొన్నలా లేదే సాంగ్, అలాగే ఏబీసీడీ మూవీలో అదితీ మెల్లమెల్ల మెల్లగా సాంగ్, శ్రీజో రాసిన నీవే ..పాట రాశారు. ఇలా వీళ్ల కాంబినేషన్ లో వచ్చిన పాటే నాలో ఏదో.. ఈ పాట టాప్ టెన్ ఛాట్ బస్టర్స్‌లో ఉంటుందని స్ట్రాంగ్‌గా బిలీవ్ చేస్తున్నాం. మీ అందరికీ ఈ పాట తప్పకుండా నచ్చుతుంది. అన్నారు.



# 'శ్రీ కళాసుధ తెలుగు అసోసియేషన్' ఉగాది పురస్కారాలు

ఏటా ఉగాది పురస్కారాలు అందిస్తూ చెన్నైలో తెలుగు వారి కీర్తిని చాటుతున్న శ్రీ కళాసుధ తెలుగు అసోసియేషన్ ఈ ఏడాది ఉగాది పురస్కారాల కార్యక్రమానికి సన్నద్ధమవుతోంది. ఈ నెల 30వ తేదీ న చెన్నై రాయపేట లోని మ్యూజిక్ అకాడెమీలో ఉగాది పురస్కారాల కార్యక్రమం ఘనంగా నిర్వహించబోతున్నారు. ఈ కార్యక్రమ వివరాలు హైదరాబాద్ ఫిలిం ఛాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో నిర్వాహకులు వివరించారు. ఈ సందర్భంగా శ్రీ కళాసుధ తెలుగు అసోసియేషన్ అధ్యక్షులు బేతిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ, చెన్నై మహానగరంలో తెలుగు వారి ఘన కీర్తిని చాటుతూ పాతిక సంవత్సరాలకు పైగా శ్రీ కళాసుధ తెలుగు అసోసియేషన్ ఉగాది పురస్కారాలు అందిస్తున్నాం. ఈ ఏడాది ఈ నెల 30వ తేదీన సాయంత్రం 4.29 నిమిషాల నుంచి చెన్నై మ్యూజిక్ అకాడెమీలో ఈ కార్యక్రమం నిర్వహిస్తాం. ఈ ఏడాది హీరోయిన్స్ మీనాక్షిచౌదరి, సాక్షివైద్యకు బుట్టబొమ్మ అవార్డ్ ఇవ్వబోతున్నాం, అలాగే హీరో దుల్కర్ సల్మాన్, డైరెక్టర్ ప్రశాంత్ వర్మకు బాపు రమణ పురస్కారం అందించనున్నాం. అలాగే ఉత్తమ సంచలన చిత్రంగా పుష్ప 2, ఉత్తమ చిత్రంగా హనుమాన్, ఉత్తమ నటులుగా ప్రభాస్, అల్లు అర్జున్, ఉత్తమ నటీమణులుగా ఇంద్రజ, నివేదా థామస్..ఇలా పలు విభాగాల్లో ప్రేక్షకుల్ని ఆకట్టుకున్న గొప్ప తెలుగు సినిమాలకు, నటీనటులకు, సాంకేతిక నిపుణులకు ఉగాది పురస్కారాలు ఇవ్వబోతున్నాం. ఈ ఏడాది కూడా మా ఉగాది పురస్కారాల కార్యక్రమాన్ని విజయవంతం చేస్తారని కోరుకుంటున్నాం అన్నారు. నటుడు జెమినీ సురేష్ మాట్లాడుతూ, మన తెలుగు వారి కోసం శ్రీ కళాసుధ తెలుగు అసోసియేషన్ చేస్తున్న కృషికి మనస్ఫూర్తిగా నా అభినందనలు తెలుపుతు న్నాను. ఈ సారి ఉగాది పురస్కారాల కార్యక్రమంలో వ్యాఖ్యాతగా సభా నిర్వహణ చేసే అవకాశం రావడం సంతోషంగాఉంది. తెలుగులో సభా నిర్వహణ చేసినందుకు గతంలో స్వర్గీయ ఎస్పీ బాలు ఆశీస్సులు పొందాను. తెలుగు వారంతా ఎక్కడ ఉన్నా శ్రీ కళాసుధ తెలుగు అసోసియేషన్ ఉగాది పురస్కారాల్లో పాల్గొని విజయవంతం చేస్తారని కోరుకుంటున్నాం అన్నారు. ప్రముఖ సినీ జర్నలిస్ట్ ప్రభు మాట్లాడుతూ పాతికేళ్లకు పైగా చెన్నైలో తెలుగు వారి సంస్కృతి సంప్రదాయం వైభవం చాటుతున్న శ్రీ కళాసుధ తెలుగు అసోసియేషన్ వారిని ఎంత ప్రశంసించినా తక్కువే. ఒక జర్నలిస్ట్‌గా నేను అనేకసార్లు ఈ అసోసియేషన్‌లు వారి కార్యక్రమ కవరేజ్ కు వెళ్లాను. ఇప్పుడు ఈ ప్రతిష్టాత్మక సంస్థ నుంచి ఉగాది ప్రత్యేక పురస్కారం అందుకోవడం సంతోషంగా ఉంది. తెలుగు వారంతా శ్రీ కళాసుధ తెలుగు అసోసియేషన్ ఉగాది పురస్కారాల కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలనివిజ్ఞప్తిచేస్తున్నాఅన్నారు. అవార్డ్ గ్రహీతల వివరాలు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు వేణు, పర్వతనేని రాంబాబు, డిఆర్ మీనాక్షి, కేశవ చారి, ముఖ్య అతిధులుగా వైజె రాంబాబు, రఘు లు పాల్గొన్నారు.



# 'పిఆర్ఓ4' గ్రాండ్‌గా లాంచ్

ప్రదీప్ రంగనాథన్ తను దర్శకత్వం వహించిన బ్లాక్ బస్టర్ లవ్ టుడేతో నటుడిగా అరంగేట్రం చేసాడు, ఆ తర్వాత తమిళం, తెలుగు రెండింటిలోనూ విజయం సాధించిన తన రీసెంట్ హిట్ డ్రాగన్‌తో మ్యాసీవ్ పాపులరిటీ సాదించారు. వరుస విజయాలతో, ప్రదీప్ రంగనాథన్ తమిళ సినిమాల్లోనే కాకుండా తెలుగులో కూడా పేరు తెచ్చుకున్నాడు. పాన్ ఇండియా నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ ప్రదీప్ రంగనాథన్ హీరోగా తమిళం, తెలుగు ద్విభాషా ప్రాజెక్టును అనౌన్స్ చేసింది. గతంలో అనేక సక్సెస్ ఫుల్ ప్రాజెక్టులకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసిన కీర్తిశ్వరన్ ఈ చిత్రం డైరెక్టర్ పరిచయం కానున్నారు. పిఆర్ఓ4 చిత్రం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ముహూర్తపు వేడుకలోని ఫస్ట్ విజువల్స్ ప్రదీప్ రంగనాథన్ నటించిన ఆసక్తికరమైన సన్నివేశాన్ని రివీల్ చేశాయి, ఇది ఒక ఇంటెన్స్‌లో ప్రారంభమై, ఒక ఫన్ ఫుల్ కిస్‌తో ముగుస్తుంది, ఇది న్యూ ఏజ్ కథాంశంతో కంప్లీట్ ఎంటర్టైనర్‌గా ఉండబోతోంది. ప్రేమలు చిత్రంతో అందరినీ అలరించిన మమిత బైజు హీరోయిన్‌గా నటిస్తుండగా, సీనియర్ నటుడు శరత్ కుమార్ ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించారు. మైత్రి మూవీ మేకర్స్ ఈ ప్రాజెక్ట్ కోసం ట్యాలెంటెడ్ టెక్నిషియన్స్‌ని ఎంపిక చేసింది. ఈ చిత్రానికి సంగీతం యంగ్ సెన్సేషన్ సాయి అభ్యాంకర్ మ్యూజిక్ అందిస్తుండగా, నికేత్ బొమ్మి సినిమాటోగ్రఫీని నిర్వహిస్తున్నారు. లతా నాయుడు ప్రొడక్షన్ డిజైనర్‌గా, భరత్ విక్రమన్ ఎడిటర్‌గా పని చేస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం జరుగుతోంది.

తారాగణం: ప్రదీప్ రంగనాథన్, శరత్ కుమార్, మమిత బైజు, హృదు హరూన్, ద్రవిడ్ సెల్వం, సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: కీర్తిశ్వరన్, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై రవిశంకర్, సిఇఒ: చెర్రీ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: అనిల్ యెర్నేని, సంగీతం: సాయి అభ్యంకర్, సినిమాటోగ్రాఫర్: నికేత్ బొమ్మి ప్రొడక్షన్ డిజైనర్: లతా నాయుడు కాస్ట్యూమ్ డిజైనర్: పూర్ణిమా రామస్వామి ఎడిటర్: బరత్ విక్రమన్ తమిళ పిఆర్ఒ: సురేష్ చంద్ర, సతీష్ తెలుగు, పిఆర్ఒ: వంశీశేఖర్ మార్కెటింగ్: ఫస్ట్ షో.



# ఎంటర్‌టైనర్ మూవీ 'రాబిన్‌హుడ్'

హీస్ట్ కామెడీ ఎంటర్ టైనర్ రాబిన్‌హుడ్. శ్రీలీల కథానాయికగా నటించింది. వెంకీ కుడుముల దర్శకత్వం వహించిన ఈ సినిమాని మైత్రి మూవీ మేకర్స్ హై బడ్జెట్‌తో నిర్మించారు. ఈ చిత్రంలో నట కిరీటి రాజేంద్రప్రసాద్ కీలక పాత్ర పోషించారు. ఆస్ట్రేలియా డైనమిక్ క్రికెటర్ డేవిడ్ వార్నర్ ప్రత్యేక అతిధి పాత్రలో నటించారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. జివి ప్రకాష్ కుమార్ సంగీతం అందించిన పాటలు చార్ట్ బస్టర్ హిట్ అయ్యాయి. ఈ సినిమా మార్చి 28న థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా ప్రెస్ మీట్ నిర్వహించారు. ప్రెస్ మీట్‌లో హీరో నితిన్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. రాబిన్ హుడ్ ఫైనల్ కాఫీ చూసాము. చాలా హ్యాపీగా ఉన్నాము. సినిమా చేసినప్పుడు ఎంత కాన్ఫిడెంట్ గా ఉన్నానో, చూసుకున్నప్పుడు కూడా అంతే కాన్ఫిడెంట్ గా అనిపించింది. వెంకీ నా కాంబినేషన్లో వచ్చిన భీష్మ కంటే ఈ సినిమా చాలా బాగుండబోతుంది. మార్చి 28న సినిమా రిలీజ్ అవుతుంది. కచ్చితంగా ఆడియన్స్ అందరికీ సినిమా నచ్చుతుందని నమ్మకం ఉంది. ఆడియన్స్ రెస్పాన్స్ కోసం ఎదురు చూస్తున్నాను అన్నారు డైరెక్టర్ వెంకీ కుడుముల మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. సినిమా కోసం చాలా హార్డ్ వర్క్ చేశాం, సినిమా ఎల్లుండి రిలీజ్ కాబోతోంది. మొత్తం అవుట్ పుట్ చూసుకున్నాం. వెరీ హ్యాపీ. ఆడియన్స్ అందరూ సినిమా చూసి బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ చేస్తారని నమ్మకం వుంది అన్నారు. నిర్మాత వై రవిశంకర్ మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. సినిమా అన్ని ఫార్మాలిటీస్‌ని పూర్తి చేసుకుంది. పబ్లిసిటీ పరంగా కూడా చాలా బాగా ఆడియన్స్ కి చేరింది. సినిమా మంచి ఫన్ ఎంటర్ టైనర్. ఖచ్చితంగా ఆడియన్స్ ఎంజాయ్ చేస్తారుఅన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన శీ అండ్ తి ప్రెస్ మీట్‌లో మీడియా ఆడిన ప్రశ్నలు చిత్ర యూనిట్ సమాధానాలు ఇచ్చారు.

**నితిన్ ఇందులో మీ క్యారెక్టర్ ఎలా ఉండబోతోంది?** నా క్యారెక్టర్ ఇందులో వెరీ బిగ్ మానిప్లేటర్. చాలా స్మార్ట్ మైండ్. ఫిజికల్ స్ట్రెంత్ కంటే మెంటల్ స్ట్రెంత్ ఎక్కువగా ఉండే క్యారెక్టర్. ఫస్ట్ టైం ఇలాంటి క్యారెక్టర్ ప్లే చేస్తున్నాను. క్లైమాక్స్ లో నా క్యారెక్టర్ రౌండప్, వచ్చే ట్విస్టులు, షాకులు చాలా ఫ్రెష్‌గా ఉంటాయి. భీష్మ సినిమాలో కంటే నా క్యారెక్టర్ వెరీ స్ట్రీట్ స్మార్ట్‌గా ఉంటుంది. వెరీ ఇంటలెక్చువల్ క్యారెక్టర్.

**ఎమోషన్ ప్రమోషన్స్ లో దాచిపెట్టడానికి కారణం?** సినిమా అంతా షుగర్ కోట్ లాగా ఫన్ కొటెడ్‌గా ఉంటుంది. కానీ సినిమాలలో సోల్ ఎమోషనే. ఆ ఎమోషన్ సీక్వెన్స్ చాలా బాగా వర్కౌట్ అయింది. అది మీరు బిగ్ స్క్రీన్ లోనే చూడాలి. ఇప్పటివరకు చూసిన వారు చాలా అద్భుతంగా ఉందని చెప్పారు.

**వెంకీ, వార్నర్ ఎలాంటి మ్యాజిక్ చేయించారు?** ఆయనది చిన్న క్యామియో. అది మీరు థియేటర్లో చూసినప్పుడే ఆ మ్యాజిక్ ఉంటుంది. దాని గురించి ఇప్పుడు చెప్తే సర్ప్రైజ్ మిస్ అవుతుంది.

**రవి టికెట్స్ రేట్స్‌లో కొన్ని చోట్ల హై కనిపిస్తుంది.. దీనివల్ల ఎఫెక్ట్ ఏమైనా ఉంటుందా?** ఏం లేదండి. 95శతం పాత రేట్లే వున్నాయి. ఐదు శాతం అది కూడా కొన్ని మాల్స్‌లో మాత్రమే స్మాల్ చేంజ్ వుంటుంది. అది కూడా ఎఫర్టబుల్ గానే ఉంటుంది. టికెట్ రేట్ వల్ల ఈ సినిమా చూడలేదనే ఫీలింగు ఎక్కడ ఉండదు.

**నితిన్ ఈ సినిమా నుంచి ఆడియన్స్ ఏమి ఆశించవచ్చు?** ఈ సినిమా చాలా మంచి ఎంటర్ టైన్మెంట్ వుంది. ఎమోషన్ కూడా ఉంది. హార్ట్ టచింగ్ పాయింట్ ఉంది. క్లైమాక్స్ చాలా బాగుంటుంది. ఆడియన్స్‌కి చాలా కొత్త అనుభూతి పొందుతారు.

**రవి ఈ వారం నాలుగు సినిమాలు వస్తున్నాయి.. సోలో డేట్ వుంటే ఇంకా బెటర్‌గా ఉండేది కదా?** ఈ రోజుల్లో ఉన్న పోటీ ప్రపంచంలో సోలో ఆశించకూడదు. మేము వస్తున్నప్పుడు ఒకటే సినిమా అనుకున్నాం. కానీ రెండు డబ్బింగ్ సినిమాలు వచ్చాయి. ఇది మేము ముందుగా ఊహించలేదు.



# పశువైద్య విశ్వవిద్యాలయానికి సహాయ సహకారాలు అందిస్తాం

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్ (అత్తాపూర్), మార్చి 27, ప్రభాతవార్త :** అసెంబ్లీ విరామ సమయంలో పివి నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వ విద్యాలయ ఉపకులపతి ఆచార్య మంథని జ్ఞాన ప్రకాష్ గురువారం సిఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి విశ్వ విద్యాలయ ఉపకుల పతిగా అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సిఎంకి విశ్వ విద్యాలయ పరిధిలో గల వివిధ కళాశాలలు , పరిశోధన శాలల గురించి వివరించారు. నాణ్యమైన పశువైద్యులను తయారు చేయడం ద్వారా రాష్ట్ర రైతులకు, పెంపుడు జంతువుల యజమానులకు, పాడి పరిశ్రమ, పౌల్ట్రీ, చేపల, గొర్రెలు, మేకలు మరియు ఇతర పశుసంవర్ధక రంగాలకు తోడ్పాటు అందిస్తున్నామని తెలిపారు. నాణ్యమైన డైరీ టెక్నాలజీ గ్రాడుయేట్ లను తయారుచేయడం ద్వారా ప్రజారోగ్య పరిరక్షణకు కృషి చేస్తున్నామన్నారు.. ఈ సందర్భంగా సిఎంరేవంత్ రెడ్డి విశ్వ విద్యాలయానికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. విశ్వ విద్యాలయ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్న ముఖ్యమంత్రికి ప్రభుత్వానికి జ్ఞానప్రకాష్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వ విద్యాలయ రిజిస్ట్రార్ డా. శరత్ చంద్ర పాల్గొన్నారు.



సిఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న ఉపకులపతి ఆచార్య మంథని జ్ఞానప్రకాష్

# 2018 బ్యాచ్ కానిస్టేబుల్ పోస్టులకు ఎట్టకేలకు మోక్షం

## త్వరలోనే ధ్రువపత్రాల పరిశీలన

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 27:** చాలా యేళ్లుగా నానుతున్న 2018 బ్యాచ్ కానిస్టేబుల్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు ఎట్టకేలకు సర్కార్ గుడ్‌న్యూస్ చెప్పింది. ఈ అభ్యర్థులకు త్వరలోనే సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ ప్రారంభంకానుందని పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఛైర్మన్ వెల్లడించారు. ఆయన ఈ మేరకు వెల్లడించారని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్, ప్రజావాణి ఇన్‌ఛార్జి దాజి చిన్నారెడ్డి మీడియాకు తెలిపారు. మార్చి 25న ప్రజా భవన్‌లో కానిస్టేబుల్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు ఆయన్ను కలిసి నియామక ప్రక్రియపై వివరాలు కోరారగా.. స్పందించిన చిన్నారెడ్డి పోలీస్ రిక్రూట్‌మెంట్ ఛైర్మన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. అనంతరం ప్రక్రియ త్వరలోనే ప్రారంభం కానున్నట్లు చెప్పడంతో అభ్యర్థులు సంతోషం వ్యక్తం చేశారు.

# దమక్కపల్లిలో అంబేద్కర్ విగ్రహం ధ్వంసం

**కొండపాక, మార్చి 27, ప్రభాతవార్త :** సిద్దిపేట జిల్లా కొండపాక మండల పరిధిలోని దమ్మక్కపల్లిలో గురువారం భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డాక్టర్ బి.అర్.అంబేద్కర్ విగ్రహన్ని ధ్వంసం చేశారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దమ్మక్కపల్లి గ్రామానికి చెందిన జింక తిరుపతి గ్రామంలో బస్టాండ్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి,అర్ అంబేద్కర్ విగ్రహం గద్దెపై కూర్చోని కర్రతో అంబేద్కర్ విగ్రహన్ని కొట్టి ధ్వంసం చేశాడని తెలిపారు. అదేమిటని అడ్డు చెప్పిన గ్రామస్తులను నానా బూతు మాటలు తిట్టినట్లు వారు తెలిపారు, గ్రామస్తులు కుకునూరుపల్లి పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై శ్రీనివాస్ అక్కడికి చేరుకొని విగ్రహన్ని ధ్వంసం చేసిన తిరుపతిని అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. గ్రామంలో నూతనంగా అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశామని విగ్రహ అవిష్కరణ కూడా జరగలేదన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు గట్టి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

# ఎల్లారెడ్డిపేటలో విద్యుదాఘాతంతో రైతు మృతి

**సిద్దిపేట రూరల్(తొగుట), మార్చి 27, ప్రభాతవార్త :** సిద్దిపేట జిల్లా తొగుట మండల పరిధిలోని ఎల్లారెడ్డిపేట గ్రామంలో ప్రమాద వశాత్తు విద్యుత్ షాక్ తగిలి యువ రైతు మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. అదే గ్రామానికి మన్నె లోకేందర్(35) రోజు మాదిరిగానే ఉదయం వ్యవసాయ పొలం వద్దకు వెళ్లినట్లు తెలిపారు. పశువులకు పొలంలో గడ్డి కోస్తుండగా ప్రమాద వశాత్తు విద్యుత్ కేబుల్‌వైర్ తగిలి పడిపోయారు. ఈ విషయం తెలుసుకున్న అక్కడే ఉన్న మరోరైతు మన్నె ఎల్లయ్య కుటుంబీకులకు సమాచారం అందించినట్లు తెలిపారు. వెంటనే కుటుంబీకులు లోకేందర్‌ను సిద్దిపేట జిల్లా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపినట్లు తెలిపారు. మృతుని భార్య మన్నె శైలజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తొగుట పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



బిసి సంఘాల ప్రతినిధుల సమావేశంలో పాల్గొన్న వివిధ పార్టీల నేతలు మాజీ ఎంపి అజీజ్‌పాషా, అరవింద్‌కుమార్‌గౌడ్, గుజ్జ కృష్ణ, కోల జనార్దన్ తదితరులు

# జనాభా ప్రాతిపదికన బిసిలకు పదవులు కల్పించాలి

## ఒబిసి డెమోక్రటిక్ జెఎసి ఛైర్మన్ కోల జనార్దన్

**హైదరాబాద్, మార్చి 27, ప్రభాతవార్త:** జనాభా ప్రాతిపదికన అన్ని రాజకీయ పార్టీలు బిసిలకు పార్టీలోని ప్రధాన పదవుల్లో ప్రాతినిధ్యం కల్పించాలని పలు వురు వక్తలు డిమాండ్ చేశారు. పార్టీ పదవుల్లో, ప్రభుత్వ నామినేటెడ్ పదవుల్లో అగ్రకులాల నేతలే అందిపుచ్చుకుంటూ బిసిలను బానిసలుగా చేసి వాడుకుం టున్నారని వారు విమర్శించారు. ఒబిసి డెమోక్రటిక్ జెఎసి ఛైర్మన్ కోల జనార్దన్ అధ్యక్షతన గురువారం హైదరాబాద్‌లో 'ఒబిసిల సమస్యల పరిష్కారానికి రాజ్యాధికారమే అంతిమ లక్ష్యం' అనే అంశంపై అఖిలపక్ష సమావేశం నిర్వ హించారు. ఈ సమావేశంలో సీపీఐ నేత, మాజీ ఎంపి అజీజ్ పాషా, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్‌గౌడ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ తదితరులు పాల్గొని మాట్లాడుతూ బీసీలందరూ పార్టీలకు, సంఘాలకు అతీతంగా ఒకే వేదికపైకి వచ్చి సంఘటితంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రాజకీయ పార్టీ పదవుల్లో, ప్రభుత్వ నామినేటేడ్ పదవుల్లో అగ్రకులాల నేతలే అందిపుచ్చుకుంటూ బీసీలను బానిసలుగా చేసి వాడుకుంటున్నారని వారు విమర్శించారు. సమావేశంలో దాసు సురేష్, సత్యంగౌడ్, మేకపోతుల నరేందర్ గౌడ్, టి.రాజు, ఒరుగంటి వెంక టేశం, నీల వెంకటేష్, తంగెళ్లముడి నందగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# పదిహేను రోజుల్లో జీరోఅవర్ సమాధానాలు

## అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

## లిఖితపూర్వక సమాధానాలు పంపాలని ముఖ్యకార్యదర్శిని ఆదేశిస్తాం: మంత్రి శ్రీధర్‌బాబు

## జీరోఅవర్ ప్రహసనంగా మార్చొద్దు : మాజీమంత్రి హరీశ్‌రావు



**హైదరాబాద్, మార్చి 27, ప్రభాతవార్త :** జీరో అవర్ సమాధానాలు 15రోజుల్లో రాత పూర్వకంగా అందిచాలని స్పీకర్ గడ్డం ప్రసాద్ ఆదేశించారు. గురువారం హరీశ్‌రావు మాట్లాడుతూ ప్రశ్నోత్తరాలను రద్దుచేయడం దురదృష్టకరం జీరో అవర్‌ను ప్రహసనంగా మార్చొద్దని అన్నారు. శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ మంత్రులు నోట్ చేసుకొని ఆయా శాఖలకు పంపుతున్నారని ఆయా సభ్యులకు 15రోజులలో రాతపూర్వకంగా సమాధానాలు అందించాలని చీఫ్‌సెక్రటరీకి ఆదేశాలు జారీచేస్తామని తెలి పారు. జీరోఅవర్ ప్రశ్నలకు మంత్రులు కచ్చితంగా సమాధానాలు ఇవ్వాలని ఈ సందర్భంగా హరీష్‌రావు కోరారు. గురువారం జరిగిన జీరో అవర్‌లో 50 మంది ఎమ్మెల్యేలు సభ దృష్టికి సమస్యలు తీసు కొచ్చారు. బోధన్, కోరుట్ల ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, డాక్టర్ సంజయ్ నిజామ్ చక్కెర కర్మాగారం ప్రారంభించాలని ఇథనాల్ ఉత్పత్తి కూడా చేపట్టాలని కోరారు. ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి వరంగల్‌హైవే రోడ్డు మరమ్మతులు చేపట్టాలని నియోజకవర్గం చెరువులు పునరుద్దరణ పరిరక్షణ చేయాలని సూచించారు. విజయుడు తన నియోజకవర్గం రైతులకు పూర్తిగా రుణమాఫీ చేయాలని మిర్చికి మద్దతు ధర ఇవ్వాలని అభ్యర్థించారు. ప్రశాంతరెడ్డి, భూపతిరెడ్డి ఎస్సారెస్పీ 20,21ఎ ప్యాకేజి పూర్తిచేసి రెండులక్షల 12వేల ఎకరాలకు సాగునీటిని ఇవ్వాలని బాల్కొండ, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్, కోరుట్ల నియోజక వర్గాలకు నీటివసతి ఏర్పడుతోందని అన్నారు. పాల్వా యి హరీష్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాద బాధితులు ఆదుకొనేందుకు రహదారుల వెంట ట్రామా సెంటర్లను ఏర్పాటు చేయాలని కోరారు. తలసానిశ్రీనివాస్ రోడ్లపై వ్యాపారం చేసుకొనే చిరువ్యాపారులను వేదించడం పోలీసులు మానుకోవాలని ఓవైపు కేంద్రం ముద్ర లోన్స్ ఇచ్చివారిని ఆదుకొంటుంటే పోలీసులు వారిని వ్యాపారాలు చేసుకోకుండా ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి పోలీసులు చేబదలు ఇచ్చే వారిని అరెస్టుచేస్తున్నారని దీనితో గ్రామాలలో అవసరాలకు అప్పులు పుట్టడంలేదని ఆరోపించారు. మానకొండూర్ ఎమ్మెల్యే గన్నేరువరంలో ఎంపిడివో, ఎమ్మార్వో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాలు నిర్మించాలని కోరారు. గుండ్లపల్లి కొత్తపల్లి రోడ్డు త్వరగా పూర్తిచేయాని కోరారు. సుధీర్‌రెడ్డి నియోజకవర్గం చెరువులకు 20 ఎంఎల్‌డి ఎస్‌టిపిఎల్ ఏర్పాటు చేసి శుద్దిచేయాలని కోరారు. కూనంనేని సాంబశివరావు ఆర్టీసిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు జరుపాలని కోరారు. కడియం శ్రీహరి స్టేషన్‌ఘనపురం సమీపంలోని రాంపూర్‌లో డంప్‌యార్డు పొగతో సుమారు పదిగ్రామాలు జఫర్‌గడ్ వరకు ఇటు మడికొండ వరకు ఇబ్బంది పడుతున్నాయని తెలిపారు. ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, పాయల్ శంకర్, తెల్లంవెంకటర్‌రామ్, పాయంవెంకటేశ్వర్లు రోడ్లుబ్రిడ్జిల నిర్మాణం జాప్యం వంటిపై అడిగారు. పెద్దపల్లి ఎమ్మెల్యే పత్తిపాక రిజర్వాయర్ పూర్తిచేయాలని సూచించారు. కిష్టంపేట తారుపల్లి వరకు ఆయకట్ట చివరివరకు నీరు అందించేలా చర్యలు ఎస్సారెస్పీ ఇంజనీరు అధికారులు తీసుకోవాలని కోరారు. సునీతా లక్ష్మారెడ్డి గణపురం ఆనటకట్ట మూడుమీటర్లు పెంచుతున్నారు కానీ ఏడుకోట్ల నష్టపరిహారం ఇవ్వడంలేదని ఆవేదన చెందారు. పాలకుర్తి పర్ణికరెడ్డి టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేయాలని తన నియోజకవర్గంలోని పొరుగు నియోజకవర్గంలోని ఆధ్యాత్మిక కేంద్రాలను సభకు వివరించారు. ఆర్మూర్ ఎమ్మెల్యే రేషన్ బియ్యం అక్రమార్కులను కట్టడి చేయాలని కోరారు. సన్నబియ్యం ఆకలి ఉన్నోడికి ఇవ్వండని అమ్ముకొనేటోని కాదని సలహాఇచ్చారు



## బంగారు ఆభరణాల హాల్‌మార్కుపై జిల్లాల వారీగా

# బిఐఎస్ఐ అవగాన సదస్సులు

**హైదరాబాద్, మార్చి 27, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని 13 జిల్లాల్లో బంగారు ఆభరణాలపై హాల్‌మార్కింగ్ తప్పనిసరి చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో వర్తకులు, తయారీ దారులను అప్రమత్తం చేయడంతో పాటు విధివిధానాలపై అవగాహన కల్పించేందుకు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ హైదరాబాద్ శాఖ పలు జిల్లాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఈనెల 10వ తేదీన హనుమకొండ, 11వ తేదీన కామారెడ్డి జిల్లా, 25న యాదాద్రి భువనగిరి జిల్లాలో, 27న హైదరాబాద్ జిల్లాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించినట్లు బీఐఎస్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. హాల్ మార్కు నిబంధనల ప్రకారం ప్రతీ ఆభరణంపై హెచ్‌యూఐడీ నెంబరుతో పాటు బీఐఎస్ లోగో, బంగారు ఆభరణం శుద్ధత వివరాలు తప్పనిసరిగా ముద్రించాలని, హాల్‌మార్కింగ్ అయిన బంగారాన్ని మాత్రమే విక్రయించాలని కోరారు. ప్రతీ వినియోగదారుడు ఈ విషయంపై అవగాహన కలిగి ఉండాలని, బిఐఎస్ఐ కేర్ యాప్ ద్వారా మీ ఆభరణాల శుద్ధతను తెలుసుకున్న తర్వాతే కొనాలని వారు వినియోగదారులకు విజ్ఞప్తి చేశారు.



# కిడ్నీ మందులపై సుంకాలను తగ్గించండి

## పార్లమెంటులో ప్రస్తావించిన ఎంపి ఈటల రాజేందర్

**హైదరాబాద్, మార్చి 27 ప్రభాతవార్త:** నిబంధన 377 కింద కిడ్నీ మందులపై సుంకాలను తగ్గించాలంటూ ఎంపి ఈటల రాజేందర్ పార్లమెంట్‌లో ప్రస్తా వించారు. ప్రాణాలను రక్షించే కిడ్నీ ఫెయిల్యూర్ థెరపీలు, మందులపై కస్టమ్స్ డ్యూటి, ప్రభుత్వ పన్నుల మినహాయింపు ఇవ్వాలని ప్రభుత్వంను కోరుతున్నానని తెలిపారు. కిడ్నీ ఫెయిల్యూర్ అనేది ప్రాణాంతకమైన పరిస్థితి అని, దీనికి దీర్ఘకాలిక చికిత్స, డయాలసిస్ మరియు కిడ్నీ మార్పిడి అవసరం అన్నారు. డయాలసిస్ యంత్రాలు, కిడ్నీ మార్పిడి ఔషధాల అధిక ధరల కారణంగా దేశంలోని చాలా మంది రోగులు అవసరమైన చికిత్సలను పొందలేకపోతున్నారని తెలిపారు. ఖర్చులు భరించలేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం, ప్రధాన మంత్రి జాతీయ డయాలసిస్ ప్రోగ్రామ్ ద్వారా కిడ్నీ రోగులకు జీవితకాల డయాలసిస్, కిడ్నీ మార్పిడి సేవలను కేంద్ర ప్రభుత్వం అందించడం సంతోషంగా ఉందన్నారు. వివిధ రాష్ట్ర కార్యక్ర మాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలు డయాలసిస్, మార్పిడితో కిడ్నీ రోగులకు కూడా సహాయం చేస్తున్నాయన్నారు. కానీ ఈ స్కీములకు అర్హత లేని రోగులు డబ్బులు జేబులోంచి చెల్లిస్తున్నాయి, దీని వలన కుటుంబాలు భరించలేని ఖర్చులను ఎదుర్కొంటున్నాయన్నారు. ప్రభుత్వ పన్నులు, కస్టమ్స్ సుంకాల అదనపు భారం రోగులు, వారి కుటుంబాలపై ఆర్థిక కష్టాలను మరింత పెంచుతుందన్నారు. దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధితో బాధపడుతున్న రోగులను ఆదుకోవడానికి ఈ విషయంలో సత్వర చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నానట్లు తెలిపారు.



**కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను కలిసిని ఎంపి ఈటల**

కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌ను ఎంపి ఈటల రాజేందర్ మర్యాదపూర్వకంగా కలిసారు. గజేంద్ర సింగ్ షెకావత్‌కు మల్కాజిగిరి నియోజకవర్గ నాయకులను ఈటల రాజేందర్ పరిచయం చేశారు.

# 14 కొత్త ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్లకు ఆమోదం

## ఏప్రిల్ 1 నుంచి విధుల నిర్వహణకు అదేశాలు

## కొత్త స్టేషన్లకు ప్రస్తుత ఎస్‌హెచ్‌ఒలు ఇన్‌చార్జులు

**హైదరాబాద్, మార్చి 26, ప్రభాతవార్త :** తెలంగాణలో ఏప్రిల్ 1 నుంచి 14 ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లు ప్రారంభం కానున్నాయి. కొత్తగా ఏర్పాటు కానున్న 14 ఎక్సైజ్ పోలీస్ షన్లలో 13 ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లు హైదరాబాద్‌లో, ఒక ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ వరంగల్ అర్బన్‌లో ఏర్పాటు కానున్నాయి. 2020లో 14 కొత్త ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు జరిగాయి. కొత్త ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల విభజన, ప్రాంతాల బదులాయింపు కార్యక్రమాల్ని పూర్తి అయ్యాయి. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రిన్సిపల్ సెక్రటరీ రిజ్వీ, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కమిషనర్ చెవ్వూరు హరికిరణ్ కొత్త ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లకు అమోద ముద్ర వేశారు. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ అడిషనల్ కమి షనర్ అజయ్‌రావు కొత్త పోలీస్ స్టేషన్లను ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి విధులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని ఆయా ఎక్సైజ్ డిప్యూటి కమిషనర్లకు ఉత్తర్వులను జారీ చేశారు. కొత్త ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లకు అద్దె భవనాలను గుర్తించాలని కమిషనర్ అదేశాలు ఇచ్చారు. కొత్తగా ఏర్పాటు కానున్న ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్లకు బంజారాహిల్స్, చిక్కడపల్లి, గండిపేట్, కొండపూర్, పెద్ద అంబర్‌పేట్, కూకట్‌పల్లి, అమీన్‌పూర్, హసన్‌పర్తి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లకు అద్దె భవనాల గుర్తించారు. ఏప్రిల్ ఒకటో తేదీన కొత్త భవనాల్లో కొత్త ఎక్సైజ్ పోలీస్ పోలీస్ స్టేషన్లు ప్రారంభం కానుండగా కొత్త ఎక్సైజ్ స్టేషన్లు అద్దె భవనాలు లభించని మారేడ్‌పల్లి, మీర్‌పేట్, కొంపల్లి, కాప్రా, నాచారం, అల్వాల్ కొత్త ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లు ప్రస్తుతం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లుగా నడుస్తున్న సికిందకాబాద్, సరూర్‌నగర్, కుత్బుల్లాపూర్, ఘట్కేసర్, ఎప్పల్, మల్కాజి గిరి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లలో ప్రత్యేక గదుల్లో కొత్త ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లు ఏర్పాటు కానున్నాయి. ఇంచార్జులుగా పాత స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు..పాత ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలే కొత్త ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లకు ఎస్‌హెచ్‌ఒలుగా పదవి బాధ్యతలు స్వీకరిస్తారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వీలు కాకపోతే సీనియర్ ఎక్సైజ్ ఎస్సైలకు ఎస్‌హెచ్‌ఓగా విధులు నిర్వహించడానికి అవకాశాలు ఇవ్వనున్నారు. స్టేషన్లతోపాటు కేసులు, స్వాధీన సొత్తు బదలాయింపు.. కొత్తగా ఏర్పాటు కానున్న ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లకు కేటాయించిన ప్రాంతాలకు సంబంధించిన కేసుల రికార్డులు, స్వాధీనం చేసుకున్న గంజాయి, డ్రగ్స్, వాహనాలు, బెల్లం, ఎన్‌డీపీఎల్ మద్యం బాటిళ్లను కొత్త ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లపరిధిలో నిల్వ చేయాల్సిందిగా అదేశాల్లో పేర్కొ న్నారు. ఎస్‌హెచ్‌ఓలతోపాటు సిబ్బంది కేటాయింపులు..కొత్త ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లు ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ప్రారంభం కానున్న నేథ్యంలో స్టేషన్ల నిర్వాహణకు ఎస్‌హెచ్‌ఓలు, ఎక్సైజ్ కానిస్టేబుళ్ల కేటాయించారు.

# ఐదు లక్షల మందికి స్వయం ఉపాధి కల్పనే లక్ష్యం

## రాజీవ్ యువ వికాసం పథకానికి అర్హులైన వారంతా దరఖాస్తు చేసుకోవాలి : నూతి శ్రీకాంత్‌గౌడ్

**హైదరాబాద్ (ముషీరాబాద్), మార్చి 27, ప్రభాతవార్త:** సుమారు ఐదు లక్షల మందికి స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళ్తోందని బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్ స్పష్టం చేశారు. గురు వారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన రాజీవ్ యువ వికాసం పథకానికి మార్గదర్శకాలు విడుదల చేశారని, అర్హులైన వారు ఏప్రిల్ 5లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

50వేల యూనిట్‌కు 100శాతం రాయితీ ఇవ్వనున్నట్లు మార్గ దర్శకాలు స్పష్టం చేస్తున్నాయని, మిగతా యూనిట్లకు కూడా 70 శాతం నుండి 90 శాతం వరకు రాయితీ ప్రకటించిందని, రాయితీ మొత్తం పోను మిగతా దాన్ని లబ్ధిదారుల వాటాగా కాకుండా బ్యాంకు అప్పుగా అందచేస్తున్నట్లు వెల్లడించారు.

రాజీవ్ యువ వికాసం పథకానికి పోర్టల్ విడుదల చేశామని, దరఖాస్తుల ప్రక్రియ ఏప్రిల్ 5 వరకు కొనసాగుతుందని, ఏప్రిల్ 6వ తేదీ నుండి మే 30 వరకు దరఖాస్తుల పరిశీలన ఉంటుందని వివరించారు. ఎంపికైన అభ్యర్థులకు తెలంగాణ ఆవిర్భావ వారోత్సవాలలో భాగంగా జూన్ 2 నుండి మంజూరు పత్రాలు అందచేయనున్నట్లు తెలిపారు.

ఒంటరి మహిళలు, వితంతువులకు 25 శాతం ప్రాధాన్యత ఉంటుందని, తెలంగాణ ఉద్యమంలో ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో పాలుపంచు కున్న వారికి ఈ పథకంలో మొదటి ప్రాధాన్యత ఇస్తారని, కుటుంబానికి ఒకరికి మాత్రమే లబ్ధి పొందే అవకాశం ఉంటుందని, ఐదేళ్ల వరకు ఆ కుటుంబానికి చెందిన ఇతరులు అనర్హులు అని తెలిపారు. అర్హులైన వారంతా ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



బిసి స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్

## అసెంబ్లీ మీడియా పాయింట్

# సమస్యలు లేనట్లు నియోజకవర్గాల పునర్విభజనపై చర్చ

## బిజెపి ఎమ్మెల్యే పాయల్ శంకర్



**హైదరాబాద్, మార్చి 27, ప్రభాతవార్త :** రాష్ట్రంలో ఏ సమస్యలు లేనట్టు నియోజకవర్గాల పునర్విభజనపై కాంగ్రెస్ ప్రభుత్వం చర్చ పెట్టిందని బిజెపి ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. దక్షిణాది రాష్ట్రాలకు బిజెపి ఏదో అన్యాయం చేస్తున్నట్టు మాట్లాడుతున్నారన్నారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్‌వద్ద ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ, కేంద్రమంత్రులు నియోజకవర్గాల పునర్విభజనపై ఎలాంటి చర్చ పెట్టలేదన్నారు. కాంగ్రెస్, బిఆర్‌ఎస్ రెండూ కలిసే ఉన్నాయని, అందుకే ఈ రెండు పార్టీలు కలిసి తమిళనాడు సిఎం స్టాలిన్ సమావేశానికి వెళ్లాయని విమర్శించారు. జమ్మూకాశ్మీర్ ప్రత్యేక పరిస్థితుల నేపథ్యం లోనే నియోజకవర్గాల పునర్విభజన జరిగిందని తెలిపారు. బిజెపికి అన్ని రాష్ట్రాల సమానమేనని, ఏ రాష్ట్రానికి అన్యాయం చేయదని పేర్కొన్నారు. అనంతరం ఎంఎల్ఎ ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ నియోజకవర్గాల పునర్విభజనపై చర్చ పెట్టి, మాట్లాడేఅవకాశం ఇవ్వలేదన్నారు.

**పార్టీ మారిన వాళ్లకు అనర్హతవేటు తప్పదు: బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడికౌశిక్‌రెడ్డి**

పార్టీ మారినవాళ్లకి అనర్హత వేటు పడక తప్పదని, ఉప ఎన్నికలు తథ్యమని ఎంఎల్ఏ పాడికౌశిక్‌రెడ్డి అన్నారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింటవద్ద ఆయన మాట్లాడుతూ పార్టీ మారిన ఎంఎల్ఎల సభ్యత్వం రద్దు కాదని సిఎం రేవంత్‌రెడ్డి సభలో చెప్తున్నారని, ఆయన వ్యాఖ్యలు సుప్రీంకోర్టును అవ హేళన చేయడమేనన్నారు. శాంతిభద్రతల మీద ప్రశ్న అడిగితే సమాధానం చెప్పలేదన్నారు. గతంలోతన ఇంటిపైన దాడి చేసిన ఎంఎల్ గాంధీతోపాటు ఆయన అనుచరులపై ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడం ఎంతవరకు సమంజసమన్నారు. తన నియోజక వర్గంలో కెసిఆర్ హయాంలో రైతులకు నీళ్లొచ్చేవని, ఇప్పుడు ఎందుకు రావటం లేదని, ఇది ప్రభుత్వ వైఫల్యం కాదా? అని ప్రశ్నించారు.

**కాంగ్రెస్, బిజెపిలది లోపాయకారి ఒప్పందం బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే కెపి వివేకానందగౌడ్**

రాష్ట్రంలోని బిజెపి, కాంగ్రెస్ గల్లీలో కుస్తీ, ఢిల్లీలో దోస్తీ చేస్తున్నాయని, అసెంబ్లీ వేదికగా ఈ పార్టీల లోపాయికారి ఒప్పందం బయటవడిందని బిఆర్‌ఎస్‌ఎంఎల్ఏ కె.పి.వివేకానందగౌడ్ విమర్శించారు. గురువారం ఉదయం అసెంబ్లీ మీడి యా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ రాసిచ్చిన స్క్రిప్ట్‌నే బిజెపి సభ్యుల అసెంబ్లీలో చదువు తున్నారన్నారు. తాము అడిగే ప్రశ్నలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇరకాటంలోవడి సమాధానాలు చెప్పలేదని బిజెపి సభ్యులతో బిఆర్‌ఎస్‌పై దాడి చేయిస్తున్నదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు కేంద్రం అన్ని అనుమతులిచ్చిందని అలాంటిది ఓబిజెపి ఎంఎల్ఎ ఆ అనుమతులను తప్పు పడుతున్నారని విమర్శించారు. బిజెపి ఎంఎల్ఎలు కాంగ్రెస్ భాష మాట్లాడేకన్నా ఆపార్టీలో విలీనం అయితే మంచిదన్నారు. అనంతరం ఎంఎల్ఎ కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ కాంగ్రెస్ హటావో దేశ్‌కీ బచావ్ అంటూ మోదీ చెప్తారన్నారు. కానీ, ఇక్కడ కాంగ్రెస్‌ను కాపాడండి.. తెలంగాణను భ్రష్టు పట్టించండి అన్న రీతి లో బిజెపి వ్యవహారిస్తుందని విమర్శించారు.



# రెండు కేసుల్లో డ్రగ్స్, గంజాయి పట్టివేత

## 2.78 గ్రాముల ఎండిఎంఎ డ్రగ్స్

## 1.302 కేజీల గంజాయి స్వాధీనం

**హైదరాబాద్, మార్చి 27, ప్రభాతవార్త :** ఎస్టీఎఫ్ బీ టీమ్ రెండు కేసుల్లో డ్రగ్స్, గంజాయిని పట్టుకున్నారు. రెండు కేసుల్లో 2.78 గ్రాముల ఎండిఎంఎ డ్రగ్స్, 1.302 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రెండు కేసుల్లో ఐదుగురి అరెస్టు చేశారు. ఆరుగురు పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఎర్రగడ్డ మెట్రో స్టేషన్ సమీపంలో డ్రగ్స్ అమ్మకాలు జరుగు తున్నాయనే సమాచారం మేరకు ఎస్ టి ఎఫ్ బీ టీమ్ సీఐ బిక్షారెడ్డి టీమ్ సభ్యులు దాడులు నిర్వహించి 2.78 గ్రాముల ఎండిఎంఎ డగ్స్‌నుపట్టుకున్నారు. ఈ కేసులో రెండు మొబెయిల్స్‌తో పాటు డ్రగ్స్ అమ్మకాలు జరుపుతున్న ఎస్‌కె మహ్మమద్ రహీమ్, మహ్మమద్ ఫక్రుద్దీన్ లను అరెస్టు చేశారు. ఈ కేసులో సౌదీ అరేబియాకు చెందిన సఫాన్ , బెంగూళూరు సప్లయర్ ఇబ్రహీమ్ జహీర్‌లు ఉన్నట్లు గుర్తించి వారిపై కూడ కేసు నమోదా నమోదు చేసినట్లు అధికారులు తెలపారు. లోయర్ ధూల్‌పేట్ జుంగూర్. బస్తీలో గంజాయి అమ్మకాలుజరుగుతున్నాయని ఎస్టీఎఫ్ బీ టీమ్ ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించి 1.302 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో కునాల్ సింగ్, వినోద్ సింగ్, హేమబాయ్‌లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి నాలుగు సెల్ ఫోన్లు ,యాక్టివా హోండ వాహనాన్ని సీజ్ చేశారు. ఈ కేసులో అనికేష్ సింగ్, అర్తిబాయ్, సరేన్, గణేష్ సింగ్‌లు వీరిపై కూడ కేసు నమోదు చేశారు. వీరు పరారీలో ఉన్నట్లు సీఐ బిక్షారెడ్డి తెలిపారు. ఈ రెండు కేసుల్లో సీఐతోపాటు ఎస్సైలు బాలరాజు, సంధ్యా, కానిస్టేబుళ్లు యా దగిరి, అనీఫ్ , నితిన్, మహేశ్వర్, కౌశిక్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. గంజాయి, డ్రగ్స్‌ను పట్టుకున్న హెచ్‌టిఎఫ్‌టీమ్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి. కమలాసన్‌రెడ్డి, ఎస్‌టిఎఫ్ టీమ్ టీడర్ ప్రదీప్‌రావులు అభినందించారు.

## మహిళల ఛాలెంజ్ ట్రోఫీలో..

# జెమీమా టీమ్ 409 వద్ద డిక్లేర్



**న్యూఢిల్లీ:** జాతీయ సీనియర్ చాలెంజర్ ట్రోఫీలో స్నేహ్ రాణా సారథ్యంలోని గ్రూప్ డి 83 పరుగులతో వెనుకబడింది. జెమీమా రోడ్రిగ్స్ కెప్టెన్సీలోని టీమ్ సి 9 వికెట్ల నష్టానికి 409 పరుగులతో ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. ఈ మ్యాచ్‌లో రెండో రోజుఆట ముగిసే సమయానికి టీమ్ డి జట్టు 99 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 322 పరుగులు చేసింది. ఈ మ్యాచ్‌లో ధారా గుజ్జర్ ఎడాపెడా దుమ్మురేపింది. దీంతో (212 బంతుల్లో 103బ్యాటింగ్; 15 ఫోర్లు) అజేయ శతకంతో ధారా చెలరేగిం ది. ఇక తెలంగాణ ఆల్‌రౌండర్ గొంగడి త్రిష ఎర్రబంతితో 3రోజుల పాటు త్రుటిలో సెంచరీని చేజార్చుకుంది. త్రిష (137 బంతుల్లో 93; 15 ఫోర్లు, 1 సిక్స్) రాణించింది.కెప్టెన్ స్నేహ్ రాణా (28; 3 ఫోర్లు), నందిని (32; 5 ఫోర్లు), అమన్‌జ్యోత్ కౌర్ (34 బంతుల్లో 39 బ్యాటింగ్; 6 ఫోర్లు) ఫర్వాలేదనిపించారు.అంతకుముందు టీమ్ సి9 వికెట్లు కోల్పోయి 405 వద్ద తొలి ఇన్నింగ్స్ డిక్లేర్‌చేసింది. జట్టులోనిహాసబ్నిస్ సెంచరీ, అర్ధసెంచరీతో ప్రత్యర్థి గ్రూప్ డి ప్లేయర్లలో రైళ్ల పరుగెత్తించింది. హాసబ్నిస్ (185 బంతుల్లో 169; 20 ఫోర్లు, 6సిక్సులు) చెలరేగగా, షఫాలీవర్మ (104 బంతుల్లో108; 19ఫోర్లు) సెంచ రీలతో కదంతొక్కారు. టీమ్ డిబౌలరల్లో త్రిష, కాశ్వీ గౌతమ్ చెరో 3 వికెట్లు పడగొట్టారు. ప్రస్తుతం చేతిలో 5 వికెట్లు ఉన్న టీమ్‌డి ప్రత్యర్థి స్కోరుకు ఇంకా 83 పరుగులు వెనుకబడి ఉంది. ధారా గుజ్జర్‌తో పాటు, అమన్‌జ్యోత్ కౌర్ క్రీజులో ఉంది.

## సెపక్‌తక్రా వరల్డ్ కప్ టోర్నీలో..

# చాంపియన్‌గా భారత్

### జపాన్‌ను ఓడించి స్వర్ణం కైవసం



**న్యూఢిల్లీ:** సెపక్‌తక్రా ప్రపంచ కప్‌లో భారత జట్టు చాంపియన్‌గా నిలిచింది. బీహార్ రాజధాని పట్నా వేదికగా జరిగిన ప్రపంచ కప్ పురుషుల రెగూ ఈవెంట్‌లో భారత జట్టు స్వర్ణ పతకం సాధించింది. సెపక్‌తక్రా ప్రపంచ కప్‌లో భారత్ పురుషుల జట్టుకు ఇదే తొలి పసిడిపతకం కావడం విశేషం. కాగా, స్వదేశంలో జరిగిన ఈ టోర్నమెంట్‌లో భారత్ ప్లేయర్లు మొత్తం 7 పతకాలు సాధించారు. పురుషుల రెగూ ఫైనల్లో భారత్ 11-15, 15-11, 17-14 తేడాతో జపాన్‌పై విజయం సాధించి బంగారు పతకం కైవసం చేసుకుంది. తొలి సెట్లో ఓడి వెనుకబడిన భారత జట్టు, ఆ తర్వాత పుంజుకొని వరుసగా రెండు సెట్లు నెగ్గి విజేతగా నిలిచింది. ఈ క్రీడలో భారత జట్టు చక్కటి ప్రదర్శన కనబర్చింది. కేవలం స్వర్ణంతో సరిపెట్టు కోకుండా, ఈ ప్రపంచ కప్‌లో మరో 6 పతకాలు కూడా కైవసం చేసుకుంది. మహిళల డబుల్స్ విభాగంలో రజతం, పురుషుల డబుల్స్, మహిళల రెగూ, మిక్స్ క్వాడ్,మహిళల క్వాడ్, పురుషుల క్వాడ్ విభాగాల్లో కాంస్య పతకాలు నెగ్గింది. స్వదేశంలో జరిగిన సెపక్‌తక్రా ప్రపంచ కప్‌లో స్వర్ణం దక్కించుకుని భారత్ ప్రతిష్టను పెంచింది.






## మహిళల వన్డే వరల్డ్ కప్:

# 8 దేశాలు: 31 మ్యాచ్‌లు

### సెప్టెంబర్ 29 నుండి అక్టోబర్ 26 వరకు

**న్యూఢిల్లీ:** మహిళల వన్డే వరల్డ్ కప్-2025 టోర్నీకి భారత్ నాలుగో సారి ఆతిథ్యమివ్వనుంది. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) ఆధ్వర్యంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) నిర్వహించనున్న ఈ మహిళల వన్డే వరల్డ్ కప్ తేదీలు దాదాపు ఖరారయ్యాయి. ఈ ఏడాది సెప్టెంబర్ 29 నుంచి అక్టోబర్ 26 వరకు ఈ టోర్నమెంట్ జరగనుంది. ఈ తేదీలను ఐసీసీ, బీసీసీఐ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ఎనిమిది దేశాలకు చెందిన జట్ల మధ్య ఈ వన్డే వరల్డ్ కప్ జరగనుంది. మొత్తం 31 మ్యాచ్‌లు జరుగుతా యి. ఆతిథ్యదేశం భారత్‌తో పాటు, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, దక్షి ణాఫ్రికా, శ్రీలంక జట్లు ఇప్పటికే ఈ మెగా టోర్నీకి అర్హత సాధించాయి. ఏప్రిల్ 9 నుంచి 19 వరకు లాహోర్‌లో జరిగే క్వాలిఫయింగ్ టోర్నీ ద్వారా చివరి రెండు జట్లు ఖరారవుతాయి. క్వాలిఫయింగ్ టోర్నీలో పాకిస్తాన్, వెస్టిండీస్, స్కాట్లాండ్, బంగ్లాదేశ్, ఐర్లాండ్, థాయ్‌లాండ్ జట్లు పోటీపడనున్నాయి. ఒకవేళ పాకిస్తాన్ వరల్డ్ కప్‌కు అర్హత సాధించినట్లయితే ఈ మెగా టోర్నీని హైబ్రిడ్ మోడల్లో నిర్వహిస్తారు.

పాకిస్తాన్ జట్టు ఆడే మ్యాచ్‌ను శ్రీలంక లేదా యూఏఈలలో నిర్వహిస్తారు. ఇక ఈ ఏడాది భారత్ ఆతిథ్యమివ్వనున్న మహిళల వన్డే వరల్డ్ కప్ క్రికెట్ టోర్నమెంట్ వేదికల వివరాలు కూడా బహిర్గతమయ్యాయి. పంజాబ్ రాష్ట్రం, ముల్లాన్పూర్ లోని మహారాజా యాదవేంద్ర సింగ్ అంతర్జాతీయ స్టేడియం ఈ మెగా టోర్నీ ఫైనల్ మ్యాచ్‌కు ఆతిథ్యమివ్వనున్నట్లు తెలుస్తోంది. 34 వేల మంది ప్రేక్షకుల సామర్థ్యం గల ఈ స్టేడియం ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో పంజాబ్ కింగ్స్ జట్టుకు రెండో హోంగ్రౌండ్‌గా ఉంది. ముల్లాన్‌పూర్‌తో పాటు, విశాఖపట్నం, తిరువనంతపురం, ఇండోర్, రాయ్‌పూర్లలో వరల్డ్ కప్ మ్యాచ్‌లను నిర్వహిస్తారు. ముల్లాన్పూర్, తిరువనంతపురం, రాయ్పూర్లలో ఇప్పటివరకు మహిళల అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లు జరగలేదు.

కాగా మహిళల వన్డే వరల్డ్ కప్ టోర్నీకి గతంలోనూ భారత్ ఆతిథ్యమిచ్చింది. గతంలో భారత్ 1978, 1997, 2013లలో ఈ మెగా టోర్నీని నిర్వహించింది. ఇప్పటి వరకు వన్డే వరల్డ్ కప్ 12 సార్లు జరగ్గా, భారత్ రెండు సార్లు (2005, 2017) రన్నరప్‌గా నిలిచింది.





# లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, మార్చి 27:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. నిన్నటి భారీ నష్టాల నుంచి కోలుకున్నాయి. ఆటో దిగుమ తులపై 25 శాతం టారిఫ్‌లు విధిస్తామని ట్రంప్ పేర్కొనడంతో ఉదయం నష్టాల్లో ప్రారంభమైన సూచీలు, బ్యాంకింగ్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతుతో రాణించాయి. ఆటో, ఫార్మా, టెలికమ్యూనికేషన్ షేర్లు మినహా మిగిలిన అన్ని రంగాల షేర్లు రాణించాయి. నిఫ్టీ స్మాల్, మిడ్‌క్యాప్ సూచీల్లోనూ కొనుగోళ్ల మద్దతు కనిపించింది. ట్రంప్ టారిఫ్ ఎఫెక్ట్ నేపథ్యంలో జాగ్వార్ ల్యాండ్ రోవర్ మాతృ సంస్థ అయిన టాటా



మోటార్స్ షేర్లు 6 శాతం మేర కుంగాయి. జాగ్వార్ ల్యాండ్ రోవర్‌కు అమెరికా కీలకమైన మార్కెట్ కావడం ఇందుకు కారణం. సెన్సెక్స్ ఉదయం 77,087.39 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 77,082.51 77,747.46 పాయింట్ల మధ్య కదలాడిన సూచీ.. చివరికి 317.93 పాయింట్ల లాభంతో 77,606.43 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 105.10 పాయింట్లు లాభపడి 23,591.95 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.79గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో బజాజ్ ఫిన్‌సర్వ్, ఇండస్ ఇండ్ బ్యాంక్, ఎన్టీపీసీ, ఎల్‌అండ్‌టీ, అల్ట్రాటెక్ సిమెంట్‌షేర్లు లాభపడ్డాయి. టాటా మోటార్స్, సన్‌ఫార్మా, కోటక్ మహీంద్రా బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేర్లు నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 73.61 డాలర్లు వద్ద కొనసాగగా, బంగారం ధరలు మళ్లీ పెరిగి ఔన్సు 3087 డాలర్లు వద్ద ట్రేడయింది.






Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.